RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 01-02-2026 ఆదివారం | సంపుటి : 12 | సంచిక : 338 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on



## ఈ-సైకిళ్ల పంపిణీతో
# చరిత్ర సృష్టించాం
## ఒకే రోజు 5,555 ఈ-సైకిళ్ల పంపిణీ

**నూతన చరిత్రకు కుప్పం నుంచి శ్రీకారం**
**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**
**సైకిల్‌పైనే ప్రజావేదికకు..**
**గిన్నిస్ రికార్డు సాధించిన చిత్తూరు జిల్లా**

**కుప్పం :** కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు ఈ-సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. ''నూతన చరిత్రకు కుప్పం నుంచి శ్రీకారం చుట్టాం. కుప్పంలో 5,555 ఈ-సైకిళ్లు పంపిణీ చేసి చరిత్ర సృష్టించాం. గిన్నిస్ రికార్డు వచ్చిందని కాదు.. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయి. ఇంటిపై ఉత్పత్తయ్యే విద్యుత్‌తోనే సైకిల్‌కు ఛార్జింగ్ పెట్టుకోవచ్చు. ఈ సూపర్ సైకిల్.. పైసా ఖర్చు లేకుండానే దూసుకెళ్తుంది. సైకిల్‌కు ఓటేశారు.. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం'' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రజావేదికకు సైకిల్‌పై..**

అంతకుముందు శివపురం నుంచి ప్రజావేదిక వరకు ఈ-సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో చంద్రబాబు పాల్గొని దాదాపు 3 కి.మీ ఈ-సైకిల్‌పై వచ్చారు. 5,555 ఈ-సైకిళ్ల పంపిణీ చేపట్టి చిత్తూరు జిల్లా గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు ప్రకటించారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ అందుకున్నారు.

**కుప్పంలో డిజిటల్ లైబ్రరీ..**

చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలోని స్వర్ణ నవదిశ సెంటర్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక డిజిటల్ లైబ్రరీ, రాష్ట్రంలోనే మొదటి కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కేంద్రం విద్యార్థులు, నిపుణులకు ఇంటర్నెట్, ఆన్‌లైన్ టెక్ట్స్ బుక్స్, డిజిటల్ కంటెంట్ వంటి సదుపాయాలను అందిస్తుంది. ఐటి అభివృద్ధికి సాంకేతికతకు కుప్పంను ఒక వేదికగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు.
డిజిటల్ లైబ్రరీ, కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను కుప్పంలో ఏర్పాటు చేయటానికి (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సహకారంతో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ (ఏపీటీఎస్) నిధులు అందజేసిందని చెప్పారు. ఈ సెంటర్ ద్వారా విద్యార్థులు, ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారు, చిన్న వ్యాపారవేత్తలు, ఫ్రీలాన్సర్లు లబ్ధి పొందుతారని వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని పేద కుటుంబాల వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువత, కొత్తగా స్టార్టప్‌లు పెట్టే వారికి తక్కువ ఖర్చుతో ఆఫీసు వాతావరణం కల్పించడం, డిజిటల్ చదువులను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. కుప్పంలో ఇంత మంచి కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించటం ఎంతో సంతోషంగా ఉందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు. యువతకు ఉపయోగపడే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమానికి తోడ్పాటు అందించిన ఏపీటీఎస్ ఛైర్మన్ మోహన కృష్ణను ఈ సందర్భంగా అభినందించారు.

# కల్తీకి బీజం వేసిందే వైసీపీ

**మంత్రి పయ్యావుల కేశవ్**
- కల్తీ నెయ్యి వ్యవహారాన్ని నడిపించిన వారెవరో తేలాల్సిందే
- క్లీన్‌చీట్ అంటూ ఆ పార్టీ చేసుకునేది అసత్య ప్రచారం



**అమరావతి :** తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో వైకాపాకు క్లీన్‌చీట్ రాలేదని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. క్లీన్‌చీట్ అంటూ ఆ పార్టీ చేసుకునేది అసత్య ప్రచారమని మండిపడ్డారు. ఈ అంశంపై పయ్యావుల మీడియాతో మాట్లాడారు. ''లడ్డూ పవిత్రతను కాపాడేందుకు టీడీపీ ప్రభుత్వం అనేక నిబంధనలు ప్రవేశపెట్టింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిబంధనలు సడలించి కల్తీకి బీజం వేసింది. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉంది. జంతు అవశేషాలు ఉన్నాయని ఎన్డీడీబీ నిర్ధరణ చేసిన అంశమే సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఇదే అంశం సిట్ అనుబంధ ఛార్జ్‌షీట్ 35వ పేజీలోనూ స్పష్టంగా ఉంది''

**నెయ్యి కల్తీ జరిగిందని 2022లోనే తేల్చారు..**

''కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు అంత తేలిగ్గా వదలిపెట్టరు. ఈ వ్యవహారాన్ని నడిపించిన వారెవరో తేలాల్సిందే. సీఎం కుప్పం పర్యటన అనంతరం కఠిన చర్యలు తీసుకుంటారు. తిరుమలలో ప్రక్షాళన కొనసాగాల్సిందే. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా చాలా అంశాలు బయటకు రావాల్సి ఉంది. నెయ్యి కల్తీ జరిగిందని 2022లోనే తేల్చారు. ఆ నివేదికను తొక్కిపెట్టి అప్పటి వైకాపా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకు చర్యలు తీసుకోలేదో ఆ పార్టీ సమాధానం చెప్పాలి. దేవదేవుడి పట్ల వారికి నమ్మకం లేదనుకోవాలా?'' అని మంత్రి అన్నారు.

## లడ్డూ కల్తీ
# ముమ్మాటికీ పాపమే
## వైసీపీ కల్తీ రాజకీయాలపై ధ్వజం

- సిట్, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్‌లు ఇచ్చిన నివేదికలో నెయ్యి లేదు..
- పామోలిన్, కెమికల్స్ ఉన్నాయని తేలిందని వెల్లడి
- కమీషన్ల కోసమే నిబంధనలు సడలించి 'బోలే బాబా' సంస్థకు టెండర్లు
- దొంగతనం బయటపడ్డాక వైసీపీ నేతల దొంగవాదనలు సిగ్గుచేటు
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విమర్శ
- నిడదవోలులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

**నిడదవోలు, జనవరి 31(వుదయం) :** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న వాదనలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. నిడదవోలులో పర్యటించిన ఆయన కల్తీ నెయ్యి వ్యవహారంపై గత ప్రభుత్వం అనుసరించిన తీరును ఎండగట్టారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై మంత్రి కందుల దుర్గేష్ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 250 కోట్ల టర్నోవర్ ఉండాలనే నిబంధనను 100 కోట్లకు, 3 ఏళ్ల అనుభవాన్ని ఏడాదికి తగ్గించి తమకు కావాల్సిన 'బోలే బాబా' వంటి సంస్థలకు టెండర్లు కట్టబెట్టి కల్తీ ఘటనకు పాల్పడ్డారని విమర్శించారు. కమీషన్ల కోసం ఏ రకమైన ప్రమాణాలు పాటిస్తున్నారో చూడకుండా ఉండటం వల్లే కల్తీ నెయ్యి ఘటన చోటుచేసుకుందన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, సిట్ నివేదికలు కల్తీ జరిగినట్లు స్పష్టం చేశాయని, నెయ్యిలో పామోలిన్, మోనో గ్లిజరైట్ తదితర కెమికల్స్ వాడారని తేలిందని చెప్పారు. "దేవుడిపై నమ్మకం లేని జగన్ అండ్ కో, తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వడానికి కూడా వెనకాడారని గుర్తుచేశారు. డిక్లరేషన్ ఇమ్మంటే ఏకంగా దేవాలయాల పైనే నిందలేసిన ఘన చరిత్ర వైసీపీదన్నారు. సిట్ క్లీన్ చీట్ ఇచ్చిందని వైసీపీ నేతలు దొంగ వాదనలు చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఈ ఘటనపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ గద్దెనెక్కిన టీటీడీ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారని ఆగ్రహించారు.పాలే లేకుండా నెయ్యి ఎలా తయారు చేశారో స్పష్టం చేయాలని నిలదీశారు.పాపపు పనులు సిగ్గు లేకుండా చేసి మీ పాపాలను బయట పెట్టిన వారిపై నోటికి అద్దు అదుపు లేకుండా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు.స్వచ్ఛమైన నెయ్యికి బదులు విష తుల్యమైన కెమికల్స్ వాడటం భక్తుల ఆరోగ్యంతో పాటు మనోభావాలతో ఆడుకోవడం కాదా? అని ప్రశ్నించారు. ఒక పవిత్రమైన ఆలయ ప్రసాదం విషయంలో జరిగిన తప్పును ఒప్పుకోవాల్సింది పోయి, సిట్ నివేదికను...



**అంతర్జాతీయ ఎర్ర చందనం స్మగ్లర్**
# ముజామిల్ అరెస్ట్
## వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్



**తిరుపతి :** కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్‌ను ఏపీ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్ శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు.
''శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో టాస్క్‌ఫోర్స్ కఠిన చర్యలను చేపట్టింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నాం. మరో వైపు జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. పాత కేసుల్లో పరారీలో ఉన్న స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఇందులో భాగంగానే ఎప్పటి నుంచో పరారీలో ఉన్న మొహమ్మద్ ముజామిల్‌ను పక్కా ప్రణాళిక ప్రకారం అదుపులోకి తీసుకున్నాం. శనివారం తిరుపతి రూరల్ మండలం, చిత్తూరు – నాయుడుపేట రోడ్డు తనపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేశాం.
ఎర్రచందనం దుంగలను చైనాకు ఎగుమతి చేస్తూ, అదే ముసుగులో శేషాచలం అడవుల నుంచి ఎర్ర చందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ సెట్టు, సేటుభాయ్, వాజీబ్‌తో అతడికి పరిచయం ఉంది. బెంగళూరుకు చెందిన రవి ద్వారా ఎర్రచందనం దుంగలు తక్కువ ధరకే కొనేవాడు. ఆ ఎర్ర చందనం దుంగలను రైతుల వద్ద కొన్నట్టుగా ప్రభుత్వ అనుమతులు తీసుకొని, వాటిని చైనాకు అక్రమంగా రవాణా చేసి అధిక లాభాలు ఆర్జించేవాడు'' అని విచారణలో తేలిందని టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు.



## సీఎం చంద్రబాబుపై అంబటి
# అసభ్యపదజాలం

- ఎస్పీకి టీడీపీ నేతల ఫిర్యాదు
- అంబటిపై టీడీపీ నేతల ఆగ్రహం

**క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

**అమరావతి :** తిరుమల నెయ్యి కల్తీపై గుంటూరులో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కాసేపు ఉద్రిక్తతకు కారణమైంది. గోరంట్లలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మహాపాపం పేరుతో టీడీపీ నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని తొలగించాలని లేకుంటే తామే తొలగిస్తామని వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు శుక్రవారం చెప్పారు. ఈ క్రమంలో ఉదయం గోరంట్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అంబటి ఫ్లెక్సీ వద్దకు వస్తామని ప్రకటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం ఫ్లెక్సీ వద్దకు భారీగా చేరుకున్నారు.
గొడవ జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబును ఫ్లెక్సీ వద్దకు రావొద్దని కోరారు. అయితే ఆలయంలో పూజల తర్వాత రాంబాబు ఆ మార్గంలో వెళ్తుండగా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. రాంబాబు వాహనం దిగేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. ఆగ్రహంతో ఊగిపోయిన అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబును తీవ్ర అసభ్య పదజాలంతో దూషించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంబటి రాంబాబును పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు.
చంద్రబాబుపై అంబటి రాంబాబు వ్యాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు ఖండించారు. బరితెగించి మాట్లాడిన అంబటి రాంబాబు చంద్రబాబుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబటి రాంబాబుపై గుంటూరు జిల్లా ఎస్పీకి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. అంబటి ఇంటిపై టీడీపీ శ్రేణులు రాళ్లు రువ్వారు. కిటికీ అద్దాలు, పూలకుండీలు ధ్వంసం చేశారు. టీడీపీ మహిళా కార్యకర్తలు కోడిగుడ్లు విసిరి నిరసన తెలుపుతున్నారు. అంబటి వెంటనే క్షమాపణలు చెప్పాలని మహిళా కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. నవభారతనగర్‌లోని అంబటి ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. అంబటి ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. టీడీపీ మహిళలను వెనక్కి వెళ్లాలని పోలీసులు కోరారు.

# డిప్యూటీ సీఎంగా సునేత్రా పవార్

**మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రి**



**ముంబై :** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ పగ్గాలు చేపట్టడం విశేషం. ముంబయిలోని లోక్‌భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.
మహారాష్ట్ర బారామతిలో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ పరిణామంతో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన సతీమణి సునేత్రను పార్టీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఉప ముఖ్యమంత్రిగా ఆమె నేడు ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థికశాఖ మినహా ఎక్సైజ్, క్రీడా మంత్రిత్వ శాఖలను సునేత్ర కొనసాగించనున్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆర్థికశాఖను ప్రస్తుతానికి సీఎం దేవేంద్ర ఫడణవీస్ నిర్వహిస్తారని, కొంతకాలానికి ఎన్సీపీకి కేటాయించే అవకాశం ఉందని సమాచారం.




మిగతా 2లో



## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**కడప ఎంఈఓ కు యూటీఎఫ్ వినతి**

**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** కడప మండల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కడప మండల విద్యాశాఖ అధికారి రఫీక్ అహ్మద్ కు యుటిఎఫ్ కడప మండల శాఖ విజ్ఞప్తి చేసింది. శనివారం సాయంత్రం కడపలోని మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో ఎంఈఓ.. రఫీక్ అహ్మద్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు మాట్లాడుతూ మండల పరిధిలోని ఉపాధ్యాయుల పలు సమస్యలు పరిష్కారం కాకుండా అపరిష్కృతంగా ఉన్నాయని వెంటనే వాటిపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల పరిధిలోని మండల పరిషత్ ఉపాధ్యాయులతో పాటు కార్పొరేషన్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల ఇన్కమ్ టాక్స్ మొదటి త్రైమాసికం టిడిఎస్ పూర్తి చేశారని, అయితే వాటిలో పలు తప్పిదాలు ఉన్నాయని, వెంటనే వాటిని సవరించి రెండవ, మూడవ త్రైమాసిక టిడిఎస్ ను కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎయిడెడ్, కార్పొరేషన్, మండల పరిషత్ పరిధిలోని చాలామంది ఉపాధ్యాయులకు డిఎ అరియర్స్ జమ కాలేదని, రెండు ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే ట్రెజరీకి బిల్లు సమర్పించి డిఎ ను జమ చేయించుకునే చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలోని ఏపీ జీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్మెంట్ బిల్లులను పెండింగ్లో ఉంచకుండా సకాలంలో క్లియర్ చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రిజిస్టర్ లోని ఎంట్రీలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ వినతిపత్రంలోని అన్ని అంశాలను పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బి.రాజశేఖర్ రాహుల్, యుటిఎఫ్ ఆడిట్ జిల్లా కన్వీనర్ ఎం.ప్రభాకర్, కడప మండల ప్రధాన కార్యదర్శి ఎ.వెన్నయ్య, నాయకులు సుందరం, కేశవులు, ముజుబుర్ రెహమాన్, ప్రసాద్ రాజు, ప్రసన్న మేరీ, కె.ఎస్.స్వర్ణలత, హజ్మత్ జోహాన్, ఓబులరెడ్డి, రాజానంద్ రెడ్డి, శ్రీనివాసరాజు, శ్రీనాథ్, మధుసూదన్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, నాగన్న, మహమ్మద్ సాదిక్, శంకర్ రెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని

# దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి

- విద్యార్థులకు పిలుపునిచ్చిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి
- నలంద స్కూల్ లో సైన్స్ ఫెయిర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి 31, వుదయం న్యూస్:** భావి భారత పౌరులుగా విద్యార్థులు ఎదిగి సమాజానికి గౌరవం తీసుకురావాలని, వారిని నమ్మి చదివిస్తున్న తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా క్రమశిక్షణతో ఉన్నత విలువలతో ముందుకు సాగాలని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సూచించారు. కావలి పట్టణం కోఆపరేటివ్ కాలనీ లోని నలంద స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న శక్తి, యుక్తి, నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లక్ష్యాలు, మోటివేషన్‌ను వెలికి తీసే విధంగా ప్రతి విద్యార్థి ఒక కాన్సెప్ట్‌తో ముందుకు వెళ్లేలా డిజైన్ చేసిన అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు. టెక్నాలజీని చూపించి, ఆ టెక్నాలజీని ఎక్స్‌ప్లెయిన్ చేసే విధానాన్ని పిల్లలకు నేర్పిన ఉపాధ్యాయులు, అలాగే సహకరించిన తల్లిదండ్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల్లో ప్రతిభ చాలా అవసరమని, పాఠ్యపుస్తకాలలోని పాఠాలతో పాటు జీవిత పాఠాలు నేర్చుకునేలా ఇలాంటి సైన్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ఫెయిర్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ వొకాబులరీ, భూమి–ప్రకృతి అంశాలు, అరణ్య సంరక్షణ, రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూభ్రమణం, సోలార్ ఎనర్జీ వంటి అనేక విభాగాలకు సంబంధించిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. [illegible] వినోదానికంటే చూసి నేర్చుకుంటేనే నిజమైన నాలెడ్జ్ పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు ఒకరినొకరు ఎక్స్‌ప్లెయిన్ చేసుకుంటూ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇంజనీర్, డాక్టర్, ఐఏఎస్ వంటి లక్ష్యాలను ఇప్పటి నుంచే మనసులో పెట్టుకుని దృఢ సంకల్పంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వసీమ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తటవర్తి రమేష్, కండ్లగుంట మధుబాబు నాయుడు, తిరివీధి ప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ కన్వీనర్ జయవర్ధన్**



**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది మంది పేద, దళిత, గిరిజన, బీసీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కావాలని ప్రభుత్వం నిలిపివేసిందని, విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ కన్వీనర్ జయవర్ధన్, రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రాజేంద్ర ప్రసాద్ లు తీవ్రంగా మండిపడ్డారు. శనివారం కడప నగరం లోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు కాలేజీ నుంచి బయటకు నెట్టబడుతున్న పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక హాల్ టికెట్లు నిరాకరించబడుతున్నాయని, పరీక్షలు రాయలేని దుస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధం అని, విద్యార్థి వ్యతిరేక పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ దయ కాదు, విద్యార్థుల హక్కు అని, ఈ హక్కును కాలరాస్తూ విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అఖిల భారత విద్యార్థి బ్లాక్ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని, కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకుండా కఠిన ఆదేశాలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, కలెక్టరేట్లు, విద్యాశాఖ కార్యాలయాల ముట్టడితో పాటు తీవ్ర ప్రజా ఉద్యమాలు చేపడతామని జయవర్ధన్ స్పష్టం చేశారు. ఒకవైపు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటే మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు మరిచి విద్యార్థులను మోసం చేస్తోందని వాపోయారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే అఖిల భారత విద్యార్థి బ్లాక్ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గురయ్య పాల్గొన్నారు.

## అధికారంతో బయటపడిన జగన్ అసలు నైజం

**టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి**



**విజయవాడ జనవరి 31 వుదయం న్యూస్ బ్యూరో:-** మనిషి నైజం తెలుసుకోవాలంటే అధికారమివ్వాలనే అభిప్రాయం లింకన్ అన్న మాటను జగన్ పాలన పూర్తిగా రుజువు చేసిందని, అధికారం చేతికి రాగానే జగన్‌లోని స్వార్థం, ప్రతీకార రాజకీయాలు రాష్ట్ర ప్రజలపై పడ్డాయని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. శనివారం ఉదయం 14వ డివిజన్ ఎస్.ఎస్.ఎం స్కూల్ ఏరియాలో టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పర్యటించి స్థానికుల నుండి సమస్యలు తెలుసుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల మరణించిన సగ్గురి ముత్తేశ్వరరావు కుమార్తె స్కూల్ ఫీజు నిమిత్తం సొంత నిధుల నుండి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ 2019లో తాను గెలిస్తే రూ. 2 వేలు ఉన్న పింఛను రూ.3 వేలు చేస్తానని చెప్పిన జగన్ అధికారం వచ్చాక విడతల పేరుతో వెయ్యి రూపాయలు పెంచడానికి 5 ఏళ్ళు కాలయాపన చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ. 3 వేలు ఉన్న పెన్షన్ రూ.4 వేలు చేస్తానని చంద్రబాబు మాట ఇచ్చారని ఇచ్చిన మాట ప్రకారం మొదటి నెలలోనే పింఛన్ పెంచి ఇంటింటికి అందించారు అన్నారు. అధికారం వస్తే మనిషి నైజం ఎలా బయటపడుతుందో జగన్ తన నియంత పాలనతో నిరూపిస్తే, చంద్రబాబు ప్రజా పాలనతో రుజువు చేశారన్నారు. అహంకార పాలన, అబద్ధ హామీలు, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇక రాష్ట్రంలో చోటు లేదని ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు జగన్ మరియు వైకాపా పార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల ముందు సిద్ధం సభలు తప్ప ప్రజల ముఖం చూడని జగన్ ఇప్పుడు పాదయాత్ర పేరుతో కొత్త డ్రామాలకు తెరలేపారని, ప్రజల సమస్యలను పట్టించుకోని జగన్ అసలు నైజాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని, మరోసారి మోసపోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని గద్దె క్రాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కర్ణా రమేష్, గరికిపాటి శ్రీనివాస్ (బద్రి), నూతి శ్రీనివాస్, రాధారపు ఎల్లబాబు, చెరుకూరి సాంబయ్య, కర్ణ కోటేశ్వరరావు, నూతలపాటి సాంబశివరావు, కెల్లా రమేష్, మరదాని జ్యోతి, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

## వ్యక్తిగత వివాదంగా మళ్లించడం దారుణం

- ఇంటి కూల్చివేత ఘటనపై ఎమ్మెల్యే మాధవరెడ్డి, టిడిపి శ్రీనివాసుల రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు, అఖిలపక్ష నాయకులు



**కడప, జనవరి 31 (వుదయం ప్రతినిధి)** ఎర్రముక్కపల్లె కంది పాలెం లో మాజీ సైనిక దళిత కుటుంబ ఇంటి కూల్చివేత ఘటనపై ఎమ్మెల్యే మాధవరెడ్డి, టిడిపి శ్రీనివాసుల రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని, ప్రజా ఉద్యమాలను అణచివేయాలనే కుట్రతోనే బ్లాక్మెయిల్ రాజకీయాలంటూ, వ్యక్తిగత వివాదం అంటూ తప్పించుకోవడం నైతిక రాజకీయాలకు తిలోదాకాలు ఇవ్వడమే అని అఖిలపక్ష నేతలు, బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శనివారం స్థానిక వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు , న్యాయవాది సట్టి భారవి ,భాస్కర్, ఓబులమ్మ, మాధవి లు, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సంగటి మనోహర్, ఎస్సీ ఎస్టీ రాయలసీమ హక్కుల నేత జేవి రమణ, సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు గౌస్ పీర్ ,టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య లు మాట్లాడారు కడప నగరంలో ఎప్పుడు లేని కొత్త సంస్కృతి కి తెరలేపి,వందమంది అల్లరి మూకలు మూకుమ్మడిగా దళిత కుటుంబం పై దాడి చేసి ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేసి దాదాపు పది లక్షల రూపాయల ఆస్తి నష్టం చేకూర్చిన ఘటనపై మరియు బాధిత కుటుంబానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పక్షాలు ప్రజా సంఘాల నాయకులపై కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి, టిడిపి పోలీస్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడిన మాటలు నిర్లక్ష్య అహంకారపూరిత వ్యాఖ్యలనీ మండిపడ్డారు. ఈ సమావేశంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి మద్దిలేటి, మల్లికార్జున, భాగ్యలక్షి , దళిత సంఘం నాయకులు దేవా, మహాజన రాజ్యం నేత అమీన్ పీరా, మాజీ సైనికులు ధనుంజయ, కుటుంబ సభ్యులు అనూష, విద్యారణ్య, వనజ పాల్గొన్నారు.



## అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్**

**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** కడప క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ కోరారు. కడప నగర శివారు ప్రాంతంలో కడప నైట్ రైడర్స్ క్రికెట్ అసోసియేషన్ , ఖాన్ కా రిష్ట అధ్యక్షుడు తారీక్ అలీ సంయుక్త ఆధ్వర్యంలో విజయ్ ప్రీమియర్ లీగ్ సీజన్ – 8 క్రికెట్ పోటీల లో పాల్గొంటున్న క్రీడాకారులను శనివారం ఆయన కలిసి మాట్లాడారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. హైస్కూల్ స్థాయి విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులను ఎక్కువగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. యువత పెడదారిన వెళ్లకుండా వారిని క్రీడల వైపు మళ్లించాలని సూచించారు. సమాజంలో ఉండే రుగ్మతల నిర్మూలన, దేహదారుఢ్యం, ఆరోగ్య సంరక్షణలో క్రీడలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. చాలామంది జిల్లాలోని యువత వివిధ క్రీడలలో పాల్గొని తమ ప్రతిభ చాటుతున్నారన్నారు. క్రికెట్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో కడప నుండి ఆడాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొంటున్న పర్పుల్ క్రికెట్ టీం ను కలిసి అభినందనలు తెలియజేశారు. సదరు టీం కెప్టెన్ అబ్దుల్ రజాక్ ఇతర క్రికెట్ టీం లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్చార్జులు ఎస్. హమీద్ జహూర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విస్తృత సమావేశం జయప్రదం చేయండి

**సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపు**

**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జిల్లా విస్తృత సమావేశం నేడు యూటీఎఫ్ ఆఫీసులో ఉదయం 11 గంటలకు కడపలో జరుగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసు ల రెడ్డి ,మనోహర్ జిల్లా కోశాధికారి బి లక్ష్మీదేవి లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ,జి ఓబులకొండ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కనుక జిల్లా వ్యాప్తంగా మనకు వున్న అన్ని మండల, రంగాల కమిటీలు , ముఖ్యమైన నాయకత్వం సమయానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

## వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దామిశెట్టి



**కావలి, జనవరి 31, వుదయం న్యూస్:** కావలి కి చెందిన దాంశెట్టి సుదీర్ నాయుడు కు వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శ గానియమిస్తున్నట్లు వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం నుండి ఉత్తరువులు వెలువడ్డాయి. గతంలో దామిశెట్టి సుదీర్ నాయుడు వైఎస్ఆర్సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం జనరల్ సెక్రెటరీ గా నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ గా, జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ గా పనిచేశారు. దశాబ్దాలు గా రాజకీయాలలో ఉన్న కుటుంబం గా కావలి నియోజకవర్గ పరిధిలో వారికి మంచి గుర్తింపు ఉంది. గతంలో వారి తల్లి శాంతమ్మ కావలి రూరల్ మండల యం.పి.పి గా మరియు జడ్పిటిసి గా పని చేశారు. అదేవిధంగా వారి తండ్రి దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు కావలి మున్సిపల్ కౌన్సిలర్ గా పనిచేశారు. వారి బాబాయ్ పూర్ణచంద్రరావు కావలి రూరల్ మండలం కు ఎంపీపీ గా అదేవిధంగా మరో బాబాయ్ జిల్లా డిసిఎంఎస్ డైరెక్టర్ గా పనిచేయటం జరిగింది. ఈ నేపథ్యంలో సుధీర్ నాయుడు కు కీలక భాద్యతలు అప్పగించటం పార్టీ కి ఉపయోగపడుతుందని పార్టీ అభిమానలు , నాయకులు అభిప్రాయపడుతున్నారు.

## ఒక్కరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**ప్రొద్దుటూరు, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** రాష్ట్ర టీడీపి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి శనివారం మండలం లోని గోపవరం పంచాయతీ, యానాది కాలనీలో ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పించన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, కార్మికులు, వితంతువులు, వ్యాధిగ్రస్తులకు తదితర బలహీన వర్గాల వారికి గౌరవంగా ఆర్థిక భద్రత కల్పించే విధంగా మన కూటమి ప్రభుత్వం ప్రతినెల అర్హులైన పెన్షన్ దారులందరికీ రూ.4,000, రూ,6,000, రూ.10,000 ఇచ్చి గౌరవిస్తుందని, అందులో భాగంగా లబ్ధిదారుల సంతోషాల కొరకై ఒకరోజు ముందే అంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిన కార్యక్రమం చేపట్టడం హర్షనీయమని వివరించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 63.12 లక్షల పింఛన్దారులకు ప్రతి నెల ఒకటో తేదీన రూ. 2743.99 కోట్లు కూటమి ప్రభుత్వం వెచ్చిస్తుందని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ బలహీన వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఆవుల రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లాబకాష్, మాజీ ఎంపీటీసీ రమణ, కంభం రామాంజనేయ రెడ్డి. కదిరి రామక్రిష్ణ రెడ్డి, అంకన్న, ఆర్ఎంపి శివ, దేశిరెడ్డి గురివి రెడ్డి, వెంకటేష్ యాదవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కావలిని మోడల్ పట్టణంగా అభివృద్ధి

- పేదలను కంటికి రెప్పలా కాపాడే ప్రభుత్వం మనది
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి
- 16వ వార్డులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి 31, వుదయం న్యూస్:** ప్రజలకు తాగునీరు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కావలిని మోడల్ పట్టణంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన కావలి పట్టణం 16వ వార్డు ఇందిరమ్మ కాలనీలో అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల ఒకటవ తేదీన అందించే పెన్షన్ల కార్యక్రమాన్ని ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే అమలు చేసి, అర్హులైన అవ్వ–తాతలు సహా ప్రతి లబ్ధిదారునికి పెన్షన్లు అందించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు పేదలకు ముందస్తు సాయం అందించడం జరిగిందన్నారు. ఒకటో తేదీ అంటే పేదల పండుగగా మారిందని, పేదలను కంటికి రెప్పలా కాపాడే ప్రభుత్వం తెలుగుదేశం, బీజేపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వమేనని అన్నారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తటవర్తి రమేష్, టీడీపీ నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, మున్సిపల్ డిఈ సాయిరామ్, సచివాలయ సిబ్బంది, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యూనివర్సిటీల ద్రోహిగా మారిన సీఎం

- రూ.వందల కోట్ల నిధులు ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లింపుతో తీవ్ర నష్టం
- తక్షణమే నిధుల మళ్లింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి
- ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు యాదవ్

**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** రాష్ట్ర వ్యాప్తంగా వున్న యూనివర్సిటీ ల వందల కోట్ల రూ. నిధులు బ్యాంకు ల్లో డిపాజిట్ లు గా వున్నా వాటిని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ కు బదిలీ చేయాలనే నిర్ణయం వర్సిటీ లకు గొడ్డలి పెట్టు లాంటిదని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు అన్నారు. శనివారం ఆర్ఎస్ఎఫ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి మూల స్థంబాల్లాంటి వర్సిటీల నిధులను దారి మళ్లించడం దారుణం అన్నారు. పరిశోధనల్లో, బోధనల్లో గొప్పగా వుంటూ భవిష్యత్ తరాలకు దీక్షచిగా ఉండాల్సిన వర్సిటీలా నిధులు దారి మళ్లించడం వలన భవిష్యత్తు ను నాశనం చేసినట్లే అన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రత్యక్ష్యంగా ఉన్నత విద్యామండలిని, వర్సిటీ అధికారులను బెదిరింపులకు దిగుతూ వర్సిటీ ల యొక్క నిధులను దారి మళ్లించాలనుకుంటే విద్యార్థి లోకం చూస్తూ ఊరుకోదన్నారు. సంవత్సరాలనుండి రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీ లకు విద్యార్థులే ఫీజుల రూపంలో చెల్లించినవి బ్యాంకు డిపాజిట్ లుగా ఉన్నాయని, అవి వర్సిటీ ల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ఈ నిర్ణయం వెనక్కు తీసుకోకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

## రమేష్‌ను హత్య చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి



**దళిత సంఘాలు డిమాండ్**



**కర్నూల్, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** కర్నూలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని 10 గంటలకు ముట్టడించిన SC ST ల దళిత నాయకులు బొందు మడుగుల రమేష్ హత్య చేసి చంపిన వ్యక్తులను పై జరిగిన హత్య దాడిని ఖండిస్తూ నిరసన దళిత జైసి నాయకులు పాల్గొన్నారు. బోందుమడుగుల రమేష్ ఎమ్మార్పీఎస్ ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గిలి మండలం బొందు మడగల గ్రామం లో బొంతిరాళ్ల రోడ్డులో ఇంటి నుంచి వాకింగ్ చేస్తున్న వ్యక్తిని ట్రాక్టర్ తో గుద్ది సుమారు పదిమంది దాకా దాడి చేసి రాడుతో కొట్టి తలకు హత్య చేసి చంపారు. బోందు మడుగుల రమేష్ కుటుంభానికి ఐదు కోట్లు ఎక్స్ప్రెషన్ కూటం ప్రభుత్వం కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని దళితుల పై దాడులు స్పందించకపోతే రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ భారతీయ జనతా పార్టీ జనసేన పార్టీలో నామా రూపాలు లేకుండా చేస్తాం జేఏసీ దళిత నాయకులు శనివారం ఉదయం 09:00 గంటలకు కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు నిరసన జేఏసీ దళిత నాయకులు 500 మందితో నిరసన తెలియజేశారు. బొండుమడుగుల రమేష్ ని దాడి చేసి గాయపరిచిన వ్యక్తులలో వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలి ముద్దాయిలు కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. బొందిమడుగుల రమేష్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వర్కింగ్ ప్రెసిడెంట్ ని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు 30 తేదీ దినమున సాయంకాలం కర్నూలు జిల్లా బొందిమడుగుల గ్రామం సమీపంలోని బొంతిరాళ్ల రోడ్డులో ఇంటి నుంచి వాకింగ్ బయలుదేరిన సమయంలో అదే గ్రామానికి చెందిన కొంతమంది ముస్లిం యువకులతో పాటు మరి కొంతమంది కలిసి ఆయన వెనుక నుంచి ట్రాక్టర్ తో ఢీ కొట్టి రాడ్ తో కొట్టి చంపడానికి ప్రయత్నించారు. దారుమించు కొంతమంది చూసి దారిలో బొండుమడుగుల రమేష్ స్పృహ తప్పిపోయిన తర్వాత రాడ్లతో రాడుతో కొట్టి పారిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఆయనను మెరుగైన చికిత్స కోసం హుటా హుటిన కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కర్నూల్ నగర మందు ప్రైవేట్ హాస్పిటల్ నందు ట్రీట్మెంట్ తీసుకుంటూ తలకి గాయమైనందున శనివారం రోజు ఉదయం 8:30కు చనిపోవడం చనిపోయారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా దళిత జేఏసీ నాయకులు కుటుంబ సభ్యులు మంచాల లక్ష్మీనారాయణ బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , దండు వీరయ్య , ఏపీ ఎమ్మార్పీఎస్, అలగరి రవి , నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మల్లెపోగు చందు , కర్నూలు సిటీ ఎమ్మార్పీఎస్ అరుణ్ కుమార్ బహుజన్ సమాజ్ పార్టీ కర్నూల్ జిల్లా ఇంచార్జ్ CH .మద్దయ్య YSRCP కర్నూలు జిల్లా మాజి DCMS చైర్మన్ , రాజు కుమార్ బహుజన్ సమాజ్ పార్టీ కర్నూల్ సిటీ ఇంచార్జ్ , రెడ్డి పోగు భాస్కరు ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు గుమరాల సుధాకర్ , బహుజన్ సమాజ్ పార్టీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి

**పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్**



**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** రాయలసీమ విద్యార్థుల, యువజనల విద్య ఉపాధి హక్కులకై ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ పిలుపునిచ్చారు. కడప నగరంలో శనివారం పీ డీ ఎస్ యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయం ఆవరణములో గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కె. భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న, జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర మాట్లాడుతూ ఫిబ్రవరి 4 కడప నగరంలో యుటిఎఫ్ భవన్ నందు జరుగు రాయలసీమ ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని ఈ సదస్సుకు ముఖ్య వక్తులుగా రాయలసీమ ఉద్యమ నేత భూమన్ గారు, ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి రాంకుమార్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఇండ్ల ప్రభాకర్, హరికృష్ణ గారు హాజరవుతారని అన్నారు. తర తరాలుగా రాయలసీమ తీవ్ర కరువులకు గురవుతూనే ఉంది. దీనికి కారణం రాయలసీమ ప్రజలు వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి అన్ని రంగాల్లో వెనుకబాటు గురవుతుందనీ అన్నారు. 78 ఏళ్ల స్వాతంత్రంలో 43 సంవత్సరాలు రాయలసీమ నాయకులే పరిపాలన సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కడప అన్నమయ్య జిల్లా నాయకులు చందు, జస్వంత్, సురేష్, లావణ్య , కౌసల్య, నవ్య, మౌనిక, పావని, శ్రీవిద్య, గాయత్రి , సౌజన్య , మణి పాల్గొన్నారు.

## సివిల్ రైట్స్ డే

**ఆత్మకూరు రూరల్ (వుదయం ప్రతినిధి)** జనవరి 31వ తేదీ ఆత్మకూరు రూరల్ మండలం చెర్లో ఎడవల్లి గ్రామం ఎస్సీ కాలనీలో సాయంత్రం 4 గంటలకు సివిల్ రైస్ డే కార్యక్రమాన్ని ఆత్మకూరు ఎమ్మార్వో ఆఫీస్ డిటి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఈ ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్, జలానీ భాష సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ,ఆర్ఐ కొండయ్య ఆత్మకూరు డివిజన్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య హాజరవ్వడం జరిగింది. అధికారులు ఈ కాలనీలో సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని ఈ యొక్క పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం కేవలం ఒక ఎస్సీ ఎస్టీ కాలనీలో మాత్రమే ఏర్పాటు చేయడం జరుగుతుందని కాలనీలో వివిధ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాల్సింది అని చెప్పి అధికారులు తెలియజేయడం జరిగింది. ఎస్సీ కాలనీవాసులు తమ కాలనీ ఉన్నఈ సమస్యలు విన్న అధికారులు వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ ప్రజలు వీఆర్వో, హెల్త్ అసిస్టెంట్, అంగనవాడి టీచర్ అండ్ హెల్పర్ పాల్గొన్నారు

## ఆశాజనకంగా కేంద్ర బడ్జెట్ 2026 పై అంచనాలు

**న్యాయవాది బి. పాల్ సుధాకర్**



**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** శనివారం అడ్వకేట్ బి. పాల్ సుధాకర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక బడ్జెట్పై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం సమర్పించనున్న యూనియన్ బడ్జెట్–2026 నేపథ్యంలో లోక్సభను ఫిబ్రవరి 1, 2026 (ఆదివారం) వరకు వాయిదా వేసిన విషయం ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన తెలిపారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, భారతదేశానికి మాత్రం భవిష్యత్ ఆశాజనకంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం నెమ్మదిగా చీకటి దిశగా సాగుతున్నా, భారతదేశం మాత్రం ప్రకాశవంతమైన ఆర్థిక భవిష్యత్తు వైపు ముందుకెళ్తోంది” అని ఆర్థిక సర్వే స్పష్టం చేసిందని ఆయన అన్నారు. ఆర్థిక సంవత్సరం 2025–2026 కు మధ్యకాలిక వృద్ధి అంచనాను 7 శాతం కు పెంచినట్టు సర్వే పేర్కొనడం దేశ ఆర్థిక బలానికి నిదర్శనమని తెలిపారు. అలాగే ఆర్థిక సంవత్సరం 2026–2027 లో భారత ఆర్థిక వృద్ధి 6.8% నుండి 7.2% మధ్య ఉండవచ్చని సర్వే అంచనా వేసినట్టు ఆయన వివరించారు.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు భారతదేశానికి కొంత మేర ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం సమతుల్యమైన, ప్రజానుకూలమైన బడ్జెట్ను ప్రవేశపెట్టాలని ఆయన ఆకాంక్షించారు. యూనియ న్ బడ్జెట్ ద్వారా దేశ ఆర్థిక వృద్ధి మరింత బలపడే విధంగా నిర్ణయాలు తీసుకుంటారని దేశ ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని అడ్వకేట్ బి. పాల్ సుధాకర్ తెలిపారు.

## క్యాట్ లెవెల్-2లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయకేతనం



**ప్రొద్దుటూరు, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** పట్టణ సమీప రాజేశ్వరి కాలనీ లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఐకాన్ మరియు సి–బ్యాచ్ విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఏ.జి.యం నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో క్యాట్ లెవెల్–2లో 161 మంది విద్యార్థులు విజయం సాధించారని, అందులో 29 మంది 29 వేల రూపాయల నగదు బహుమతి,78 మంది పథకాలు, 54 మంది ప్రసంశ పత్రాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మురళీధర్ రావు, ప్రిన్సిపల్ వినోద్, కీర్తన, దీన్ పవన్, ఇంచార్జ్ జనార్ధన్, జయరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొని ఇంతటి విజయానికి కారణమైన తల్లిదండ్రులను, విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## డిగ్రీ పరీక్షల్లో విస్తృత తనిఖీలు

**8 మంది విద్యార్థులు డిబార్**



**కడప, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** యోగి వేమన విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 8 మంది డిబార్ అయినట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి కృష్ణారావు తెలిపారు. మైదుకూరు ఎస్విఎస్వెఎం డిగ్రీ కళాశాలలో ఇద్దరు, పుల్లారెడ్డిపేట ఎస్ ఎల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఆరుగురిని డిబార్ చేసామన్నారు. ఆ కేంద్రాలను తనతో పాటు హైపవర్ కమిటీ సభ్యులు డా. ఎస్ వి సుబ్బారెడ్డి, కట్టా వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించామన్నారు. ఒంటిమిట్టలోని డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని హై పవర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ రియాజున్నీసా, డాక్టర్ మాదక్క తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణారావు మాట్లాడుతూ వైయస్సార్ కడప, మదనపల్లి, తిరుపతి జిల్లాలలోని పరీక్ష కేంద్రాలకు అబ్జర్వర్లతోపాటు తనిఖీ బృందాలు పర్యవేక్షిస్తున్నాయన్నారు. శనివారం జరిగిన పరీక్షలకు 7,322 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షలు ప్రశాంత కరమైన వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపారు.

# పవిత్రమైన వెంకన్న ప్రసాదంపై పచ్చ విషం

- తిరుమల లడ్డులో జంతువు కొవ్వు అబద్ధం..
- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు






**ప్రొద్దుటూరు, జనవరి 31, (వుదయం ప్రతినిధి)**స్థానిక ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలోని వెంకటేశ్వర స్వామి గుడిలో శనివారం తిరుమల లడ్డుపై చంద్రబాబు ఘోర అపచారాలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.... తిరుమల లడ్డులో కల్తీ జరిగిందని విష ప్రచారానికి తెరలేపిన నేపథ్యం రాష్ట్ర చరిత్రలో చంద్రబాబు చేసిన అతి పెద్ద కుట్ర నేటితో సమాప్తమైందని అందుకు నిదర్శనం నేటి కోటి తీర్పు అని ఇది వైఎస్ఆర్సిపి తరఫున జగన్మోహన్ రెడ్డి పాలనకు నిజాయితీకి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు భారత దేశంలోని 120 కోట్ల హిందువుల మనోభావాలను శిద్రం చేశాడని, జగన్మోహన్ రెడ్డికి హిందువులను దూరం చేసి వైసీపీకి ఓట్లు వేయకూడదనే గొప్ప కుట్ర చంద్రబాబు పన్నాడని మండిపడ్డారు. అపవిత్రం అపచారం అవినీతి ఇవి వేరు అంశాలు కానీ తిరుమల లడ్డులో అవినీతి జరిగిందంటే ప్రజలు బాధపడరు అపచారం జరిగిందంటే బాధపడతారని ఆ అంశాన్ని తెర తీశారు. లడ్డులో జంతువుల కొవ్వు కలవలేదు, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్, పచ్చ పత్రికల శరీరాలలో కొవ్వు కొవ్వు ఎక్కువైందని కొవ్వు ఎక్కువై మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. కల్తీ పార్టీలన్నీ కలిసి కల్తి రాజకీయానికి తెరతీసి కల్తీ మాటలు మాట్లాడుతున్నారని ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు, చింతల దానమ్మ, ప్రభాకర్ రెడ్డి, ఝాన్సీ,జెస్టాది శారదా, గర్నపాటి లక్ష్మీదేవి, రాగుల శాంతి, కందుల వాసంతి, పార్వతి, పావని, శివ, గోన ప్రభాకర్, పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

# లడ్డూ కల్తీ ముమ్మాటికీ పాపమే..




## మొదటి పేజీ తరువాత..

తప్పుగా ప్రచారం చేస్తూ ఇంకా రాజకీయ పబ్బం గడుపుకోవడానికి సిగ్గులేకుండా దిగజారుతున్న వైసీపీ ముఠా బరితెగింపు ధోరణి చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు.స్వచ్ఛమైన నెయ్యికి ఉండాల్సిన ఏ లక్షణాలూ లేకుండా, కేవలం కృత్రిమ రసాయనాలు, సబ్-స్టాండర్డ్ ఆయిల్స్‌తో నెయ్యి తయారు చేసినట్లు సిట్ చెపితే దానికి వంకర భాష అద్ది నోటికి వచ్చిన మాటలు మాట్లాడుతున్న వైసీపీ నేతలను కఠినంగా శిక్షించాలన్నారు.శ్రీవారి దర్శనం, ప్రసాదం విషయంలో చిన్న తప్పు జరిగినా హిందువులు తమ ఇంట్లో జరిగినట్లే భావిస్తారని గుర్తుపెట్టుకోండని హెచ్చరించారు. దొంగతనం బయటపడిన తర్వాత వైసీపీ వాళ్లు తమను తాము సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కల్తీ నెయ్యి విషయంలో వాళ్లు చేసింది ముమ్మాటికీ తప్పేనని ఖండించారు. వైసీపీ వాదనను ఎవరూ సమర్థించరు అని తెలిపారు. తిరుమల తిరుపతి లాంటి దేవాలయ పవిత్రత ఇలాంటి వ్యక్తుల వల్ల ఎలా కాపాడబడుతుందని నమ్మాలో తెలపాలని అడుగుతున్నారన్నారు.ఈ అంశంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి దుర్గేష్ తెలిపారు.

## ప్రజల సంతృప్తే కూటమి ప్రభుత్వానికి గీటురాయి..

ప్రజల సంతృప్తే కూటమి ప్రభుత్వానికి గీటురాయి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.శనివారం నిడదవోలు పట్టణంలోని 10వ వార్డు రజకుల వీధిలో 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ స్వయంగా ప్రతి ఇంటికీ నడిచి వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పెన్షన్లను అందజేశారు.పెన్షన్ పంపిణీ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ లబ్ధిదారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. అవ్వాతాతల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పంపిణీ సమయంలో ఎదురైన కొన్ని స్థానిక సమస్యలపై అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు.కొందరికి వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు.ఒక సాధారణ వ్యక్తిలా రజకుల ఇళ్ల వద్దకు వెళ్లి బట్టలు ఇస్త్రీ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల చొరవతో పెన్షన్లు పెంచి, ఒక రోజు ముందుగానే ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. గతంలో రూ. 3,000 వచ్చే పెన్షన్ నేడు రూ.4,000 కు పెరిగిందని తెలిపారు. ప్రజల సంతృప్తే కూటమి ప్రభుత్వానికి గీటురాయి" అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నిడదవోలు పట్టణంలో ప్రతి నెలా రూ. 1,86,34,500 ఖర్చుతో 4,181 పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.ఫిబ్రవరి 2026లో కొత్తగా 6 పెన్షన్లు జతకావడంతో మొత్తం వ్యయం రూ. 1,86,55,000 కు చేరుకుందన్నారు.ప్రస్తుతం పర్యటించిన వార్డులో 101 పెన్షన్ల ద్వారా రూ. 4.88 లక్షలు లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు.ప్రతి నెలా నిరాటంకంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎంలకు ధన్యవాదాలు తెలిపారు.

పెన్షన్ పంపిణీ ద్వారా కూటమి ప్రభుత్వం నిరుపేదలకు బాసటగా నిలవడంతో లబ్దిదారుల మొఖాల్లో కనిపించిన ఆనందం ఎనలేనిది అన్నారు. ఆరోగ్యం, కుటుంబాలు బాగుపడే విధంగా అందిస్తున్న పెన్షన్లు తమకు భరోసాని అందిస్తున్నాయని లబ్ధిదారులు చెప్పడం చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం , డిప్యూటీ సీఎంలను, ప్రధాని మోదీలను ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు.అభివృద్ధి, సంక్షేమం, ప్రజల్లో ఆనందం చూడటానికి కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, మెగా డీఎస్సీ , అన్నదాత సుఖీభవ, యువతకు ఉపాధి కల్పన తదితర సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని తద్వారా రహదారులు బాగు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న కూటమి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ఏఎస్ఓ సాధించిన సురేష్ ఆదర్శప్రాయుడు



**ప్రొద్దుటూరు, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** ఏఎస్ఓ సాధించిన సురేష్ ఆదర్శప్రాయుడని సంస్కృతి సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఎన్ టి ఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టి డి వరుణ్ కుమార్ రెడ్డిలు తెలిపారు. శనివారం గ్రూప్ 2 పరీక్షా ఫలితాలలో విజయం సాధించి ఏఎస్ఓ గా ఎన్నికైన మోతుకూరు సురేష్ కుమార్ ను శనివారం స్థానిక శ్రీరాముల పేట వీధిలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో వారు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ వైకల్యాన్ని సైతం అధిగమించి గొప్ప సంకల్పంతో రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం గొప్ప విజయం గా అభివర్ణించారు. సురేష్ విజయం యువతకు ఎంతో ఆదర్శం అన్నారు. డాక్టర్ టి డి వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైకల్యం ద్వారా ఎదురైన క్లిష్టమైన పరిస్థితులను అధిగమించి గ్రూప్ 2 స్థాయి ఉద్యోగాన్ని సాధించడంతో సంకల్పం ముందర వైకల్యం అడ్డు రాదని సురేష్ నిరూపించారన్నారు. సురేష్ జీవితాన్ని ఒక గొప్ప ప్రేరణ కలిగించే విజయ గాథగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు భాస్కర్ రెడ్డి , ప్రసాద్ గండికోట పేష్టపల్లి, ప్రతాప్ స్వామి పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు, జగన్ చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలి

## ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ



**విజయవాడ జనవరి 31 వుదయం న్యూస్ బ్యూరో:**- వైకాపా నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయుత రాజకీయ నాయకుడిగా వ్యవహరించాల్సిన వ్యక్తి స్థాయి లేని వ్యక్తిగత దూషణలకు దిగడం, వైకాపా రాజకీయ సంస్కృతి ఎంత దిగజారిందో స్పష్టంగా చూపుతోందని ఆమె మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో విభేదాలు సహజమేనని, కానీ వ్యక్తిగత అవమానాలు, నీచ పదజాలం రాజకీయంగా అంగీకరించదగినవి కావని గద్దె అనురాధ స్పష్టం చేశారు. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు ముందు ఆయనే కాకుండా, వాటిని అడ్డుకోలేని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి కూడా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. వైకాపా ఎదుర్కొన్న ఘోర పరాజయానికి ప్రజలను నిందించడం పూర్తిగా హాస్యాస్పదమని, ఆ పార్టీ పతనానికి పూర్తి బాధ్యత వైకాపా నాయకులదేనని ఆమె స్పష్టం చేశారు. వైకాపా ఓటమి ప్రతిపక్షాల కుట్ర వల్ల కాదని, అది పూర్తిగా వారి అహంకారం, అదుపు లేని మాటలు, ప్రజా వ్యతిరేక విధానాల ఫలితమని వ్యాఖ్యానించారు.ప్రజలను, వ్యవస్థలను, రాజ్యాంగబద్ధ సంస్థలను, వ్యక్తులను దూషిస్తూ మాట్లాడటమే రాజకీయ బలం అన్న భ్రమ వైకాపా నేతల్లో బలంగా చోటు చేసుకుందని, అదే వారి రాజకీయ పతనానికి మూలకారణమైందన్నారు. వైకాపాకు శత్రువు బయట ఎక్కడో లేదని, అద్దంలో చూసుకుంటేనే వారి అసలు శత్రువు కనిపిస్తాడని ఘాటుగా వ్యాఖ్యానించారు. వైకాపా ఓటమి ఎన్నికల రోజున ప్రారంభం కాలేదని, 5 సంవత్సరాల వారి నాయకుల మాటల్లో, ప్రవర్తనలోనే మొదలైందని ఆమె అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటమి అనేది ఓటర్ల తీర్పు అయితే, వైకాపా ఓటమి మాత్రం వారి నాయకుల తప్పిదాలకు వచ్చిన శిక్షేనని గద్దె అనురాధ తేల్చి చెప్పారు.

# వైసీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టే ప్రచారాలు చేపట్టారు

- జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు
- వైసీపీ తీరుపై భగ్గుమన్న నియోజకవ జనసేన పార్టీ నాయకులు



**అవనిగడ్డ జనవరి31 (వుదయం ప్రతినిధి):** అత్యున్నత ల్యాబ్ నివేదికను సైతం వైసీపీ నేతలు తప్పుపడుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రచారాలు చేపట్టారని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దైవ సంపద సైతం దోచుకున్న వైసీపీ నాయకుల తీరు సిగ్గుచేటు అన్నారు. తిరుమల క్షేత్ర పవిత్రత తగ్గించేందుకు వైసీపీ చేసిన కుట్రలు గమనించి ఆ స్వామి వారిని 11సీట్లకు పరిమితం చేశారన్నారు. దేశంలోనే అత్యున్నత నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డుకు చెందిన కాఫ్ ల్యాబ్ నివేదికను సైతం లెక్క చేయకుండా, ఒక సాధారణ డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలోని ఐసీఎంఆర్ ల్యాబ్ నివేదిక తెచ్చి కల్తీ జరగలేదని బుకాయిస్తే ప్రజలు నమ్మరని తెలిపారు. పాల వినియోగం లేని రసాయన నెయ్యి వాడి రూ.250కోట్లు అవినీతి చేసి, 68.17 లక్షల కిలోల రసాయనాలతో ఇరవై కోట్ల లడ్డూలు తయారు చేసి భక్తులకు విక్రయించిన నాటి మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేసిన అవినీతి బయటకు వచ్చినా ఇంకా నిస్సిగ్గుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై దుర్భాషల దాడి ప్రారంభించటం సిగ్గుచేటు అన్నారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో కూటమి ప్రభుత్వం లడ్డు విషయంలో సిట్ విచారణ చేయిస్తే నివేదిక వస్తున్న తరుణంలో వైసిపి పేటియం బ్యాచ్ బయటకు వచ్చి చేస్తున్న బూటకపు ప్రచారం వారిలోని పాపభీతికి నిదర్శనంగా ఉందన్నారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం కార్యదర్శి లంకె యుగంధర్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జున రావు, సీనియర్ నాయకులు గుడివాక శివరావు, సర్పంచులు మండలి ఉదయ భాస్కర్, బచ్చు బేబీ, యర్రంశెట్టి శ్రీదుర్గ, కొల్లూరి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సిద్దినేని కుమార్ రాజా, కటికల వసంత్, నాచుగుంట, లింగారెడ్డిపాలెం గ్రామ ప్రముఖులు సైకం నాగబాబు, యర్రంశెట్టి దామోదరరావు, పీఏసీఎస్ చైర్మన్లు పూషడపు రత్న గోపాల్, అరజా రాధిక, కోసూరు నాగమల్లేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, తోట శ్రీనివాసరావు, కోడూరు టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి, బండ్రెడ్డి మల్లికార్జున్, అరజా కిరణ్ కాంత్, అడపా లీలా, కాగిత రామారావు, దేవనబోయిన కేశవనారాయణ, కోలపల్లి కిరణ్, ఏనుగు పాండురంగారావు, జరుగు ఆదినారాయణ పాల్గొన్నారు.



# నాగాలంకలో కూటమి పార్టీల నాయకుల నిరసన

## సీఎంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు, జోగి రమేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా..

**విజయవాడ జనవరి 31 వుదయం న్యూస్ బ్యూరో:**-నాగాయలంక ప్రధాన సెంటర్లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ డౌన్ డౌన్ నినాదాలతో రాష్ట్రం నుండి బహిష్కరించాలంటూ నిరసన తెలియజేశారు. కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చి పక్కనపెట్టి బహిష్కరించిన గడ్డి తినే పశువులకు బుద్ధి రాలేదని, ఇంత జరిగినా వారి ధోరణి మారలేదని, ఇలాంటి వారిని తక్షణమే రాష్ట్రం నుంచి బహిష్కరిస్తే తప్ప రాష్ట్రం సుభిక్షంగా ఉండే పరిస్థితి ఉండదని, సైకో ప్రవర్తన మార్చుకోకపోతే చెప్పులు, చీపురు కట్టలతో సన్మానం చేసే రోజులు ముందున్నాయని హెచ్చరించారు.తెలుగుదేశం పార్టీ నాగాయలంక మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు మాట్లాడుతూ అంబటి రాంబాబు ప్రస్థానం మొదట్లో లాయర్ గా ఫీజిస్తే తప్ప జీవించలేని పరిస్థితి నుండి వేలకోట్లు ఎలా సంపాదించాడో అందరికీ తెలుసని, ఎదుటివారిని తిట్టడం వల్ల జగన్మోహన్ రెడ్డి దగ్గర మెప్పు పొంది మంత్రి పదవి కొట్టేసి నేడు పిచ్చి పట్టిన ఆంబోతుల ప్రవర్తిస్తున్నాడన్నారు. మాజీమంత్రి జోగి రమేష్ దొంగ సారా వ్యాపారంతో సంపాదించి మంత్రిగా చేసిన అక్రమాలు అందరికీ తెలిసిన రహస్యమేనని ఒళ్ళు దగ్గర పెట్టుకు ప్రవర్తించకపోతే కూటమి పార్టీల ఆగ్రహానికి రాష్ట్రం నుండి కనుమరుగయ్య పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.



# జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఆర్కే ఫౌండేషన్ రామకృష్ణ

**మధిర,జనవరి 31(వుదయం ప్రతినిధి)**మధిర పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు.ఆర్కేఫౌండేషన్ రెస్క్యూ టీం,ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమ నిర్వాహకుడు.ఎంతోమందిఅనాధలకు అభాగ్యులకు అంత్యక్రియలు నిర్వహిస్తూ ఎంతోమంది క్షతగాత్రులకు ప్రాణం పోస్తూ నిత్యం ప్రజ సేవ చేస్తూ,ఎన్నో మూగజీవాలకు ఊపిరి పోసిన డాక్టర్ దోర్నాల రామకృష్ణకు జాతీయ ఉత్తమ సేవా పురస్కారాన్ని శ్రీపతి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో తిరుపతి శాసనసభ్యులు శ్రీఆరణి శ్రీనివాసులు మరియు తిరుమలతిరుపతి దేవస్థానం బోర్డుసభ్యులు భాను ప్రకాష్ సమక్షంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో అంగరంగ వైభవంగా అవార్డును ఆర్కే ఫౌండేషన్ వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ కొడవటిగంటి బాలరాజు రెండు తెలుగురాష్ట్రాల సామాజిక సేవకులు ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

# డీఆర్డీఓని కలిసిన కంప్యూటర్ ఆపరేటర్ కమ్ అకౌంట్స్ అసిస్టెంట్ సంఘం



**సత్తుపల్లి జనవరి 31 (వుదయం ప్రతి నిధి)** ఖమ్మం డి.ఆర్.డి.ఓ ని మర్యాద పూర్వకంగా కలసిన కంప్యూటర్ ఆపరేటర్ కమ్ అకౌంట్స్ అసిస్టెంట్ సంఘం. డి.ఆర్.డి. ఒ గా భాద్యతలు చేపట్టిన శ్రీరామ్ కి .మహాత్మ గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కంప్యూటర్ ఆపరేటర్ కమ్ అకౌంట్స్ అసిస్టెంట్స్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కలసి పూల కుండి ఇచ్చి, షాలవా కప్పి సన్మానించడం జరిగింది. తదుపరి జిల్లాలోని అన్ని మండలాల ఉపాధి హామి కంప్యూటర్ కేంద్రాల్లో సమస్యల వినతి పత్రం అందజేశారు డి.ఆర్.డి.ఓ స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యమంలో సంఘం నాయకులు యం.డి. జలీల్ ఖాన్, యం.సతీష్, యం. శ్రీనివాస రావు, మంజుల, రమేష్, షేక్ ఖలీల్, అరుణ, స్రవంతి, యం.డి. ముజిబున్నిసాబేగం, మోహన్, శ్రీనివాస్, శిల్ప, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**ప్రొద్దుటూరు, జనవరి 31, (వుదయం ప్రతినిధి)** తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి శనివారం ఆయన మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పొట్టిపాడు రోడ్డు ఒలివియా స్కూల్ వద్ద శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు 1 వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా శనివారమే కూటమి ప్రభుత్వం పించన్లు అందజేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ పేట చంద్రశేఖర్, కడప జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.యస్ జబీబుల్లా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, బీజేపీ కడప జిల్లా జనరల్ సెక్రటరీ కోనేటి ప్రదీప్ రెడ్డి, జనసేన సుంకర మురళీ, నాయకులు బచ్చల ప్రతాప్, ఆవుల రాజేశ్వర్ రెడ్డి, పొట్టు లక్ష్మి రెడ్డి, ధనియాల ఈశ్వర్ రెడ్డి, పల్లె గురివి రెడ్డి, మల్లెల భాస్కర్, దేసిరెడ్డి గురివి రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నాగేంద్ర, కుళాయి రెడ్డి, భాష, సుబ్రమణ్యం, దోడియం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణ, గోపవరం రమణ, శంకర్, అల్తాఫ్, సుధాకర్, గోపవరం సుబ్బారావు, స్టోర్ భాస్కర్, సుదర్శన్, సుబ్బా, సునీల్, ఇనయతులా, కాలే, ఇందిరానగర్ నరసింహ, ఓబులేసు, ప్రసాద్, టీడీపీ రాజుపాలెం మండలం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బయ్యపురెడ్డి నరసింహ రెడ్డి, కట్టమీది రామకృష్ణారెడ్డి, నాగేష్, గురప్ప, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.




# పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ అందజేత

**ఆత్మకూర్ రూరల్ చేజర్ల (వుదయం ప్రతినిధి) జనవరి 31వ తేదీ** చేజర్ల మండలం ఆదురుపల్లి హై స్కూల్ మరియు గురుకుల పాఠశాలలో సాక్షి యాజమాన్యం పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ ను ఆత్మకూరు డివిజన్ విజిలెన్స్ అండ్ మోనిటర్ అట్రాసిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షి యాజమాన్యం ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ ను అందజేయడం జరుగుతుంది. విద్యార్థుల యొక్క భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాన్ని తలపెట్టినందుకు. సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూలు హెచ్ఎం ,ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాక్షి సర్కులేషన్ ఇంచార్జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డు, ప్రసాదం విషయంలో కూటమి కుట్రపై వైసీపీ పూజలు

- ప్రభుత్వం చేసిన అసత్య ప్రచారాలు
- కోర్టులో నిజం కాదని సిట్ రిపోర్టు

**కావలి, జనవరి 31, వుదయం న్యూస్:** వైసిపి ప్రభుత్వం పై వచ్చిన అభూత కల్పనలు సందర్భంగా, వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సూచనలతో కావలి నియోజకవర్గం లోని వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు శనివారం పలు దేవస్థానములను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలకుల దుర్బుద్ధిని పోగొట్టి మంచి బుద్ధిని ప్రసాదించాలని, అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేయడం మానుకునే విధంగా వారి బుద్ధిని మార్చాలని కోరుకొని పూజలు నిర్వహించి, అనంతరం మీడియా ప్రతినిధులకు కూటమి ప్రభుత్వం చేసినటువంటి అసత్య ప్రచారాలను నేతలు తిప్పికొట్టారు.నిజానిజాలను మీడియా ముఖంగా ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మండల మరియు పట్టణ కేంద్రాలుగా దేవస్థానముల వద్ద కావలి నియోజకవర్గంలోని వైయస్సార్సీపీ కార్యకర్తలు , నాయకులు మరియు అభిమానులు పాల్గొనడం జరిగింది. దగదర్తి మండలంలో నాయకులు ఉలవపాళ్ళ దగ్గర ఉన్న శ్రీదక్షిణాభిముఖ ఆంజనేయ స్వామి వారి గుడి దగ్గర ఉదయం 9 గంటలకు, బోగోలు మండలంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం సందర్శించి పూజలు చేశారు. అలాగే కావలి పట్టణంలోని కచేరి మిట్ట వద్ద గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంను సందర్శించి, పూజా కార్యక్రమాలు నిర్వహించి తదనంతరం వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులు మరియు అభిమానులు మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డు విషయంలో ప్రస్తుత ప్రభుత్వ ప్రతినిధులు గత వైయస్సార్సీపి ప్రభుత్వం మీద చేసిన అసత్య ఆరోపణలను ఖండించి, నిజానిజాలను ప్రజానీకానికి మీడియా ముఖంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి వైయస్సార్సీపి నాయకులు పట్టణ కన్వీనర్ కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, కామరాజ్ సురేష్, గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, రాహుల్ హమీద్, కుందుర్తి కామయ్య, శ్రీనివాసులు, కళ్యాణి తదితర కార్యకర్తలు, నాయకులు మరియు అభిమానులు పాల్గొనడం జరిగింది.



# అంబటి రాంబాబుపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్ డిమాండ్
- ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ సర్కిల్ లో ధర్నా
- అంబటి చిత్ర పటాలను తగలబెట్టిన టిడిపి నాయకులు
- అంబటి అనుచిత వ్యాఖ్యలపై పటమట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు
- ధర్నాలో పాల్గొన్న గద్దె క్రాంతి, టిడిపి కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు




**విజయవాడ జనవరి 31 వుదయం న్యూస్ బ్యూరో :** ప్రజాస్వామ్యంలో వైసిపి నేతలు అనుసరిస్తున్న బూతు రాజకీయాలకు చోటు లేదు. సంస్కార హీనంగా అసభ్యకరమైన, అశ్లీల పదజాలంతో సీఎం చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నాయకుడు అంబటి రాంబాబు పై తక్షణం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొప్పన భవకుమార్ డిమాండ్ చేశారు.

ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ...టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్ ఆధ్వర్యంలో శనివారం పటమట ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర టిడిపి నాయకులతో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి రాంబాబు చిత్ర పటాలను చీపురుతో కొట్టి దగ్ధం చేశారు. అనంతరం టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, టిడిపి యువనాయకుడు గద్దె క్రాంతి, రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి పటమట పోలీసు స్టేషన్ లో అంబటి రాంబాబు పై ఏసిపి దామోదర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్ మాట్లాడుతూ ప్రజలు ఛీత్కరించుకున్న వైసిపి నేతలకు ఇంకా బుద్ధి రాలేదని....సీఎం చంద్రబాబు నాయుడును ఉద్దేశించి వాడిన అసభ్య పదజాలం అంబటి నీచత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. వైసిపి ఒక రాజకీయ పార్టీ కాకుండా...గుండాలు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు అంతు తేల్చే వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు నిద్రపోరని హెచ్చరించారు. అంబటి రాంబాబు ఒక సైతాన్ అంటూ....వైసిపి తో పాటు ఆ పార్టీ నాయకులు చరిత్ర హీనులుగా మిగలటమే కాకుండా కాలగర్భంలో కలిసిపోయే రోజులు దగ్గరలో వున్నాయన్నారు. పోలవరం డ్యాం గురించి, క్యూసెక్కులు, కాఫర్ డ్యామ్ అంటే కూడా తెలియని వ్యక్తి రాష్ట్రానికి వైసీపీ హయాంలో జలవనరులల శాఖ మంత్రిగా చేయడం రాష్ట్ర ప్రజల దురదృష్టం అన్నారు. మహిళలు అంటే అతనికి ఎంత గౌరవం కూడా అరగంట, గంట అంటూ మాట్లాడిన సంభాషణలు కూడా రాష్ట్ర ప్రజలందరూ విన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



“ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, నేను డబ్బు కోసం ప్రపంచమంతటా యాచిస్తున్నప్పుడు మాకు సిగ్గుగా అనిపిస్తుంది. రుణాలు తీసుకోవడం మా ఆత్మగౌరవంపై ఒక పెద్ద భారం. సిగ్గుతో మా తలలు వాలిపోతాయి. రుణమిచ్చేవారు మమ్మల్ని చేయమని కోరే చాలా పనులను మేం తిరస్కరించలేం. ప్రస్తుతం విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు రెట్టింపు అయ్యాయి. కానీ స్నేహితులు, ఇతర దేశాలు ఇచ్చిన రుణాలు కూడా ఇందులో ఉన్నాయి. రుణం తీసుకోవడానికి వెళ్ళే వ్యక్తి తల వంచవలసిందేనని వేరే చెప్పనక్కరలేదు.”

– పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

## వేమన పద్యం

వేము పాలువోసి ప్రేమతో బెంచిన
చేదువిరిగి తీపిజెందబోదు
ఓగు నోగెగాక యుచితజ్ఞు డెటులౌను?
విశ్వదాభిరామ! వినురవేమ.



## సంపాదకీయం

# నెలసరి జాగ్రత్తలపై సుప్రీం ఆదేశాలు

ప్రభుత్వం నుంచి ప్రజల ప్రాణాలకు ఎటువంటి ముప్పు కలగకుండా చూడ్డానికి రాజ్యాంగకర్తలు 21 వ అధికరణకు రూపు ఇచ్చారు.ప్రభుత్వం చట్టబద్ధంగా తప్ప ఇతరత్రా ఎవరి ప్రాణాలను హరించారాదని చెబుతున్న ఈ అధికరణ పౌరులకు కేవలం బతికి ఉండడం కాకుండా గౌరవప్రదంగా జీవించే హక్కును కూడా ప్రసాదించింది. ఇది దేశంలో నివసిస్తున్న వారందరికీ వర్తిస్తుంది.

అశేష అడుగు బడుగు జనం ఉన్న భారత దేశంలో చెప్పనలవి కాని అమానుషాల ఫ్యూడల్, భూస్వామ్య పాలన గాయాల నుంచి ఇంకా కోలుకోని సన్న జనం అసంఖ్యాకంగా గల ఇండియాలో సకల ప్రజాస్వామిక హక్కులను కల్పించడానికి ఈ అధి కరణను సుప్రీంకోర్టు ఎప్పటికప్పుడు వినియోగించుకొంటున్నది. ఆ విధంగా ఇప్పటికి అనేక ఆధునిక జీవన హక్కులను ఈ అధికరణలో చేర్చింది. ఉపాధి హక్కు విద్యా హక్కు, అత్యవసర సమయాల్లో వైద్యచికిత్స హక్కు వంటివాటిని చేర్చింది. అదే రీతిలో మంచి గాలి, నీరు, పరిసరాల పరిశుభ్రత వంటివి కలిగివుండే హక్కు వంటి వాటికి ప్రాణం పోసింది. తాజాగా బాలలకు నెలసరి సమయాల్లో కలిగే శారీరక అసౌకర్యాల నుంచి రక్షణ కల్పించడాన్ని ఈ అధికరణ కిందికి తెచ్చింది. విద్యార్థినులందరికీ ఆక్సోబయోడిగ్రే డబుల్ శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా ఇవ్వాలని కేంద్ర రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను జస్టిస్ జె బి పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశించింది. బాలలకు బాలికలకు వేర్వేరు మరుగు దొడ్లను ఏర్పాటు చేయాలని వగైరా చర్యలను సూచించింది. ఈ ఆదేశాలను మూడు మాసాల్లో అమల్లోకి తేవాలని గడువు కూడా విధించింది. నెలసరి రక్షణలు సమకూర్చుకోలేని దారిద్ర్యం బాలికలను చదువుకి దూరం చేస్తుందని ధర్మాసనం చేసిన వ్యాఖ్య మన దేశంలో ఒక కఠోర వాస్తవం.

అంతెందుకు సరైన మరుగు దొడ్లు లేనందున బహిరంగ ప్రదేశాలకు వెళ్లే హాస్టల్ విద్యార్థులను పాము కరిచిన సందర్భాలు అనేకం జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు కూడా దేశంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ళు ఎంత అధ్వానంగా ఉన్నాయో చెప్పనక్కరలేదు. మధ్యాహ్న భోజనం గురించి అది తిని ఆసుపత్రుల్లో చేరుతున్న విద్యార్థుల గురించి ఎంత చెప్పుకొన్నా చాలదు. బాలికల నెలసరి ఆరోగ్య రక్షణపై ఆర్టికల్ 21ని సంధించి ఇంత శ్రద్ధ తీసుకొన్నందుకు సుప్రీం కోర్టును వేనోళ్ల ప్రశంశించాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# పందిరిసాగు.. రైతుకు బాగు

వికారాబాద్ జిల్లా, ఎక్:మామిడి గ్రామంలో, రైతులు వెంకటయ్య, అలివేలు మంగలకు రెండేసి ఎకరాల పొలం ఉంది. భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ వరి పండించ కుండా కూరగాయలు, చిరుధాన్యాలు పండిస్తున్నారు. దానికి కారణం భూసారం కాపాడుకోవడం అని చెబుతారీ రైతులు. అయినప్పటికీ వారి కష్టానికి తగిన ఆదాయం లేక నిరాశకు లోనైంది. ఆ సమయంలో రీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వారికి కొన్ని సూచనలు చేశారు. ఫలితంగా వారి సాగులో కలిగిన మార్పును వెంకటయ్య ఇలా వివరించాడు. “ నేను గతంలో కాకర , సొర కాయలను నేలపైన సాగుచేస్తే, ఎకరాకు 3 నుండి 5 టన్నుల కాయలు మా తమే వచ్చేవి. ఇపుడు పందిర్లు వేసుకొని వాటి మీద పండిస్తున్నాను. దీనివల్ల 9 నుండి 11 టన్నుల వరకు దిగుబడి పెరిగింది. బీర, టమాటా, బంతి, చామంతి కూడా పండిస్తున్నాం. ఆదాయం పెరగడంతో మాతో పాటు నలుగురు కూలీలకు పని దొరికింది.” ఇది వెంకటయ్య అనుభవమే కాదు ఆ గామంలో చాలా మంది రైతన్నలు వెంకటయ్యను అనుసరిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో వ్యవసాయం వర్షాధారమైనది. వరి పండించే రైతులకు కష్టానికి తగిన ఆదాయం రాక అప్పుల పాలవుతున్నారు.

ఈ నేపథ్యంలో కొత్త ఆలోచనలతో ,నూతన సాగుపద్ధతులు ద్వారా మెరుగైన దిగుబడులు సాధించే దిశగా ఈ రైతులు అడుగులు వేస్తున్నారు. వికారాబాద్ జిల్లా , నవాబ్ పేట్ మండలం, ఎక్‌మామిడి లో వర్షపాతం చాలా తక్కువ. తీవ్రమైన నీటి ఎద్దడిని రైతులు ఎదుర్కొంటూ, పంటల సాగులో నష్టపోయారు. దీనికి పరిష్కారం దిశగా, రీడ్ సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్, వాతావరణ పరిస్థితులకు అనువుగా వ్యవసాయం అనే పథకం అమలు చేసింది. ఇక్కడ 50 మంది రైతులను ఎంపిక చేసి, వరి సాగును తగ్గించి, ఇతర పంటల మీద అవగాహన కలిగించి, ఆధునిక పద్ధతిలో పందిరి కూరగాయలు, చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడి సాధించడానికి శిక్షణ ఇచ్చారు. వీరిలో విజయవంతంగా సాగు చేస్తున్న అలివేలు, వెంకటయ్యలు. వాతావరణ మార్పులకు అనువుగా రైతులకు నష్టాలు రాకుండా దిగుబడి పెంచడమే ఈ కార్య కమం ఉద్దేశ్యం. రైతులకు ఉద్యాన నిపుణుల తో శిక్షణ ఇప్పించి, సేంద్రీయ సాగు పై అవగాహన కల్గించారు.

ప్రతి రైతు 10 గుంటాస్‌లో పందిరి కూరగాయలు, మిగతా భూమిలో టమాటా, మిర్చి, వంకాయ, బెండకాయ మొదలైనవి సాగు చేస్తున్నారు. 9 ఫీట్ల రాతి స్తంభాలతో పందిర్లు వేయించారు. కూరగాయల విత్తనాలు, మల్చింగ్ షీట్స్, వర్మీ కంపోస్ట్, వేప పిండి ని కూడా రైతులకు అందించారు.

ఇపుడు ఈ రైతులు ఒకే రకం పంటలు కాకుండా



పంట మార్పిడి పద్ధతి అనుసరిస్తున్నారు. దీని వల్ల నేల సారం కోల్పోకుండా ఉంటుంది. బహుళ పంటలు సాగు చేస్తున్నారు. ఒక పంట దెబ్బతిన్నా మరో పంటలో లాభం పొందుతున్నారు. ఇలా ఎక్కువ దిగుబడి సాధించి, స్వయం సమ ద్ధి సాధించిన రైతులు ఏమంటారంటే...

### వరి నుండి కూరగాయల సాగు వైపు

“ గతంలో వరి, జొన్నలు వేశాను కానీ తగిన ఆదాయం రాలేదు. ఇపుడు మాకు పందిర్లకు, మల్చింగ్‌కి రీడ్ సంస్థ సాయం చేసి, సాగులో సూచనలు చేశారు. పందిర్ల మీద సాగు వల్ల గతంలో కంటే ఎక్కువ దిగుబడి వచ్చింది. పంటలకు తెగులు రాకుండా వేస్ట్ డీకంపోజ్ వాడుతున్నాం. ఇంగువ దావణం,ఆవు మూ తం,పిడకల బూడిద కలిపిన విత్తనాలు నాటితే తెగులు రాకుండా ఉంటుందని సేం దియ సేద్యం శిక్షణలో మాకు వివరించారు. ఇపుడు సేం దియ సద్దతిలో కూరగాయలు పండిస్తూ, పూల సాగు చేస్తున్నాను. నెలకు రూ.20 నుండి 25 వేల ఆదాయం వస్తున్నాది, పదిమందికి పని కూడా కల్పిస్తున్నాను. ” అన్నారు వెంకటయ్య.

### మార్కెట్‌లో డిమాండ్

“ చిరుధాన్య పంటలు ఏవైనా,వాటితో పాటు కచ్చితంగా అంతరపంటలు కూడా వేసుకోవాలి. ఆరికలో అంతర పంటలుగా కంది, జొన్న, అలసందలు సాగు చేసుకుంటే అదనపు ఆదాయం వస్తుంది. బహుళ పంటలు పండించడం వల్ల ఒక పంటలో నష్టం వచ్చినా మరో పంటలో లాభం వస్తుంది. విత్తనం నుండి ఎరువుల వరకు మేమే తయారు చేసుకుంటాం . దిగుబడి బాగుంది.గత నాలుగేళ్లుగా చిరుధాన్యాలు పండిస్తున్నాం. ఇప్పటి వరకు నష్టం అనేది రాలేదు. ” అని అన్నారు పొలం పనులు చేస్తున్న అలివేలు. ఆమె భర్త శ్రీనివాస్ పంట దిగుబడులను స్థానిక మార్కెట్‌కి తరలించి దళారుల మీద ఆధారపడకుండా లాభాలు పొందుతున్నాడు.



### 15టన్నులకు పైగా దిగుబడి...

‘ పందిర్ల పై తీగలు చిక్కగా అల్లుకుని నీడ ఏర్పడటం వల్ల, కలుపు పెరగలేదు. దీనివల్ల సాగు ఖర్చు తగ్గింది. నేల మీద కాకర పంట 120 రోజుల్లో పూర్తయితే.. అదే పందిరిపై ఆరు నెలల పంట కాలం ఉంటుంది. నేల పైన సాగు చేస్తే, ఎకరాకు 5 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తే... పందిరిపై 15టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. పండించే విధానంలో ఈ చిన్న మార్పు వల్ల బీర,కాకర, సొర ఇలా ప్రతి పంటలో అధిక దిగుబడి సాధ్యం అవుతోంది’ అన్నాడు వెంకటయ్య.

**జల సంరక్షణతో :** “ఒకపుడు తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్న ప్రాంతం. వాటర్ షెడ్ కార్య కమంద ద్వారా, భూగర్భజలాలను పెంచాం. వరి పంటను తగ్గించి, నేల మీద కంటే పందిర్ల మీద తీగజాతి కాయగూరల సాగు, పూలు, చిరుధాన్యాల సాగుతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. అంతే కాక,నాణ్యమైన సేంద్రియ విధానంలో పండించిడం వల్ల మార్కెట్లో గిట్టుబాటు ధరలు పొందుతూ, స్వయం సమ ద్ధి సాధించారు ” అన్నారు రీడ్ సంస్థ పతినిధి నవీన్‌కుమార్.

### ఇద్దరు రైతులు సాధించిన ఫలితాలు

- గతంలో తీగజాతి కూరగాయలను నేల మీద సాగు చేయడం వల్ల గాలి, వెలుతురు సోకక, చీడ పీడల బెడద ఎక్కువై నాణ్యత లోపించేది. ఇపుడు పెండాల్స్ వల్ల ఆ సమస్యలుతగ్గి, నాణ్యమైన దిగుబడులు ఇవ్వడమే కాక రైతులకు శ్రమ, ఖర్చు తగ్గింది.
- పందిరిపై సాగు వల్ల పంట చిక్కగా అలుముకొని నీడ ఉండటం వల్ల, కలుపు పెరగదు. రైతులకు సాగు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుంది.
- వరి కంటే చిరుధాన్యాల సాగు వల్ల ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. మార్కెటింగ్ సమస్యలు లేవు
- సజ్జలు, రాగులు , జొన్నలు వంటి బహుళ పంటలు పండించడం వల్ల నష్టాలు తగ్గాయి. గతంలో వరి వల్ల నష్టపోయిన వారు ఈ పద్ధతి ఫాలో అవుతున్నారు
- రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేం దియ ఎరువులను, వాడుతూ, భూసారాన్ని కాపాడుతున్నారు.

సాధారణ సాగుకు పందిరి కూరగాయల సాగు మధ్య గల తేడాను గ్రహించి, కూరగాయల ద్వారా వచ్చే ఆదాయంతో ఎక్కువ విస్తీర్ణంలో పందిరి కూరగాయల సాగు చేయడానికి రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారు. బీడు భూముల్లో తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందడానికి, చిరుధాన్యాలు, కూరగాయల సాగుతో రైతులు ఆహార భద్రత, ఆర్థిక అభివృద్ధి సాధించి, సుస్థిర జీవనోపాధులు పొందుతున్నారు.



మోహన
9440595858

# ఊహను నిజం చేసుకున్న కల్పన



అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ, అంతేకాక ఇండో - అమెరికన్ మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా. పట్టుదల, కృషి, అంకితభావం ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదని ఆమె నిరూపిం చారు. ఎందరో యువతులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. కల్పనా చావ్లా, భారత దేశం లో హర్యానా లోని కర్నాల్ అనే ఊరులో సంప్రదాయ శాఖాహార ఒక పంజాబీ కుటుంబం లో మార్చి 17, 1962 లో పుట్టారు. తండ్రి బనారసీ లాల్ చావ్లా. సోదరుడు సంజయ్ చావ్లా కమర్షియల్ పైలట్ కావాలని కలలు కనేవాడు. తన గదిలో విమానాల బొమ్మలుంచేవాడు. అవి కల్ప నలో స్ఫూర్తిని రగిలించాయి. కల్ప నా చావ్లా ముందుగా, కర్నాల్ లో ఉన్న టాగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1982లో అమెరికాకు వలస వెళ్లారు. 1982 లో ఈమె అమెరికా వెళ్లి అక్కడ "ఏరోస్పేస్ ఇంజనీరిం గ్" లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని, అర్లింగ్టన్ లో ఉన్న టెక్సాస్ విశ్వ విద్యాలయం నుంచి 1984 లో పొందారు.1986 లో, చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని మరియు ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లో పిహెచ్డి ని బౌల్డర్ లో ఉన్న మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. తన మొదటి స్పేస్ మిషన్‌లో భాగంగా కొలంబి యా STS-87 అంతరిక్ష నౌకలో ప్రయాణించే టప్పుడు ఆమెఅప్పటి భారత ప్రధాని ఐకే గుజ్రాల్‌తో మాట్లాడారు. ఆ సమయంలో అంతరిక్షం నుంచి తీసిన హిమాల యాల ఫోటోలను గుజ్రాల్‌కు

కోలోరాడో విశ్వ విద్యాలయం నుంచి పొందారు. ఆమె 1983 లో విమానయాన శిక్షకుడు మరియు విమాన చోదక శాస్త్ర రచయిత ఐన జీన్-పియర్ హారిసన్ ను వివాహం చేసు కున్నారు. భారత దేశంలో మొట్టమొదటి విమానాన్ని నడిపిన జె.ఆర్.డి. టాటా యే తనకు స్ఫూర్తి, అందుకనే ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్ ను కెరీర్ గా తీసుకున్నానని చెపుతుండే వారు. లింగ వివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహ. చిన్న నాటి నుంచే ఆకాశంలో విహరిం చాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. 1988లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఏమ్స్ రిసెర్చ్ సెంటర్లో ఉద్యోగంలో చేరారు. ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటే షనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్-ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్-ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. 1991లో ఆమెకు అమెరికా పౌరసత్వం లభించింది. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ

చూపించారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు గడిపి 80 ప్రయోగాలను విజయ వంతంగా నిర్వహించారు. భారత మూలాలు ఉన్న కల్పన 40 ఏళ్ల వయసులో, 2003లో చనిపోయారు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ ఆమె ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌక భూమి వాతావరణం లోకి ప్రవేశిస్తు న్నప్పుడు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో కల్పనతో పాటు ఆమె తో కలిసి ప్రయాణిస్తున్న మరో ఆరుగురు సిబ్బంది కూడా మరణిం చారు. కొలంబియా అంతరిక్ష నౌక షెడ్యూల్ ల్యాండింగ్‌కు 16 నిమిషాల ముందు అమెరికాలోని టెక్సాస్ ప్రాంతంలో కూలిపోయింది. ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కా రాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోం ది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అందజేస్తుంది. కల్పన గౌరవార్థం దేశం లోని ఎన్నో విద్యాసంస్థలకు, అవార్డులకు ఆమె పేరు పెట్టారు. యువ మహిళా శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభు త్వం 2004లో కల్పనా చావ్లా అవార్డును ఏర్పాటు చేసింది.



సంగనబట్ల
9440595494

# బడికి దూరంగా.. బతుకు భారంగా



ఏ దేశంలో అయినా బాలలే రేపటి పౌరులు. అలాంటి బాలల భవిష్యత్తు పాలకుల విధానంపై ఆధారపడి ఉంది. బాల పరిస్థితే ఆ దేశ పరిస్థితికి, ఆర్థిక విధానాలకు అద్దం పడుతుంది. ప్రపంచ జనాభాలో పిల్లలు 25% ఉన్నారు. వీరిలో సుమారు 16.8 కోట్ల మంది బాల కార్మికులుగా ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ ( ఐ ఎల్వో) అంచనా వేసింది. సుమారు 3.6 కోట్ల మంది పిల్లలు బానిస బ్రతుకులు గడుపుతున్నారని ఆస్ట్రేలియాకు చెందిన మానవ హక్కుల బృందం ద వాక్ ఫ్రీ ఫౌండేషన్ నివేదిక పేర్కొంది. పేదరికం, నిరక్షరాస్యత, అక్రమ రవాణా వంటి వాటి వల్ల ఎంతో మంది పిల్లలు బాల కార్మికులుగా మగ్గి పోతున్నారు. తీవ్రమైన దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక హక్కులు హరించబడుతున్నాయి. లైంగిక, ఆర్థిక దోపిడీకి గురౌతున్నారు.

**భారతదేశ బాల పరిస్థితి :** ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశ లో 23,68,17,000 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 11.45% మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. అంటే ప్రతి వంద మంది పిల్లల్లో 11 మంది పాఠశాలకు దూరంగా ఉన్నారు. దీన్ని గణాంకాలు మరియు కార్యక్రమాల మంత్రిత్వ శాఖ 8-12-2025 విడుదల చేసింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం భారత దేశంలో 5 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సులోని కోటి,ఒక లక్ష మంది పిల్లలు పనుల్లో కొనసాగుతున్నారు. బాల కార్మిక శ్రమశక్తిలో 14 నుంచి 17 సంవత్సరాల పిల్లలు సుమారు 63 శాతం ఉన్నారని ‘ సేవ్ ది చిల్డ్రన్’ సంస్థ తెలిపింది. యూనిసెఫ్ నివేదిక ప్రకారం పట్టణ ప్రాంతంలో 5-14 ఏళ్ల వయస్సులోని బాల కార్మికుల్లో 54% పెరుగుదల కనిపించింది. భారతదేశ రాజ్యాంగంలో సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం మరియు వ్యక్తి గౌరవం ఆధారంగా కొత్త సామాజిక వ్యవస్థను స్థాపించాలని, పేదరికం, అజ్ఞానం మరియు అనారోగ్యాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పేర్కొన్నది. 78 సంవత్సరాల ‘స్వతంత్ర’ పాలనలో అవి అమలు జరగలేదు. 2025 నాటికి బాల కార్మికతను నిర్మూలించాలన్న ఐక్య రాజ్య సమితి లక్ష్యం భారతదేశానికి ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కంపెనీ తన 52వ నివేదికలో పేర్కొంది. ఆర్టికల్ 24 ప్రకారం 6-17 సంవత్సరాల లోపు బాల బాలికలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకోరాదు. ఆర్టికల్ 39 ప్రకారం బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఆటంకంగా ఉండే పరిస్థితులను తొలగించాలి. ఆర్టికల్ 45 ప్రకారం 6 ఏళ్ల లోపు బాల, బాలికల అందరికీ ఉచిత విద్య, సంరక్షణ అందించాలి. జాతీయ బాలలకు అన్ని విధాల రక్షణ, హక్కులను కాపాడాలని కేంద్ర మంత్రిత్వ శాఖ, బాల కార్మిక చట్టం 1986కు సవరణ చేసింది. దీని ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎలాంటి పనుల్లో చేర్చగూడదు. వారు బడిలో చదువుకోవాలి. ఇవేవీ అమలు జరగకుండా రాజ్యాంగంలో అలంకార ప్రాయంగా ఉన్నాయి. ప్రతి బిడ్డకు సమాన అవకాశాలు, హక్కుల రక్షణ మరియు పూర్తి భాగస్వామ్యం గురించి ( ది పర్సన్ విత్ డిజ్ బులిట్ యాక్ట్) జనవరి 1,1996న చేసిన తీర్మానంతో సహా ఐక్య రాజ్య సమితి అన్ని తీర్మానాల పైనా భారతదేశం సంతకం చేసింది. ఆచరణ మాత్రం సంతకాలకే పరిమితమైంది. ఐక్య రాజ్య సమితి తీర్మానాలకు భిన్నంగా భారత బాలల పరిస్థితులు ఉన్నాయి. ప్రపంచంలోని పోషకాహార లోపంలో ఉన్న మూడవ బిడ్డ భారతదేశంలో ఉన్నారు. దేశంలోని నలుగురు పిల్లల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి రెండవ బిడ్డ బరువు తక్కువగా ఉన్నాడు. ప్రాథమిక విద్యలోనే చదువు మానేసే పిల్లలు 71.01% ఉన్నారు. దేశం మొత్తంలో 11కోట్ల,4లక్షల మంది బాల కార్మికులుగా ఉన్నారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు 44% ఉన్నారు. 3 సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో 79% మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

భారతదేశంలో పిల్లల పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. చాలా మంది పిల్లలకు బ్రతికే అవకాశం తక్కువగా ఉంది. వారికి ఆహారం లభించక పోవడమే కాదు, విద్యా అవకాశాలు కూడా లేవు. షెడ్యూల్డ్ కులాలు, తెగల బాలికలలో అక్షరాస్యత రేటు 42% మాత్రమే. వంద మంది బాలికల్లో 30 మంది మాత్రమే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. వీరిలో ఇంకా బాల్య వివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. పిల్లల ఎదుగుదల: భారతదేశంలో పిల్లల ఎదుగుదల చాలా తక్కువగా ఉంది. ఆర్థిక పరిస్థితులే కాకుండా కులం కూడా అవరోధంగా ఉంది. అగ్రకుల పెత్తందారీ, ఆర్థిక సామాజిక తరగతుల పిల్లలతో పోలిస్తే, పేదల అణగారిన తరగతులకు చెందిన చిన్నారుల ఎదుగుదల లోపం అధికంగా ఉంది. ఆదివాసి మరియు దళిత పిల్లల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. 5 ఏళ్ల లోపు పిల్లల్లో 35% మంది ఎదుగుదల సమస్యతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలే కాదు, సబ్- సహారా లోని ఆఫ్రికా దేశాల కన్నా భారతదేశంలోని పిల్లల్లోనే ఎదుగుదల లోపం ఎక్కువగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70% మంది భారత్, ఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. వీరిలో 35.7% భారత్ లో ఉంటే, ఆఫ్రికాలో 33.6% ఉన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్య పూరిత విధానాలు, పేదరికం, పోషకాహార లోపం వల్ల పిల్లలు ఎదుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారని నిపుణుల విశ్లేషణలు చెబుతున్నాయి.

బాల కార్మికులుగా ప్రమాదకరమైన పనుల్లో పని చేయడం వల్ల మరియు పోషకాహార లోపం వల్ల ప్రతి సంవత్సరం భారతదేశంలో లక్షలాది మంది బాలలు చనిపోతున్నారు. 2015లో 5సంవత్సరాల లోపు చిన్నారుల 10 లక్షలకు పైగా మరణించారు. ఇది ఆ సంవత్సరంలో ప్రపంచం మొత్తం మీద అత్యధికమని ప్రముఖ ‘లాన్సెట్ ‘ పత్రిక తెలిపింది. బడికి వెళ్లి ఆట పాటలతో జీవించాల్సిన పిల్లలు బడికి దూరమై బాల కార్మికులుగా పోషకాహార లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు కారణం వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులే కారణం. గత ప్రభుత్వాలు ముఖ్యంగా నేటి మోడీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా, బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం పని చేశాయి,చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ దేశ సంపదలను, సహజ వనరులను అదాని, అంబాని లాంటి బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నది. సెజ్ లు, పరిశ్రమల పేరుతో భూములు కూడా వారికి కట్ట బెడుతున్నది. దేశ సంపద, భూములు కొద్ది మంది వద్ద కేంద్రీకృతమై ఉంది. ఫలితంగా గ్రామీణ పేదలు భూమికి దూరం ఉపాధికి దూరం కాగా, పట్టణ పేదలు ఉపాధికి దూరమై పేదరికంలో మగ్గుతున్నారు. పేదరికం ఫలితంగా బడికి దూరమై కుటుంబ పోషణలో పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. ఫ్యాక్టరీల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు ఈ పరిస్థితుల నుంచి బయట పడాలంటే గ్రామీణ పేదలకు భూ పంపిణీ జరగాలి.వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధిని కల్పించాలి. ప్రజా అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పి శ్రామికులకు పని కల్పించి పరిశ్రమల్లో భాగ స్వామ్యం ఇవ్వాలి. పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలి. అలాం టి విధానాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం, అమలు చేయదు. దాని వర్గ స్వభావం అందుకు వ్యతిరేకం. దాన్ని గ్రహించి పేదలేఉద్యమం ద్వారా సాధించుకోవాలి.



బొల్లిముంత సాంబశివరావు
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
రైతు కూలీ సంఘం
( ఆం.ప్ర)
సెల్:9885983526



# జాతీయం-అంతర్జాతీయం



## ఇరాన్, బందర్ అబ్బాస్ ఓడరేవులో పేలుడు

**వుదయం, జనవరి 31:**



ఇరాన్‌లోని దక్షిణ ఓడరేవు బందర్ అబ్బాస్‌లో శనివారం పేలుడు సంభవించినట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. అయితే, ఈ పేలుడు కారణాలేమిటో వివరించలేదు. పేలుడులో రివల్యూషనరీ గార్డ్ నావికా దళ కమాండర్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపిస్తున్న సోషల్ మీడియా నివేదికలు పూర్తిగా అబద్ధమని, పాక్షిక అధికారిక వార్తా సంస్థ తస్నిమ్ పేర్కొంది.

ఈ పేలుడుపై దర్యాప్తు జరుపుతున్నట్టు పేర్కొన్నదే తప్ప ఇరాన్ మీడియా ఇతర వివరాలను వెల్లడించలేదు. ఇరాన్ అధికారులు కూడా వ్యాఖ్యానించేందుకు అందుబాటులోకి రాలేదు.

బందర్ అబ్బాస్ ఓడరేవు ఇరాన్, ఓమన్‌ల మధ్య కీలక జలమార్గమైన హార్మూజ్ జలసంధిపై ఉంది. ఇది ప్రపంచ సముద్ర మార్గ చమురు రవాణాలో దాదాపు ఐదవ వంతును నిర్వహిస్తోంది. టెహ్రాన్‌కు, వాషింగ్టన్‌కు మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పేలుడు సంభవించింది. ఇరాన్ అధికారులు మూడు సంవత్సరాలలో ఆ దేశాన్ని కుదిపేసిన అతిపెద్ద నిరసనలను పాశవికంగా అణచివేయడం, ఇరాన్ అణు కార్యక్రమంపై కొనసాగుతున్న పాశ్చాత్య ఆందోళనల మధ్య ఈ ఉద్రిక్తతలు పెరిగాయి.

ఆర్థిక సంక్షోభం కారణంగా గత డిసెంబర్‌లో నెలకొన్ని దేశవ్యాప్త నిరసనలు, దేశ మతపాలకులకు కఠినమైన సవాలును విసిరాయి. ఈ నిరసన ప్రదర్శనలలో 500 మంది భద్రతా దళ సభ్యులు సహా దాదాపు 5వేల మంది మరణించారని ఇరాన్ అధికారులు రాయిటర్స్ వార్త సంస్థకి తెలిపారు.

గురువారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ వైపు యుద్ధ నౌకల దళం దూసుకుపోతోందని అన్నారు. భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం వంటి ఎంపికలను ట్రంప్ పరిశీలిస్తున్నారని శుక్రవారం అనేక వర్గాలు తెలిపాయి.

శనివారం ఉదయం, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, అమెరికా, ఇజ్రాయెల్, యూరోపియన్ నాయకులు ఇరాన్ ఆర్థిక సమస్యలను ఆసరాగా చేసుకుని, అశాంతిని రేకెత్తిస్తున్నారని, దేశాన్ని ముక్కలు చేయడానికి ప్రజలకు అవసరమైన వ్యూహాలను అందిస్తున్నారని ఆరోపించారు.

## చొరబాటుదార్ల కోసమే వందేమాతరం పట్ల వ్యతిరేకత

**బగ్‌దోగ్రా, జనవరి 31(వుదయం):**



చట్టవ్యతిరేక చొరబాటుదారుల ఓటు బ్యాంకును బుజ్జగించేందుకు తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వందేమాతర గీతాన్ని వ్యతిరేకిస్తున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని బగ్‌దోగ్రాలో జరిగిన కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతూ, పార్లమెంటులో వందేమాతరం గురించి చర్చిస్తున్నప్పుడు, ఈ తృణమూల్ కాంగ్రెస్ నాయకులు దానిని వ్యతిరేకించడం దురదృష్టకరమని అన్నారు. వందేమాతర గీత రచయిత బంకిం చంద్ర బెంగాల్‌కు చెందిన వాడైనా ఆ గీతాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని, నేను వారి ఎంపీలలో ఒకరిని అడిగినప్పుడు, మా చొరబాటుదారుల వోట్ బ్యాంకు దానితో నొచ్చుకుంటోంది, అందుకే దానిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారని ఆయన పేర్కొన్నారు. సిగ్గుచేటు మమతా, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మీరు వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నారు. బెంగాల్ ప్రజలు మిమ్మల్ని క్షమించరు. 2026 ఎన్నికలలో బెంగాల్ ప్రజలు దీనికి మీకు తగిన జవాబు చెబుతారు అంటూ ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కోల్‌కతా సమీపంలోని ఆనందపూర్ గిడ్డంగులలో జరిగిన వినాశకరమైన అగ్నిప్రమాదంపై హోం మంత్రి షా టిఎంసి ప్రభుత్వాన్ని విమర్శించారు, ఈ ఘటనను 'అవినీతి' ఫలితంగా అభివర్ణిస్తూ, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర 24 పరగణాలలో జరిగిన బిజెపి కార్యకర్త సమ్మేళన్‌లో మాట్లాడిన షా ఈ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రయోజనాలు పొందడం కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, అవినీతిని వ్యవస్థీకృతం చేయడంతో పాటుగా సరిహద్దు భద్రతా చర్యలను ఉద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో రాష్ట్రంలో సరిహద్దు కంచె వేస్తామన్నారు. పశ్చిమ బెంగాల్‌లో చొరబాట్లు జరుగుతున్నతీరు దేశమంతటికీ ప్రధాన సమస్యగా మారింది. కోర్టు ఆదేశాల తర్వాత కూడాసరిహద్దు కంచె కోసం బీఎస్‌ఎఫ్‌కు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించడం లేదు. ఎందుకంటే, చొరబాటుదారులను ఆ పార్టీ వోటు బ్యాంకుగా చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర పోలీసులు, అధికారులు అక్రమ వలసలను అడ్డుకోకపోవడంతో, నకిలీ ప్రతాలతో వాళ్లు దేశమంతా వ్యాపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేశ భద్రత కోసం బెంగాల్‌లో భాజపా గెలుపు ఎంతో అవసరం అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

## బిల్ గేట్స్‌పై ఆరోపణలు

### తిప్పికొడుతున్న గేట్స్ బృందం

**వుదయం, జనవరి 31 :**



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీల (Epstein files)ను అమెరికా న్యాయ శాఖ విడుదల చేసింది. ఇందులో అధ్యక్షుడు ట్రంప్ సహా పలువురి ప్రముఖుల పేర్లు ఉన్నట్టుగా అమెరికన్ మీడియా కోడై కూస్తోంది. వారు ఆఖరికి ట్రంప్ భార్య మెలానియా పేరును కూడా వదలలేదు. అంతేనా? అమెరికాలో తాజా క్రేజ్‌గా మారిన జొహ్రాన్ మామ్దానీ తల్లి మీరా నాయర్ పేరు కూడా ఆ జాబితాలో ఉన్నట్టు వార్తలు వచ్చాయి.

కాగా, శుక్రవారం రాత్రి వెలువడిన జాబితాలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ పేరుతో పాటు అత్యంత గోప్యమైన విషయం బయటకు వచ్చింది. గేట్స్ రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు కలిగి ఉండడం వల్ల ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడనే కథనం ఇప్పుడు చక్కర్లు కొడుతోంది.

తనకి తాను రాసుకున్న ఈమెయిల్‌లో ఎప్‌స్టీన్ ఈ విషయాలు ప్రస్తావించాడు ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన తన భార్య మిలిందాకు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్ తనను అడిగారని ఎప్‌స్టీన్ తెలిపాడు. ఆ తరువాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఇదే మెయిల్‌లో ఎప్‌స్టీన్ వెల్లడించాడు. అయితే.. ఈ ఆరోపణలను గేట్స్ బృందం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని ఆయన ప్రతినిధి మీడియాతో పేర్కొన్నారు. తనతో సంబంధాలు కొనసాగించకపోవడం వల్లే ఎప్‌స్టీన్ ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేశాడని తెలిపారు.

**ఎప్‌స్టీన్ ఫైల్స్.. 30లక్షల పేజీలు, 2వేల వీడియోలు విడుదల!**

**ఎప్‌స్టీన్ ద్వీపానికి మస్క్ కు ఆహ్వానం**

తాజాగా విడుదలైన పత్రాల్లో ఎప్‌స్టీన్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య జరిగిన పలు సంభాషణ కూడా వెలుగులోకి వచ్చింది. యూఎస్ వర్జిన్ దీవులలోని తన ద్వీపాన్ని సందర్శించాలని ఎప్‌స్టీన్ పలుమార్లు మస్క్‌కు ఈమెయిల్ ద్వారా ఆహ్వానాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఆహ్వానాన్ని టెస్లా అధినేత పలుమార్లు తిరస్కరించినట్లుగా కూడా ఉంది.

**బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు ఎప్‌స్టీన్‌కు ఆహ్వానం.**

తాజా ఫైల్స్‌లో బ్రిటన్ రాజు చార్లెస్3 సోదరుడు ఆండ్రూ పేరు మరోసారి ప్రస్తావనకు వచ్చింది. 2010లో ఆండ్రూ ఎప్‌స్టీన్‌ను బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో డిన్నర్‌కు ఆహ్వానించారని వీరి మధ్య జరిగిన ఈమెయిల్స్ ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. అయితే, ఎప్‌స్టీన్ ఆ ప్యాలెస్‌కు వెళ్లారా లేదా అనే విషయం అస్పష్టంగా ఉంది.

## ఏప్రిల్ 30 నాటికి రామాలయ పనులు పూర్తి

**ఉదయం డెస్క్:**

ఉత్తర్‌ప్రదేశ్ అయోధ్యలోని రామాలయ నిర్మాణానికి చెందిన మిగిలిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏప్రిల్ 30 నాటికి నిర్మాణ పనులు పూర్తవుతాయని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు.

విలేకరులతో మిశ్రా మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి ఎల్ అండ్ టీ, టీసీఎస్ కంపెనీలు మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. మిగిలిన పనుల నిమిత్తం కంపెనీలకు చెందిన బృందాలు ఆలయం వద్ద విధులు నిర్వర్తిస్తాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.19 వందల కోట్లు అవుతుందని, ఇప్పటివరకు రూ.16 వందల కోట్లు చెల్లించామని వెల్లడించారు. ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్, బిల్లు చెల్లింపులు కూడా పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత ఆలయం శ్రీరామ జన్మభూమి ఆలయ ట్రస్ట్ పరిధిలోకి వస్తుందన్నారు.

నగర శైలిలో నిర్మిస్తోన్న ఈ రామ మందిరం 2.7ఎకరాల్లో విస్తరించి ఉంది. 380 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మిస్తున్నారు. మొత్తంగా 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉంటాయి. అయోధ్యలో రెండేళ్ల క్రితం బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన సంగతి తెలిసిందే.



## డబ్బు యాచించడం సిగ్గుగా ఉంటుంది

### పాక్ ప్రధాని

**వుదయం, జనవరి 31:**



విదేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూ, ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని ప్రకటిస్తున్న తరుణంలో తాను , సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసీం మునీర్ ఆర్థిక సహాయం కోసం విదేశాలకు వెళ్లినట్టు పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. శుక్రవారం రాత్రి పాకిస్తాన్ అగ్ర ఎగుమతిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు.

పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి కారణంగా తన ప్రభుత్వం చేసిన క్లిష్టమైన ఎంపికల గురించి కూడా షరీప్ మాట్లాడారు. దేశ విదేశీ మారక నిల్వలు దాదాపు రెండింతలైనా, స్నేహపూరిత దేశాలు ఇచ్చిన రుణాలు కూడా అందులో ఉన్నాయన్నారు. మీకు తెలుసు, అప్పు కోసం వెళ్లినవాడు తన తలవంచవలసిందే అని ఆయన పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి తోడ్పాటు కోరేందుకు తాను, అసీం మునీర్ ఎంత ఇబ్బందిపడ్డామో షరీఫ్ వివరించారు. నేను, ఫీల్డ్ మార్షల్ మునీర్ డబ్బు కోసం యాచిస్తూ ప్రపంచమంతా తిరగేందుకు సిగ్గుపడతాం. అప్పు తీసుకోవడమనేది మా ఆత్మగౌరవంపై భారం. సిగ్గుతో మేం తలదించుకుంటున్నాం. అప్పు ఇచ్చినవారు మమ్మల్ని చేయమనే పనులను మేం కాదనలేం అని వ్యాఖ్యానించారు.

**ఐఎంఎఫ్ చర్చలు సాగుతున్నాయి**

అంతర్జాతీయ విత్త నిధితో పాకిస్తాన్ చురుకుగా చర్చలు సాగిస్తున్నతరుణంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. దేశాన్ని స్థిరీకరించేందుకు కఠినమైన విధానాలను అమలులో పెట్టినతర్వాత ఆర్థిక వృద్ధికి తోడ్పడే ప్రణాళికపై పాక్ ఐఎంఎఫ్ తో ఈ చర్చలు నిర్వహిస్తోంది. విదేశీ రుణాలపై పాక్ ఆధారపడటం పట్ల షరీఫ్ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం కోరడం అనేది జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తుందని అన్నారు.

### పాక్ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్న కీలక మిత్రులను ప్రశంసించిన షరీఫ్

పాకిస్తాన్ ప్రధాని చైనాను అన్ని పరిస్థితుల్లో అండగా ఉండే స్నేహితుడు అని ప్రశంసించారు. క్లిష్ట సమయాల్లో పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినందుకు సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశాలు విదేశీ మారక నిల్వలను స్థిరీకరించడానికి, చెల్లింపుల బ్యాలెన్స్ సంక్షోభాన్ని నివారించడానికి సహాయపడతాయి. చైనా బిలియన్ల కొద్దీ డిపాజిట్లను అందించింది. చైనాపాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌లో 60 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ప్రాజెక్టులు ఉన్నాయి. సౌదీ అరేబియా 3 బిలియన్ డాలర్ల డిపాజిట్‌ను పొడిగించి 1.2 బిలియన్ డాలర్ల చమురు సౌకర్యాన్ని అందించింది. యుఎఇ 2 బిలియన్ డాలర్ల రుణాన్ని అందించగా, ఖతార్ 3 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు, ఎల్ ఎన్‌జీ సరఫరాలకు ప్రణాళికలపై సంతకం చేసింది. పేదరికం, నిరుద్యోగం, బలహీనమైన ఆవిష్కరణలపై షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. పేదరికం 45 శాతంగాఉందని అంచనా, తీవ్ర పేదరికం 16.5 శాతం కాగా, నిరుద్యోగం 7.1 శాతంగా ఉంది. ఎనిమిది మిలియన్లకు పైగా ప్రజలు నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రభుత్వ అప్పు రూ. 76,000 బిలియన్లను దాటింది. పాకిస్తాన్ ఇప్పటికీ ఐఎంఎఫ్ కార్యక్రమాలు, విదేశీ రుణాలపై ఆధారపడి ఉంది.

## అమెరికాలో నిలిచిపోనున్న ప్రభుత్వ కార్యకలాపాలు



**వాషింగ్టన్, వుదయం జనవరి 31:**

అమెరికా 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నాయని అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. దీనినే షట్ డౌన్ అంటారు. మినియాపొలిస్‌లో ఇటీవల ఇద్దరు ఆందోళనకారులు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐస్) అధికారుల కాల్పుల్లో మరణించడంతో సెనెట్ డెమోక్రాట్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. చట్టాన్ని అమలుచేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతిస్తారు. సరిహద్దు భద్రతా దళాలకు మద్దతుగా నిలుస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే, అమెరికా పౌరులను చంపే ఐస్ అధికారులను ఉపేక్షించబోరు అంటూ వారు తీవ్రంగా స్పందించారు. ఐస్‌ను సంస్కరించకపోతే నిధుల విడుదల బిల్లుకు అవసరమైన ఓట్లు వేయబోమంటూ వారు హెచ్చరించారు. దీంతో హోంలాండ్ భద్రత, ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి. అయితే ఇది పాక్షికమేనని, వచ్చే వారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని ఎంపీలు పేర్కొన్నారు.

**అమెరికా ఆర్థికశాఖపై ట్రంప్ దావా.. వెయ్యి కోట్ల డాలర్ల పరిహారం కోరిన అధ్యక్షుడు!**

గతేడాది అక్టోబర్ 1న కూడా అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలో సుదీర్ఘకాలం అంటే 43 రోజుల పాటు ఈ ప్రతిష్టంభన కొనసాగింది. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. 1981 నుంచి యూఎస్ ప్రభుత్వం 16 సార్లు మూతపడింది. 201819 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా, అప్పుడు కూడా ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.

## అమెరికాలో మళ్లీ షట్ డౌన్ ..!

అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నట్లు అంతర్జాతీయ డియా శనివారం వెల్లడించింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ లోకి వెళ్లిపోయింది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఆమోదించడానికి అర్ధరాత్రి వరకూ గడువు ఉన్నా.. ఆ లోపు దాన్ని కాంగ్రెస్ ఆమోదించలేకపోయింది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువును కాంగ్రెస్ దాటవేయడంతో ప్రభుత్వం ఈరోజు పాక్షికంగా షట్ డౌన్ అయింది. దీంతో పలు సేవలు నిలిచిపోబోతున్నాయి. షట్‌డౌన్ స్వల్పకాలికంగా ఉండవచ్చని సెనేటర్లు చెబుతున్నారు. మరోవైపు గడువుకు ముందు బడ్జెట్ పై ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో, తాత్కాలిక లేదా పూర్తిసంవత్సర నిధుల చర్యను కాంగ్రెస్ ఆమోదించే వరకు కీలకం కాని పలు ప్రభుత్వ కార్యకలాపాల్ని నిలిపేస్తున్నారు. సభ తిరిగి సమావేశం అయ్యాక సెనేట్ మద్దతు ఉన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి తగినంత మద్దతును కూడగట్టడానికి చట్టసభ సభ్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ?. అమెరికాలో దాదాపు మూడో వంతు ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, రక్షణను నిర్వహించే అనేక ఏజెన్సీలలో షట్‌డౌన్ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విభాగాలు రాత్రికి రాత్రే షట్‌డౌన్ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించాలని భావించాయి. కానీ ఇది తాత్కాలికమేనన్న అంచనాలతో ఆ ప్రతిపాదన విరమించుకున్నాయి. వచ్చే వారం ప్రారంభంలో కాంగ్రెస్ ఊహించిన విధంగా ప్యాకేజీని ఆమోదిస్తే, కొన్ని రోజుల్లో నిధుల పునరుద్ధరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. షట్‌డౌన్ కొనసాగితే మాత్రం పదివేల మంది ప్రభుత్వ కార్మికులు జీతం లేని సెలవును ఎదుర్కోవలసి రావచ్చు, లేదా నిధులు అందేవరకు జీతం లేకుండా పని చేయాల్సి రావచ్చు.

## క్యూబాకు చమురు ఇస్తే టారిఫ్‌లు !

క్యూబాకు చమురును విక్రయించే లేదా అందించే దేశాల నుండి వచ్చే ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇప్పటికే తీవ్రమైన ఇంధన సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న క్యూబాను ఈ చర్య మరింత ఇబ్బందుల్లోకి నెడుతుంది.

ఈ ఆదేశాలు ప్రాథమికంగా మెక్సికోపై ఒత్తిడిని పెంచుతాయి. ప్రస్తుతం క్యూబాకు చమురు జీవనాడిగా మెక్సికో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అలాగే క్యూబాకు నిరంతరంగా సంఘీభావాన్ని కూడా ప్రదర్శిస్తూ వస్తోంది. క్యూబాను ఉక్కిరి బిక్కిరి చేయడానికి ప్రయత్నిస్తున్నారా అని ఒక విలేకరి ట్రంప్‌ను ప్రశ్నించగా, అది చాలా కఠినమైన పదమని వ్యాఖ్యానించారు. 'నేను అలా ప్రయత్నించడం లేదు, కానీ మనుగడ సాగించేలా అది కనిపించడం లేదు.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

కాగా ట్రంప్ ఉత్తర్వులను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా ఖండించారు. క్యూబాపై, క్యూబన్లపై తీవ్రమైన దురాక్రమణ చర్య అని వ్యాఖ్యానించారు. క్యూబాకు సంఘీభావంగా నిలిచే దేశాలను బ్లాక్‌మెయిల్ చేసే చర్యలకు ట్రంప్ పాల్పడుతున్నారని విమర్శించారు. గురువారం ఉదయం మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షబ్నంతో ట్రంప్ ఫోన్లో మాట్లాడారు. కాగా తాము క్యూబాపై చర్చలు జరపలేదని ఆమె చెప్పారు.

## ప్రమాణ స్వీకారం గురించి తెలియదు

### సీనియర్ నేత శరద్‌పవార్

**బారామతి, జనవరి 31 (వుదయం) :**

ఇటీవలే విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారన్న వార్తల నడుమ, ఈ పరిణామం గురించి, తనకు అసలు తెలియదని ఎన్సీపీ (ఎస్‌పి) అధిపతి శరద్ పవార్ శనివారం పేర్కొన్నారు.

బారామతిలో విలేకరుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఎన్సీపీలోని రెండు వర్గాలనూ ఏకం చేయడం దివంగత అజిత్ పవార్ కోరిక అని, ఆ విషయంపై చాలా ఆశావహంగా ఉన్నట్టు వివరించారు.

మాకు ప్రమాణ స్వీకారం గురించి తెలియదు. పత్రికలలో వచ్చిన వార్తల ద్వారా ఆ విషయం తెలుసుకున్నాం అని అన్నారు. ప్రమాణ స్వీకారానికి పవార్ కుటుంబం నుంచి ఎవరైనా వెడుతున్నారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ, తనకు దాని గురించి ఏమీ తెలియదని పేర్కొన్నారు. ఎన్సీపీ నిర్ణయం తీసుకుని ఉంటుందని, అందుకే ఆ విషయంపై తనతో చర్చలు ఏమీ జరపలేదని సీనియర్ నాయకుడు అన్నారు. ప్రమాణ స్వీకారం శనివారమే జరుగనుందని నాకు తెలియదు. ఆమె పార్టీకి చెందిన వారే నిర్ణయం తీసుకుని ఉంటారు. ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కరేల పేర్లు వినిపించాయని, వారే ఈ చొరవ తీసుకుని ఉంటారని అన్నారు. పార్టీలోనే అంతర్గతంగా ఈ నిర్ణయం తీసుకుని ఉంటారని ఆయన చెప్పారు. అజిత్ పవార్ మరణానంతరం ఆ పదవిని ఎవరో ఒకరు చేపట్టాలని అధికారంలో ఉన్న పక్షం అభిప్రాయపడి ఉంటుందని ఎన్సీపీ (ఎస్‌పి) అధిపతి అన్నారు. రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ శనివారం ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఎన్సీపీ వర్గాలు తెలిపాయి.



జనవరి 28వ తేదీన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడంతో దేవేంద్ర ఫడ్నవిస్ కేబినెట్‌లో ఉపముఖ్యమంత్రిగా ఉన్న ఆయన పదవిని ఆమెకు ఇవ్వాలని ఎన్సీపీ నాయకులు కొందరు డిమాండ్ చేశారు.

కాగా, గత నాలుగు నెలలుగా అజిత్ పవార్, ఎన్సీపీ (ఎస్‌పి) నాయకుడు జయంత్ పాటిల్ చర్చలు నిర్వహిస్తున్నారని, విమాన ప్రమాదం ఈ ప్రక్రియను ప్రతిష్ఠంభించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. మనం అజిత్‌ను వెనక్కి తీసుకురాలేం. ఆయనను కోల్పోయాం. ఇప్పుడు ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో చూడాలి అని ఆయన అన్నారు. రెండు వర్గాలూ కలిసి పని చేయాలనే ఏకాభిప్రాయానికి చేరామని, ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని శరద్ పవార్ చెప్పారు. రెండు వర్గాల విలీనకరణ నిర్ణయాన్ని ఫిబ్రవరి 12న ప్రకటించవలసి ఉంది. అజితే ఈ తేదీని నిర్ణయించారు, కానీ దురదృష్టవశాత్తు ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

ఉపముఖ్యమంత్రి పదవికి సునేత్రా పవార్ పేరును ప్రతిపాదించేటప్పుడు మిమ్మల్ని విశ్వాసంలోకి తీసుకున్నారా అని ప్రశ్నించినప్పుడు, ఏ రకమైన విశ్వాసం? వారి పార్టీ వేరు, మా పార్టీ వేరు అని సమాధానం చెప్పారు. ఈ పరిణామాలలో బీజేపీ జోక్యం గురించి తనకు తెలియదని కేంద్ర మాజీ మంత్రి అన్నారు. విమాన ప్రమాదం గురించి సాగుతున్న ఊహాగానాలకు గురించి అడిగినప్పుడు, డీజీసీఏ దర్యాప్తు ప్రారంభించిందని, అన్ని అంశాలను అది పరిశీలిస్తుందన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**

మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల యొక్క వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**టెండరు ప్రకటన నెం.బి-ఇ29-టీఆర్‌డీ-టీఎస్‌డీఆర్-39-2025-26 తేది: 29.01.2026** PUB/1845

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారుచే ఐఆర్‌ఇపిఎస్‌లో టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

**టెండరు నెం.:** బి-ఇ-29-టిఆర్‌డి-టిఎస్‌డిఆర్-39-2025-26. **పనిపేరు:** విజయవాడ డివిజన్: గుడివాడ మరియు భీమవరం సెక్షన్ మధ్య ఇపిసిపై ఎన్‌హెచ్(ఓ) క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఒన్‌టైం ఇంప్రూవ్‌మెంట్, గుడివాడ బైపాస్ టౌన్ స్ట్రెచ్ మాదిరిగా కిమీ 12+200 మరియు 15+200 నుండి రోడ్డు యొక్క ఇంప్రూవ్‌మెంట్ సహా కి.మీ. 230+600 వద్ద ఎన్‌హెచ్ 165పై బిజడ్‌ఎ-బివిఆర్‌ఎం సెక్షన్ పై ఎల్‌సి నెం. 52 పునఃస్థాపనలో స్పాన్ యొక్క టూ లేన్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి యొక్క ప్రతిపాదిత నిర్మాణం కు సంబంధించి ఓహెచ్‌ఇ నకు చేర్పులు మరియు మార్పులు. **సుమారు విలువ (₹):** 63,23,700.48, **బిడ్ సెక్యూరిటి (ఇఎండి) (₹):** 1,26,500/-. **పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **ముగింపు తేది:** 24.02.2026 న 15.00 గం.లు.

**ఎస్.నెం. 1-టెండరు ఫారం ధర (రూ.): లేదు.** పూర్తి వివరాలు మరియు షరతుల కొరకు www.ireps.gov.in వద్ద మా సైట్ దర్శించండి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/టీఆర్‌డీ/విజయవాడ**

**టెండరు ప్రకటన నెం.బి-ఇ29-టీఆర్‌డీ-టీఎస్‌డీఆర్-40-2025-26 తేది: 30.01.2026** PUB/1848

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారుచే ఐఆర్‌ఇపిఎస్‌లో టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

**టెండరు నెం.:** బి-ఇ-29-టిఆర్‌డి-టిఎస్‌డిఆర్-40-2025-26. **పనిపేరు:** టిడిడి: "తాడేపల్లి గూడెం (టిడిడి) స్టేషన్ వద్ద 720 మీ.ల సిఎస్‌ఆర్ తో రన్నింగ్ లైన్ మాదిరిగా గూడ్స్ షెడ్ సైడింగ్ మార్చుట కొరకు ప్రతిపాదన" కు సంబంధించి ప్రతిపాదిత కొత్త లైన్ల యొక్క విద్యుదీకరణ. **సుమారు విలువ (₹):** 1,54,02,669.88, **బిడ్ సెక్యూరిటి (ఇఎండి) (₹):** 2,27,000/-. **పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **ముగింపు తేది:** 27.02.2026 న 15.00 గం.లు.

**ఎస్.నెం. 1-టెండరు ఫారం ధర (రూ.): లేదు.** పూర్తి వివరాలు మరియు షరతుల కొరకు www.ireps.gov.in వద్ద మా సైట్ దర్శించండి.

A2338 **సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/టీఆర్‌డీ/విజయవాడ**

తదుపరి టెండరు షరతులు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways. gov.in వద్ద దర్శించండి.

# అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్యాభివృద్ధి

## జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్



మంచిర్యాల,జనవరి 31, 2026 (వుదయం):

ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షర మాల కార్యక్రమం ద్వారా వయోజన విద్య అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, గ్రామపంచాయతీ సర్పంచ్ మిట్టపల్లి రామ్ రెడ్డి లతో కలిసి ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ అక్షరాలు దిద్ది చదువు నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని, అప్పుడే సమాజంలో గౌరవ స్థానం లభిస్తుందని అన్నారు. ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలకు నిరక్షరాస్యులు ప్రతి ఒక్కరు రావడమే కాకుండా చదువు నేర్చుకుని 100 రోజుల్లో అక్షరాస్యులుగా తయారు కావాలని, అక్షర వికాసం పుస్తకంలోని 16 చాప్టర్ లను 100 రోజులలో పూర్తి చేయాలని తెలిపారు. వయోజన విద్య నేర్చుకుంటున్న మహిళా సంఘ సభ్యులు అక్షరాస్యతతో కీలక జీవన నైపుణ్యాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర కేంద్రం వాలంటీర్లు శిరీష, దాసరి శ్యామల, జె డి ఎం రామచందర్, ఎ పి ఎం వెంకటేష్, సి సి లు మోహన్, కృపవర్ణ, రాజమణి, వి ఓ ఎ లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.మంచిర్యాల జిల్లా పౌర సంబంధాల అధికారిచే జారీ చేయడమైనది

# ప్రతీకార చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపణ



వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 31:

సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.టెలిఫోన్ ట్యాపింగ్ పేరుతో బిఆర్ఎస్ పార్టీపై వేధింపులు కొనసాగుతున్నాయని, గత రెండేళ్లుగా ఈ అంశాన్ని దారావాహిక సీరియల్‌లా నడిపిస్తున్నారని ఆరోపించారు. అసలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి ప్రతిపక్ష నాయకులను వేధించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు అలీబాబా నలభై దొంగలు, దండుపాల్యం ముఠాల తరహాలో అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని, బొగ్గు స్కాం, 9 వేల ఎకరాల భూస్కాం వంటి పెద్ద స్కాంలు ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ అవినీతి వ్యవహారాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాజకీయ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కేందుకు సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదని, 1875లోనే టెలిగ్రాఫ్ చట్టం వచ్చిందని, ఆ చట్టం ప్రకారమే పోలీసు శాఖ సమాచార సేకరణ చేస్తుందని వివరించారు. ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఆదేశాలు ఇవ్వరని స్పష్టం చేశారు.విచారణ పేరుతో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకు లీకులు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధన కోసం 14 ఏళ్ల పాటు మడమ తిప్పని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన మహానేత కేసీఆర్‌ను వేధించడం అప్రజాస్వామికమని అన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ చేసిన "నేరం" ఇదేనా అని ప్రశ్నించారు.కక్ష సాధింపు ధోరణితోనే కేసీఆర్‌కు నోటీసులు ఇస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు, కొండా సురేఖ, సీతక్క సమ్మక్క-సారలమ్మ జాతరకు ఆహ్వానించేందుకు ఎర్రవెల్లికి వెళ్తే, పోలీస్ అధికారులు మాత్రం నందినీనగర్‌లోని కేసీఆర్ నివాసానికి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.ఎన్నికల అఫిడవిట్‌లో హరీష్ రావు చిరునామా సిద్దిపేటగా ఉన్నప్పటికీ హైదరాబాద్ చిరునామాకు నోటీసులు ఇవ్వడం వివక్షకు నిదర్శనమని అన్నారు. కేసీఆర్‌కు మాత్రం హైదరాబాద్‌లోనే నోటీసులు ఇచ్చారని, గతంలో రేవంత్ రెడ్డి చిరునామా కొడంగల్ అయినప్పటికీ హైదరాబాద్‌లో నోటీసులు ఇచ్చిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో స్పష్టమైన ద్వంద్వ వైఖరి కనిపిస్తోందని విమర్శించారు.ప్రతీకార వాంఛతో పనిచేస్తున్న రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు తగిన సమయంలో గట్టి శిక్ష వేయడం ఖాయమని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

# పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

- వారి అనుభవాలను స్ఫూర్తిదాయకం
- ఎస్పీ రోహిత్ రాజు
- ఘన సన్మానించిన ఎస్పీ, సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 31(వుదయం జిల్లా ప్రతినిధి):

పోలీసు శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఏఎస్సై మంచా నాయక్, ఏఆర్ ఎస్సై సూర్యనారాయణలను శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. 43 సంవత్సరాలు పోలీసు శాఖలో పని చేస్తున్న ఏఎస్సై మంచా నాయక్ ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తుండగా.. 41 సంవత్సరాలు తన సేవలను అందిస్తున్న ఏఆర్ ఎస్సై సూర్యనారాయణ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పదవీ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని కార్యాలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఎంటిఓ సుధాకర్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు కిల్లు శివకుమార్ నాయుడు

వరంగల్, జనవరి 31 (వుదయం జిల్లా ప్రతినిధి) :




జిల్లాలో నిర్వహిస్తున్న 2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు పూర్తి అవగాహనతో, అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు కిల్లు శివకుమార్ నాయుడు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వీరా రెడ్డిలతో కలిసి జిల్లా నోడల్ అధికారులతో కిల్లు శివకుమార్ నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ.. జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. సమష్టిగా, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం సూచనల మేరకు పూర్తి చేయాలని, అన్ని అంశాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, శిక్షణ, లాజిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నోడల్ అధికారులు తమ విధుల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వంతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణతో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించాలని అన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నిర్వహణలో అంకితభావంతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు భాస్కర్, సుధీర్ కుమార్, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి మున్సిపల్ ఎన్నికల స్క్రూటినీ పూర్తి

- 74 నామినేషన్లు సక్రమం
- బరిలో 73 మంది అభ్యర్థులు

ధర్మపురి, జనవరి 31 (వుదయం ప్రతినిధి):



ధర్మపురి మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన స్క్రూటినీ దశ ముగిసింది. శనివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన నామినేషన్ల పరిశీలన పూర్తయింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 113 నామి నేషన్లు దాఖలు కాగా,ఎన్నికల అధికారులు వాటిని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక కారణాలతో పలు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. చివరికి 73 మంది అభ్యర్థులకు చెందిన 74 నామి నేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధి కారులు ప్రకటించారు. కొంతమంది అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ సెట్ల నామినేషన్లు దాఖలు చేయడంతో అభ్యర్థుల సంఖ్య, నామి నేషన్ల సంఖ్యలో స్వల్ప తేడా ఉన్నట్లు ఎన్నికల అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగామున్సిపల్ కమిషనర్ శ్రీనివా సరావు మాట్లాడుతూ.. నామినేషన్ల పరిశీలనను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని, అర్హులైన అభ్యర్థుల జాబితాను ఖరారు చేశామని తెలిపారు. ఎన్నికల తదుపరి దశలు కూడా ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. మొత్తంగా స్క్రూటినీ పూర్తవడంతో ధర్మపురి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ స్పష్టతకు వచ్చింది.రాజకీయ వర్గాల్లో ఇప్పుడు ఉపసం హరణలు, వ్యూహాలపై చర్చ మొదలైంది.

# 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' వేగవంతం చేయాలి

- మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావుండొద్దు
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి

జగిత్యాల, జనవరి 31 (వుదయం ప్రతినిధి) :




అన్ని జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి రివిజన్ శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన వివరాలు సేకరించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను నిర్ధారించి శాతం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు తప్పు లింకింగ్‌లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని.. ఓటర్ల సౌలభ్యం కొరకు "బుక్ ఎ కాల్ (బుక్ ఏ కాల్)" సదుపాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన వివరించారు. ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకమని అధికారులు సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 69.94 శాతం జరిగిందని తెలిపారు. 100 శాతం పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో పని చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ అలాగే మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా తప్పు ఎంట్రీ లు జరగకుండా ప్రతి ఓటరూ మ్యాప్ అయ్యే విధంగా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన నిర్దిష్టమైన వివరాలు సేకరించేలా అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత, జగిత్యాల, మెట్‌పెల్లి, ఆర్డీవోలు మధు సూదన్, శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు హకీమ్, తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

## ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 31 (వుదయం ప్రతినిధి) :

కరీంనగర్ తిమ్మాపూర్‌లోని ఆర్టిఏ కార్యాలయంలోని జువ్వాడి చొక్కారావు (సారధి) చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారుల అజాగ్రత్త నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఎవరికివారు తమ బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎక్కడా వాటిని బ్రేక్ చేయవద్దని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులు చుట్టుపక్కల వారికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. తిమ్మాపూర్ సారథి చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ లో ఇప్పటివరకు దాదాపు 22,000 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు తిమ్మాపూర్ చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్‌ను సందర్శించి రూల్స్‌పై శిక్షణ పొందాలని సూచించారు. అడిషనల్ డిసిపి వెంకట రమణ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. అతివేగము నిర్లక్ష్యం అజాగ్రత్త తో నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే పూర్తిగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చన్నారు. ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా నెలరోజులపాటు జిల్లాలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. పోలీస్ శాఖ ఆర్ అండ్ బీ శాఖ వైద్యశాఖ వివిధ శాఖలతో కలిసి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. నెలలో ఒకరోజు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన తరగతులు నిర్వహించాలని ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ సూచించారు. రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్‌లో భాగంగా నిర్వహించిన క్విజ్ రంగోలి పోటీల్లో ప్రథమ చూపిన పలు పాఠశాలల విద్యార్థులకు మహిళలకు బహుమతులు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్ అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఆర్ అండ్ ఈ ఈ నరసింహా చారి ఎంవీఐ రవికుమార్ తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్ ఏఎంవీఐ లు స్రవంతి, హరిత చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఇన్‌స్ట్రక్టర్ హారికతో పాటు పలువురు అధికారులు ఆర్టిఏ పోలీస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ప్రజల నడకకు సౌకర్యం, భద్రతగా ఫుట్ పాత్‌లు
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఫుట్‌పాత్ పనుల డిజైన్‌లను పరిశీలన

ఖమ్మం, జనవరి 31 (వుదయం జిల్లా ప్రతినిధి) :



ఖమ్మం నగరంలో ఆధునిక మౌలిక వసతులతో పాటు ప్రజలకు నడకలో సౌకర్యం, ఆరోగ్యం, భద్రత కల్పించే విధంగా ఫుట్ పాత్‌ల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీలు చేశారు. ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతం నుంచి చేపట్టనున్న ఫుట్‌పాత్‌పై వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసే పనులను, టైల్స్ డిజైన్ అకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు ప్రజలకు సౌకర్యవంతంగా, భద్రతతో ఉండేలా నిర్మించాలని, చిన్నపిల్లలు, వికలాంగులు, వృద్ధులు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నడిచే విధంగా పనులు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. నగర అభివృద్ధి అనేది కేవలం రోడ్లు, భవనాల నిర్మాణంతోనే కాకుండా ప్రజల రోజువారీ జీవితాన్ని సులభతరం చేసే మౌలిక వసతులతో ముడిపడి ఉంటుందని తెలిపారు. ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా పనులు జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో తొలిసారిగా వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. లైట్ గ్రే రంగులో గ్రానైట్ రాళ్లు ఉపయోగించడం వలన ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా వర్షం, ఎండ వంటి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా, దీర్ఘకాలికంగా నిలిచి ఉపయోగపడతాయని అన్నారు. దివ్యాంగులు, వృద్ధులు సులభంగా నడిచేలా స్లోప్‌లు, ఎడ్జ్‌లు సరిగ్గా రూపకల్పన చేయాలని, ప్రజలకు వెలుతురు వలన ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రాత్రి వేళ అసౌకర్యం లేకుండా లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నగరం అంతా ఒకే విధమైన డిజైన్‌తో గ్రానైట్ ఫుట్‌పాత్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి వల్ల ప్రజలు నడక వైపు మొగ్గు చూపుతారని, దీని ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని, వాహనాలపై ఆధారపడకుండా నడకకు అనుకూలమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా కాలుష్యం కూడా తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. జరుగుతున్న నిర్మాణ అభివృద్ధి పనుల అమలులో ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పూర్తి బాధ్యతతో పర్యవేక్షణ చేస్తూ పనులు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ యాకుబ్ అలీ, ఖమ్మం గ్రానైట్ యాజమాన్యాలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి ఓటరు సర్వే తప్పనిసరి




- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, జనవరి 31(వుదయం):

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహించి, బీఎల్ఓలు తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేపట్టాలని, ఫారం-6ఏ, 7, 8 పెండింగ్‌లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కే.సీతా రామారావు, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్ నగర్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం

## ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్



అసిఫాబాద్, జనవరి 31 (వుదయం ప్రతినిధి)

మున్సిపల్ ఎన్నికల్లో కాగజ్ నగర్‌లో కాషాయ జెండా ఎగురవేస్తామని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ ధీమా వ్యక్తం చేశారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ హాజరై మాట్లాడారు. కాగజ్ నగర్ మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు నడుస్తున్నాయని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణానికి నూతన శాఖ గ్రంథాలయ భవనానికి ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి రూ.50 లక్షల అంచనాతో మంజూరు చేస్తున్నానని ప్రకటించారు. సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ.. కాగజ్ నగర్ పట్టణంలో డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

**పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తాం..**

అనంతరం భారతీయ జనతా పార్టీ కరపత్రాలను, డోర్ పోస్టర్‌లను విడుదల చేసి భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్, డా.అనిత, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ కుమార్, ఎన్నికల కన్వీనర్ కొండ్ర మనోహర్‌గౌడ్, కో కన్వీనర్ సమీర్ గుప్తా, మాజీ ఎంపిపి కొప్పుల శంకర్ తదితరులున్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

- జిల్లా ఏఎస్పీ నరేష్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని
- రోడ్డు భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 31(వుదయం జిల్లా ప్రతినిధి):



పాఠశాల స్థాయి నుంచే రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని భూపాలపల్లి జిల్లా ఏఎస్పీ నరేష్‌కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని అన్నారు. శనివారం మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ పాఠశాల ఆవరణలో పలు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి మాసోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఎస్పీ నరేష్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని విద్యార్థులను ఉద్దేశించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రహదారి నియమాలు పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని నొక్కి చెప్పారు. రోడ్డు దాటేటప్పుడు




జాగ్రత్తలు పాటించడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వారు వివరించారు. విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేసి సమాజంలో అవగాహన పెంచే బాధ్యత తీసుకుని రహదారి ప్రమాదాలు నివారణకు కృషి చేయాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, భారం అనుకోవద్దని సూచించారు. ప్రమాదాల వల్ల మన కుటుంబంతో పాటు ఇతరుల కుటుంబాలకు కూడా ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని కోరారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం, అధిక వేగం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, విలువైన నిండు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వాహనదారులతో పాటు ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని, సురక్షితమైన ప్రయాణం ద్వారా మన కుటుంబంతోపాటు ఇతరుల కుటుంబాలకు నష్టం కలుగకుండా చూసుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, ఐఎంవిఐలు సుందర్ లాల్, శ్రీనివాస్, ఐరాడ్ డిపిఎం లక్ష్మణ్, మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ హసీనా భానో అక్బర్ ఖాన్, గ్రీన్ వుడ్ పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

## బాలలను పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరం... జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి, జనవరి 31(ఉదయం జిల్లా ప్రతినిధి):** బాలకారిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా పోలీసుల కట్టుదిట్టైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బాలకార్మికుల నివారణ కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ - XII దశలో జిల్లా వ్యాప్తంగా 70 మంది బాలకారికలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కోసం 02 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 1 నుంచి జనవరి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ స్మైల్ - XII కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం



జరిగిందన్నారు. ఈ సందర్భంగా 70 మంది బాల కార్మికులను గుర్తించడమైంది అని తెలిపారు.వారిలో 55 మంది బాలురు, 15 మంది బాలికలు ఉన్నారని వివరించారు. భూపాలపల్లి సబ్ డివిజన్‌లో మొత్తం 23 మంది బాల కార్మికులు ఉండగా, అందులో బాలికలు 07 ఉండగా, 21 మంది బాలురు ఉన్నారు.కాటారం సబ్ డివిజన్‌లో మొత్తం 47 మంది బాల కార్మికులు ఉండగా, అందులో 39 మంది బాలురు, 08 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన మొత్తం 70 మంది బాలకారికలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి, బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించాని తెలిపారు.14 సంవత్సరాల లోపు గల బాలలను ఎలాంటి పనుల్లోనూ పెట్టరాదని, అలాగే 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాలకార్మికులుగా ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మన అందరిదని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. ఎక్కడైనా బాలకార్మికులను పనిలో పెట్టుకున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్ - XII కార్యక్రమంలో పోలీస్ శాఖ విద్యాశాఖ కార్మిక శాఖ డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం సమన్వయంతో పని చేసి, 70 మంది బాల కార్మికులను విముక్తులుగా చేసినందుకు అభినందించారు.

# మాయమాటలు నమ్మొద్దు

## పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
## కమిషన్ల కక్కుర్తితో కట్టిందే కాళేశ్వరం
## ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు





**ఖమ్మం, జనవరి 31 (ఉదయం జిల్లా ప్రతినిధి) :** ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు ప్రజల ముందుకు వచ్చి సొల్లు కబుర్లు చెబుతారు.. మాయమాటలతో మభ్య పెట్టే ప్రయత్నం చేస్తారు. వాటిని నమ్మవద్దు.. పదేళ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక్క ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారో చెప్పాలంటూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఏదులాపురంలో మున్సిపాలిటీలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహం చూస్తుంటే తప్పకుండా 32 వార్డులకు 32 కాంగ్రెస్ అన్ని కైవసం చేసుకుంటుందన్న నమ్మకం, పూర్తి విశ్వాసం నాకు ఉందన్నారు.

**అకౌంట్లు నింపుకోవడమే గత పాలకుల ధ్యేయం...**

ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ఆయన ప్రశ్నించారు.

**చేతల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం...**

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఏదులాపురానికి కొత్త హంగులు..**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. "వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం. ఎఫ్.సి.ఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం. మీ కష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వైభవంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం

## గజ్వేల్‌లో అధ్యాత్మిక కళ



**గజ్వేల్, జనవరి 31 (ఉదయం ప్రతినిధి):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో రేణుకా ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకం, హోమం, కుంకుమార్చనలు, పారాయణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గజ్వేల్ గౌడ సంఘం అధ్యక్షులు లింగంగారి రాజా గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదస్ శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం ప్రతి ఏటా ఈ జాతర, వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామని, గ్రామ దేవతల ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గౌడ సంఘం నాయకులు పంజాల గణేష్‌గౌడ్, రాజశేఖర్ శర్మ పంతులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌడ సంఘం కమిటీ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# చివరి శ్వాస వరకు ప్రజల మధ్యే ఉంటా

## కేసీఆర్ హామీలు మరిచినా.. అమలు చేస్తున్నది కాంగ్రెస్సే
## కాంగ్రెస్‌లోకి పెరుగుతున్న వలసలు
## ధర్మపురి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, జనవరి 31(ఉదయం) :** ధర్మపురి ప్రజల ఆశీర్వాదంతో ప్రజా ప్రతినిధిగా ఎన్నికై, చివరి శ్వాస వరకు ప్రజల మధ్యే ఉంటానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం ధర్మపురి మున్సిపాలిటీలోని 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వొజ్జాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అంతకుముందుగా కాళీమాత ఆలయ నిర్వాహకులు సంజీవ్ స్వామి సమక్షంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, గత పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజా ప్రభుత్వ పనితీరును వివరించారు. గతంలో ధర్మపురి ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చిన నాయకులు ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించారని మంత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. అధికా రంలో ఉన్న రోజుల్లో ప్రజలను మరిచి విలాసవంతమైన జీవితం గడిపారని విమర్శించారు. తాను ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల మధ్యే ఉండి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వల్లే మంత్రి పదవి ధర్మపురి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచానని, కాంగ్రెస్ తనకు మంత్రి పదవి అప్పగించిందని లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇది పదవి కోసం కాదని, ప్రజల సేవ చేసే బాధ్యతగా భావిస్తు న్నా నని తెలిపారు. బతికున్నంత కాలం ధర్మపురి ప్రజల గడప దాటకుండా ప్రజల మధ్యే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు.

2018 హామీలపై కేసీఆర్‌పై విమర్శలు.. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమి, అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఇది కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానించారు. ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు హామీలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మిగిలిన రెండు గ్యారంటీలను కూడా త్వరలోనే అమలు చేసి ప్రజల ముందుకు వస్తామని చెప్పారు. అన్ని హామీలు నెరవేర్చిన తరువాతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని స్పష్టం చేశారు.ధర్మపురిలో గత రెండేళ్ల కాలంలో ధర్మపురి పట్టణంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలయ్యాయని మంత్రి గుర్తు చేశారు. కొత్తగా 695 మందికి రేషన్ కార్డులు అందించామని తెలిపారు. 154 మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, ఇప్పటివరకు రూ.7 కోట్ల 70 లక్షలు చెల్లించామని చెప్పారు. సీఎం సహాయ నిధి ద్వారా 327 మందికి రూ.93 లక్షల 75 వేల ఆర్థిక సాయం అందించామని వివరించారు. కల్యాణలక్ష్మి పథకం కింద 206 పేద కుటుంబాలకు రూ.2 కోట్ల 6 లక్షల 23 వేలు అందించామని, గృహ జ్యోతి పథకం ద్వారా 2,783 మందికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అంద జేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.4 కోట్ల 2 లక్షల 58 వేల రుణమాఫీ చేశామ ని,15 కుల సంఘాలకు రూ.1 కోటి 85 లక్షలతో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, టీఎఫ్ఐడీసీ, రూరల్ డెవలప్‌మెంట్, స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్, సీఎస్ఆర్ నిధులతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ వైపు వలసలు 15వ వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన వడ్లూరి సునీల్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని కాంగ్రెస్‌కి మద్దతు ప్రకటించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. మసీద్ రాజేష్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ధర్మపురిలో కాంగ్రెస్‌కు రోజు రోజుకూ మద్దతు పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 అమలు

◆ ఎస్పీ నితికా పంత్



**అసిఫాబాద్, జనవరి 31 (ఉదయం):** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి జనవరి 31 వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డీఎస్పీ/ఏఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు.

నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కోలిపే ఎటువంటి ఆయుధాలు కలిగిఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధమన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గోడౌన్‌లో జాగ్రత్తలు పాటించాలి

## గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు
## గోడౌన్‌ల ఆకస్మిక తనిఖీ



**మధిర, జనవరి 31 (ఉదయం) :** మధిర మండలం, దెందుకూరు గ్రామంలోని గిడ్డంగుల సంస్థ గోడౌన్లను శనివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనకి చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న సన్న బియ్యం నాణ్యతను, నిల్వలను తనిఖీ చేశారు. సన్న బియ్యం రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లును క్షుణ్ణంగా పరిశీలించారు. ఎగుమతులు దిగుమతుల వివరాలను తెలుసుకున్నారు. గోడౌన్‌లో బియ్యం నిల్వల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించండి

## కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
## ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన



**వరంగల్, జనవరి 31 (ఉదయం ప్రతినిధి) :** ఉర్సు రంగసముద్రం చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధిలోని ఉర్సు రంగసముద్రం చెరువు పనులను ఇరిగేషన్, రెవెన్యూ, కుడా, పబ్లిక్ హెల్త్ జీడబ్ల్యూఎంసి ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకంలో భాగంగా వరంగల్ పరిధిలోని ఉర్సు రంగసముద్రం చెరువు ఎంపిక అయ్యింది. ఫోర్ షోర్ బండ్ అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రతిపాదనలు పూర్తి చేసి పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం వారు టెండర్ పిలిచినందున సంబంధిత అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ వెంటనే మొదలు పెట్టేలా చూడాలని..ఆ పనులను గ్రౌండ్ చేయడానికి ఇంజినీరింగ్, రెవెన్యూ, కుడా, పబ్లిక్ హెల్త్ జీ డబ్ల్యూ ఎంసి ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కుడా సిపిఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, పబ్లిక్ హెల్త్ డీఈ మొజామిల్ బల్దియా డీఈ రంగారావు, ఏఈ సౌజన్య, ఇరిగేషన్ ఏఈ వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ త్వరలోనే పూర్తి చేయాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

**కరీంనగర్, జనవరి 31 (ఉదయం ప్రతినిధి) :** ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలని తద్వారా సత్వరమే మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ, తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. 2002 వివరాలతో, ప్రస్తుత వివరాలు సరి పోల్చి మ్యాపింగ్ ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.




2002 ఓటర్ లిస్టు ప్రకారం కొత్త ఓటర్ లిస్టు మ్యాపింగ్ త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బిఎల్వోలతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ పై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ అర్బన్‌లో మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో అధికారులంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేష్, రమేష్ బాబు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో గెలుపు మనదే

- అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం
- కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీ గెలిపించాలి
- అభివృద్ధి మన అజెండా.. అభివృద్ధే మన నినాదం
- ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షుడు అయూబ్
- వార్డు ముఖ్య నాయకులతో విస్తృత సమావేశం



**వర్ధన్నపేట, జనవరి 31 (ఉదయం ప్రతినిధి) :** వర్ధన్నపేట టౌన్ పరిధిలోని 12 వార్డుల ముఖ్య నాయకులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి, కొనసాగుతున్న ప్రభుత్వ పనులు, ప్రజా సమస్యలు, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు వర్ధన్నపేట పట్టణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా విఫలమయ్యాయని తీవ్రంగా విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్ధన్నపేటలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం, విద్య, సాగునీరు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

వర్ధన్నపేట పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడం ద్వారా పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని,సబ్ జైలు నిర్మాణం వల్ల ప్రాంతానికి అవసరమైన పరిపాలనా సౌకర్యాలు మరింత బలోపేతం అవుతాయని,రూ.200 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ విద్యకు కొత్త ఊపిరి లభిస్తుందని, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వర్ధన్నపేట కోనారెడ్డి పేట చెరువు ఫీడర్ ఛానల్ మరమ్మతులు పూర్తయితే రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సుమారు రూ.20 కోట్ల రూపాయల నిధులతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అభివృద్ధి పనులు విస్తృతంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఈ అభివృద్ధి పనులన్నీ కేవలం నేటి అవసరాలను మాత్రమే కాకుండా వర్ధన్నపేట భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపడుతున్నవేనని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నదే కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు.

గత పాలకులు వర్ధన్నపేట పట్టణాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల కష్టాలు, అవసరాలను అర్థం చేసుకొని నిజాయితీగా పని చేస్తోందని అన్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపిస్తున్నది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమేనని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు వర్ధన్నపేట పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని పేర్కొంటూ, అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ప్రజల కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ శ్రేణులు, 12 వార్డుల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చిటూరి రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిలు, 12 వార్డుల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క- సారక్క తల్లులను

# దర్శించుకున్న చల్లా దంపతులు



**పరకాల, జనవరి 31 (వుదయం):**

అగ్రంపాడ్ సమ్మక్క-సారలమ్మ మహా జాతర పురస్కరించుకుని శనివారం అమ్మవార్లను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, ఉండాలని అమ్మవార్లను మనస్ఫూర్తిగా కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో

# వ్యాపార సముదాయాలకు శ్రీకారం



**దమ్మపేట జనవరి 31 (వుదయం ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలోని గల మల్లి భక్తాంజనేయ స్వామి గుడి పక్కన గల గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో వ్యాపార సముదాయాలకు అవకాశం కల్పించాలని జనేవల జరిగిన దమ్మపేట గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం పొందిన తదనంతరం శనివారం ఉదయం నుండి జె, సి,బి తో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ ఇట్టి పంచాయతీకి చెందిన స్థలంలో ఇంజనీర్ ప్లాన్ ప్రకారం నిర్దేశిత స్థలము కేటాయించి వ్యాపారస్తుల వారి స్వంత ఖర్చులతో కట్టుకునే విధంగా అద్దెకు ఇస్తామని, మరియు ఇట్టి స్థలం కావాల్సిన వాళ్లకు పంచాయతీ వారు నియమ నిబంధనలతో కూడిన అగ్రిమెంట్ చేసుకుంటామని అన్నారు. తద్వారా పంచాయతీకి నిధులు సమకూరి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతాయని తెలియజేశారు. అద్దెకి స్థలము కావలసిన వారు దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దాసరోజు సరిత రామారావు, గ్రామస్తులు మాదా లక్ష్మీ నారాయణ, గట్ల సర్వేశ్వరరావు, పెరుమళ్ళ కృష్ణ, పసుమర్తి పుల్లారావు, సుంకిపాక ధర్మ, గట్ల నాగరాజు, గొల్లపల్లి రామ కోటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బడ్జెట్లో నిధులు కేటాయించాలి

అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్



**దమ్మపేట జనవరి 31 (వుదయం ):**

అంగన్వాడి టీచర్లు మరియు హెల్పర్లకు కేంద్ర బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించి ఐ సి డి ఎస్ ను బలోపేతం చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. శనివారం బాలాజీ గూడెం మండలపల్లి లో అంగన్వాడి టీచర్ల సమావేశం తిరుప తమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ అంగన్వాడీలు గ్రామాల్లో గర్భిణీలు బాలింతలు పసిపిల్లలకు ఆరోగ్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వం నిర్వ హిస్తున్న అనేక కార్యక్రమాలలో వారి భాగస్వామ్యం ఉంటుందని అన్నారు. అంగన్వాడీల సేవలను గుర్తించిన అనేక సంస్థలు కోర్టులు సైతం అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలని కనీస వేతనాలు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని చెబుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి ఐసిడిఎస్కు నిధులు సరిపడా కేటాయించకుండా బలహీనపర చుస్తుందని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ లు అంగన్వాడీలను తమ సమస్యలపై గొంతెత్తకుండా ఉండేందుకు అన్ని రకాల చట్టాలు బిజెపి ప్రభుత్వం చేసిందని అన్నారు. పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని నూతన లేబర్ కోడ్ లు రద్దు చేయాలని ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రమణ, భద్రమ్మ చిట్టెమ్మ ధనలక్ష్మి కళావతి తదితరులు పాల్గొన్నారు.

"ప్రవేశ పరీక్ష"కొరకు

# దరఖాస్తుల స్వీకరణ

## ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

**తుంగతుర్తి(శాలిగౌరారం) జనవరి 31 (వుదయం ):**



రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో 6వ తరగతి నుండి 10వ తరగతులలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష కొరకు జనవరి 28 నుండి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ను విడుదల చేసింది. దీనిలో భాగంగా శాలిగౌరారం మండలం పరిధిలోని వల్లాల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లకు,ఏడవ తరగతి నుంచి పదో తరగతిలో ఏర్పడిన ఖాళీలను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయడం జరుగుతుందని వల్లాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ తెలిపారు.ఆసక్తిగల విద్యార్థులు www.telanganams.cgg.gov.in ద్వారా ఆన్లైన్ ప్రవేశ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని,దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# దొంగలను పట్టిన పోలీసులు

## ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగలను పట్టిన దమ్మపేట పోలీసులు

**దమ్మపేట(జనవరి31 (వుదయం ):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్ని రోజుల క్రితం జరిగిన ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనం కేసును దమ్మపేట పోలీసులు చాకచక్యంగా ఛేదించి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, దొంగిలించిన (90) కిలోల కాపర్ వైర్, దొంగతనానికి ఉపయోగించిన వైరు కట్టర్-1, రెంచులు -5, గడ్డపలుగు-1మరియు నిందితుల వద్ద నుండి మొబైల్ ఫోన్స్-3 మరియు రవాణా కి ఉపయోగించిన మారుతి సుజుకి కారు రి. నెం: టిజి-07-ఎక్స్-1983 స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలు ఏ 1: పల్లా లోవరాజు తండ్రి: అప్పారావు, వయసు 33 సంవత్సరాలు, కులము యాదవ, నివాసం: చిన్న చంక లపూడి గ్రామము, పత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా, ఏ 2- రేఖ సుదీర్, తండ్రి : బాబురావు,19 సంవత్సరాలు, కులం: యాదవ, వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం పారుపాక గ్రామం, రౌతులపూడి మండలం, కాకినాడ జిల్లా, ఏ-3: సారిక సురేష్, తండ్రి : సూర్యనారా యణ, వయస్సు : 28 సంవత్సరాలు, కులం :తూర్పు కాపు, నివాసం: వేములూరు గ్రామం, కొవ్వూరు మండలం ఈ సందర్భంగా దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ముగ్గురు నేరస్తులు దమ్మపేట మండలం దొంగలించిన ట్రాన్స్ఫార్మర్స్ 90 కిలోల కాపర్ వైర్ ని దమ్మపేట గ్రామంలో చెట్ల పొదలలో పెట్టి వెళ్ళిపోయారు అని, డబ్బులు అవ సరమై శనివారం ఉదయం సమయంలో దమ్మపేట కు కారులో వచ్చి, కారు డిక్కీ లో పెట్టుకొని రాగి వైర్ ను రాజమండ్రి లో అమ్ముకుందాం అని వెళ్తుండగా అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉదయం 11:00 గంటలకు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మరియు సిబ్బంది అయిన లక్ష్మణ్, రామకృష్ణరెడ్డి, కాలేశవలీ, రమేష్, నాగ ముత్యం తదితరులు వాహన తనికి చేయుచుండగా అట్టి వాహన తనిఖీలో పట్టుపడినారు అని, ప్రజా ఆస్తిని ధ్వంసం చేయడం లేదా దొంగతనానికి పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పైన తెలిపిన ముగ్గురు నిందితులపై సెక్షన్ 111(2)(బి) బి. ఎన్.ఎస్ ప్రకారం ఆర్గనైజేడ్ క్రైమ్ కింద వారికీ జీవిత ఖైదు పడే విధముగా కేసు ఫైల్ చేయడం జరిగింది అన్నారు

.ప్రజలు ఎవరైనా అనుమానాస్పద కార్య కలాపాలను గమనిస్తే వెంటనే పోలీసు లకు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగలను పట్టుకున్నందుకు ఎస్. పి రోహిత్ రాజ్, డీఎస్పీ సతీష్ కుమార్, సి.ఐ నాగరాజు లు దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి ని, పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, రామకృష్ణ రెడ్డి లను అభినందించారు .

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి

# కూసంపూడి మహేష్ విస్తృతంగా ప్రచారం

**సత్తుపల్లి జనవరి 31 (వుదయం ప్రతినిధి)**



సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 14వ వార్డు గాంధీనగర్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసంపూడి మహేష్ విస్తృతంగా డోర్ టు డోర్ ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన వార్డులోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తున్నారు.ప్రజల ఆశీస్సులు, మద్దతు తోనే గాంధీనగర్ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొంటూ,

బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల గుర్తైన కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా నిలుస్తున్నారు. వార్డులో ఎన్నికల సందడి నెలకొనగా, అభ్యర్థి మహేష్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

# బాల కార్మికుల నిర్మూలనకు ఆపరేషన్ స్మైల్

## 58 మంది బాల కార్మికులకు విముక్తి.. ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వుదయం )**



బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 8 లో భాగంగా 01.01.2026 నుండి 31.01.2026 వరకు జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పరిశ్రమలు,వ్యాపార సముదాయాలలో దాడులు నిర్వహిం చడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు బృందాలను ఈ దాడులను నిర్వహించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని,నెల రోజుల పాటు జరిగిన ఈ దాడులలో భాగంగా మొత్తం 58 మంది బాలకార్మికులను పట్టుకొని వారికి విముక్తి కలిగించడం జరిగిందని తెలిపారు.ఇందులో 09 మంది బాలికలు ఉండగా 49 మంది బాలురు ఉన్నారు.ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన 04 బాలికలు, 27 మంది బాలురలను గుర్తించినట్లు తెలిపారు.బాలబాలికలను పనిలో పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.జిల్లాలో మొత్తం 36 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఆపరేషన్ స్మైల్ 08 బృందం పట్టుకున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్ప గించడం జరిగిందని తెలియజేసారు.అనంతరం పిల్లల తల్లి దండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిం దని వెల్లడించారు.జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 నకు గానీ 1098కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఆపరే షన్ స్మైల్ 08 నకు డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి నోడల్ అధికారిగా వ్యవహరించారు.ఆపరేషన్ స్మైల్ బృందంలో పనిచేసి బాలకార్మికులకు విముక్తి కలిగేలా బాధ్యతలు నిర్వర్తిం చిన షీటీం ఇన్స్పెక్టర్ రాము,ఆరెఎస్సై రమాదేవి,ఎస్సైలు విజయ,సతీష్,శ్రా వణ్,రాఘవయ్య,సమ్మిరెడ్డి,లక్ష్మణ్,ఏఎ స్సై నాగయ్య,పీసీలు మల్లికాంబ,రాంబా బులను ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఎరుపు, గులాబీ మిక్సింగ్



- ఎరుపెక్కిన గులాబీ పార్టీ
- స్థానిక సమస్యల పరిష్కారానికై పొత్తు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఏ ఐ టి సి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

**రామకృష్ణాపూర్ /జనవరి 31 (వుదయం )**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సిపిఐ పార్టీ కలిసి పోటీ చేస్తున్నట్లు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య లు తెలిపారు. శనివారం రామకృష్ణాపూర్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలే దని, బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేక విఫ లమయ్యిందని ఆరోపించారు. క్యాతన పల్లి మున్సిపాలిటీ లో సిపిఐ పార్టీతో కలిసి పోటీ చేసి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి ప్రాంతంలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, సంస్థ వ్యక్తుల చేతిలో బలవతోందని సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య ఆరోపిం చారు.భవిష్యత్తులో కూడా బిఆర్ఎస్ పార్టీ తో పాటు కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. పొత్తుల్లో భాగంగా ఏయే స్థానాల్లో పోటీల్లో విజయం సాధిస్తామో మూడవ తేదీన తెలియజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్,

బి ఆర్ ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్ , మేడిపల్లి సంపత్, బి ఆర్ ఏస్,సిపిఐ నాయకులు, మాజీ కౌన్సిలర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నాపై ఆరోపణలు అవాస్తవం

**ఆర్మూర్, జనవరి 31(వుదయం):**



తనపై బంగారు వ్యాపారి కోమన్ పల్లి శ్రీనివాస్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవ మని కత్రాజీ విష్ణు తెలిపారు.ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో కత్రాజీ విష్ణు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కోమనపల్లి శ్రీనివాస్ కు తాను ఎటువంటి డబ్బులు ఇచ్చేది లేదని,ఇద్దరం కలిసి వ్యాపారం నిర్వహించామని, తండ్రి ఆరోగ్య పరిస్థి తిలో బాగా లేనందున హాస్పిటల్ తిరగ వలసి వస్తుందని,అనవసరంగా తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నాడ న్నారు.ఇది వరకే పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేశారని అన్నారు.పోలీసు లకు,సీపీకి తమపై వచ్చిన ఫిర్యాదుకు జ వాబిచ్చామ ని, బెదిరింపుల కు పాల్పడుతూ డబ్బులు చెల్లించాలని శ్రీనివాస్ ఇబ్బందులకు గురి చేస్తున్నా డని చెప్పాడు. పలుమార్లు దాడులు సైతం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.బొంబాయి కి చెందిన బంగారు వ్యాపారితో వ్యాపారం చేసి నష్టపోయి తమపై ఆరోపణలు చేయడం సరికాద న్నారు. ఆర్మూర్ లో కోమన్ పల్లి శ్రీనివాస్ నకిలీ బంగారు వ్యాపారం చేస్తాడని ఆరోపించారు.

# కాషాయ జెండా రెపరెపలు ఖాయం

**ఏదులా పురం (జనవరి31 (వుదయం ):**



.ఏదులాపురం గడ్డపై రాక్షస పాలనను అంతమొందించి, రామరాజ్యాన్ని స్థాపించడమే భారతీయ జనతా పార్టీ ఏకైక అజెండా అని బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం ఏదులా పురం మున్సిపాలిటీలో జరిగిన అభ్యర్థుల పరిచయ వేదిక మరియు దిశా నిర్దేశ సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా నెల్లూరి మాట్లాడుతూ.. దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టిన స్ఫూర్తితో ఏదులాపురాన్ని దేశంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. ఖమ్మం కమ్యూనిస్టుల కంచుకోట అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ బలహీనతకు నిదర్శనమని, ప్రస్తుతం ఏదులాపు రంలో వీస్తున్న బీజేపీ గాలిని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష నాయకులు బెంబేలెత్తుతున్నారని ఎద్దేవా చేశారు.గతంలో ఇక్కడ జరిగిన దౌర్జన్యాలు, అక్రమ కేసులను తీవ్రంగా ఖండించిన నెల్లూరి, న్యాయం లేని చోట ధర్మాన్ని స్థాపించేందుకే బీజేపీ వస్తోంద న్నారు. కార్యకర్తలు, అభ్యర్థులు ఎవరూ అధైర్యపడవద్దని, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మున్సి పాలిటీలోని మొత్తం 27 వార్డుల్లోనూ బీజేపీ అభ్యర్థులు బరిలో ఉన్నారని, విజయం బీజేపీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ యువకులకి , మహిళలకి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని వారిని గెలి పించుకోవాల్సిన బాధ్యత ఇటు కార్యక ర్తలపై అటు ప్రజలపై ఉందని చెప్పారు. సభాధ్యక్షులు రవి రాథోడ్ ఆధ్వర్యంలో తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ ముద్దు నాన్ లోకల్ వద్దు...

రామినేని శ్రీనివాసరావు

**కోదాడ జనవరి 31(వుదయం)**



14వ వార్డులో రామినేని శ్రీనుకు ఏకగ్రీవ మద్దతుకోదాడ పట్టణం 14వ వార్డులో స్థానికులకు అవకాశం ఇవ్వాలని, బయటి అభ్యర్థులను నిలబెట్టే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు ప్రజలు ఖండించారు. శనివారం రామినేని శ్రీని వాసరావు నివాసంలో జరిగిన సమావే శంలో అందరూ ఏకాభిప్రాయంతో రామినేని శ్రీనును తమ అభ్యర్థిగా ప్రక టించారు. ఇది తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, పార్టీ అధిష్టానం వెంటనే నిర్ణయం తీసుకోవా లని కోరారు. ఈ సందర్భంగా "లోకల్ ముద్దు – నాన్ లోకల్ వద్దు" అంటూ నినాదాలు చేశారు.

ఈ సమావేశంలో ఈదుల కృష్ణయ్య, ఎయిర్ ఫోర్స్ వెంకటరెడ్డి, పట్టాభి రెడ్డి, జైపాల్ రెడ్డి, షేక్ మీరా, యేసయ్య తది తరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన

## జంతు సంక్షేమ పక్షోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు అవగాహన



**సత్తుపల్లి జనవరి 31 (వుదయం )**

సత్తుపల్లి ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్ మరియు టాలెంట్ స్కూల్ లో జంతు సంక్షేమ పక్షోత్సవాలు కార్యక్రమం శనివారం ఏర్పాటు చేసాము.ఈ కార్య క్రమము లో డా. ప్రదీప్ కుమార్, సహాయ సంచాలకులు ఏరియా వెటర్నరీ హాస్పిటల్ సత్తుపల్లి, మాట్లాడుతూ జంతు హింసకు పాల్పడ కుండా కరుణ, దయతో ఉంటూ వాటిని సంరక్షిచాల్సిన అవసరం ఉందన్నారు. పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నియంత్రణ టీకాలు తప్పకుండ వేయాలని సూచించారు. నాటు కుక్క లకు సంతాన ఉత్పత్తి జరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిం చాలని, దీని వలన నాటు కుక్కల బేడదను దాని సంతానాన్ని అరికట్టవ చ్చున్నారు.కుక్కకాటు కరిచిన చోట జాగ్రత్తగా నీటితో 15 నుండీ 20 నిమిషాలు శుభ్రంగా కడిగి, ఆంటిబ యోటిక్ ఆయింట్మెంట్ కానీ, లోషన్ కానీ రాయాలి, వైద్యున్ని సంప్రదించి రాబిస్ వ్యాధి నిరోధక టీకా, టిటి ఇంజక్షన్, అదేవిదంగా కరిచిన కుక్క యొక్క ఆరోగ్య పరిస్థితిని గమనించా లని, టీకాలు కుక్క కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 28 వ రోజు రాబిస్ నివారణ టీకాలు ఇపించుకోవాలన్నారు.ఈ కార్యక్ర ములో, డా. శశిదీప్ మండల పశువైద్య అధికారి, డా. సఫియా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పీవీసీ కందుకూరు, హెడమాస్టర్ సోందు, ప్రభుత్వ హైస్కూల్, ఉపాధ్యాయులు, గవర్న మెంట్ హై స్కూల్ విద్యార్థులు,లెంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక సమగ్ర సవరణను

# పకడ్బందీగా నిర్వహించాలి

## .. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ఖమ్మంజనవరి 31 (వుదయం ప్రతినిధి)**



ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్ర మంపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం అధ్వర్యంలో చేపడు తున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్ర మాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటిని సందర్శించి వివరాలు సేక రించాలని, ఓటరు జాబితాలో గల ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టా లని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి తరపున ప్రతి పోలింగ్ కేంద్రానికిఇట్టి వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్డీసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

# క్యాతన్ పల్లి 15 వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ లో చేరికలు...



**రామకృష్ణాపూర్/ జనవరి 31 (వుదయం )**

మున్సిపాలిటీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలి టీలో ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పరిపాలిస్తున్న నియోజకవర్గంలో నీ క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15 వ వార్డ్ లో బారాస పార్టీ లో భారీ చేరికలు జరిగాయి. స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఆర్నె సతీష్ ఆధ్వర్యంలో బిజెపి సీనియర్ నాయకుడు సిరిమల్లె సుధాకర్ తన అనుచరులతో పార్టీలో చేరారు. స్థానిక నాయకురాలు చంద్రకళ తన అనుచరులతో బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. వారిని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు .రానున్న రోజుల్లో మునిసిపాలిటీ పీఠాన్ని భారాస పార్టీ కైవసం చేసుకుం టుందని,

అందుకు తగిన కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. పార్టీ కోసం కృషిచేసి మునిసిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాల్క సుమన్ నాయకు లకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### డబ్ల్యూజేఐ మీడియా డైరీని
# ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




**కరీంనగర్, జనవరి 31 (వుదయం );**

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మీడియా పాత్ర ముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని తన కార్యాలయంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎంఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన మీడియా డైరీని ఆమె ఆవిష్కరించారు.వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు దారం జగన్నాథ రెడ్డి, కార్యదర్శి గుడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలెక్టర్ కు తొలుత పూల మొక్కను అందజేసారు.డైరీ ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డైరీ ముద్రణకు సంబంధించి డబ్ల్యూజెఐ ప్రయత్నాన్ని అభినందనీయమన్నారు. యూనియన్ జిల్లా కమిటీకి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు వాస్తవిక దృక్పథంతో ఆలోచించాలని, సమాజానికి ఉపయోగపడే రచనలు చేయాలని కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగురం రమేష్, కోశాధికారి చిట్టిమల్ల మహేందర్,కార్యవర్గ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, గంగం రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం

*మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 15 వార్డుల అభ్యర్థుల ప్రకటన వార్డుల వారీగా ఇంచార్జిల నియామకంకాంగ్రెస్ హామీల వైఫల్యాన్ని ఎండగట్టాలని పిలుపు*




**ధర్మపురి, జనవరి 31 (వుదయం):**

ధర్మపురి మున్సిపాలిటీపై తిరిగి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కదలాలని మాజీ మంత్రి కొప్పులఈశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం ధర్మ పురిలో నిర్వహించిన పార్టీముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సి పల్ ఎన్నికల్లో పోటీ చేయ బోయే 15 వార్డుల అభ్యర్థుల పేర్లను ప్రకటించడంతో పాటు, ప్రతి వార్డుకు ఒక ఇంచార్జిని నియమిస్తూ నిర్ణయం తీసుకు న్నారు.ఎన్నికల స్టంట్లు నమ్మొద్దు ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధర్మపురిలో జరిగిన అభివృద్ధిని,అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో ఉన్న దుస్థితిని ప్రజలు గమని స్తున్నారని అన్నారు. రెండేళ్లుగా ధర్మపురి అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఎన్ని కల సమయంలో హడావుడిగా ప్రొసీడింగ్స్ ఇవ్వడం కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే అని విమర్శించారు. అధికార బలంతో, ధన బలంతో వస్తున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడానికి మనకు 'ప్రజల బలం' ఉందని ధీమా వ్యక్తం చేశారు.అభ్యర్థుల గెలుపే లక్ష్యంగావార్డుల వారీగా నియమించ బడిన ఇంచార్జిలు అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వ హించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందనే అంశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు. కొందరు నాయకులు స్వార్థం కోసం పార్టీని వీడినా, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పనిచేయాలని కోరారు. రానున్న రెండేళ్లలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.నిరసనలకు పిలుపుబీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎస్ఐటీ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిరసనగా ప్రతి మున్సిపాలిటీలో బైక్ ర్యాలీలు నిర్వహించాలని, గ్రామాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు, మున్సిపాలిటీ ఇంచార్జి రఘువీర్ సింగ్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, నియోజకవర్గ కన్వీనర్ అయ్యోరి రాజేష్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### అభివృద్ధే ధ్యేయం..
# ప్రజా సేవే లక్ష్యం

*గజ్వేల్ ప్రగతి కొనసాగాలంటే కారు గుర్తుకే మన ఓటు*

*2వ వార్డులో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతాప్ రెడ్డి పిలుపు*



**గజ్వేల్, జనవరి 31 (వుదయం )**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ: 2వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గోలి మమత సంతోష్ శనివారం వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.డి.సి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండే మమత సంతోష్‌ను గెలిపిస్తే వార్డు మరింత అభివృద్ధి చెందుతుంది. బీఆర్ఎస్ హయాంలోనే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఊహించని రీతిలో అభివృద్ధి చెందింది. నియోజకవర్గ ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారని, మున్సిపల్ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అభ్యర్థి గోలి మమత సంతోష్ హామీస్తూ...గత కేసీఆర్ ప్రభుత్వంలో గజ్వేల్ రూపురేఖలు మారి, దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఆమె గుర్తుచేశారు. "నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే, వార్డు సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతాను" అని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒకరు పాటించాలి

## ఎంవిఐ.జెఎన్ శ్రీనివాసరావు




**సత్తుపల్లి, జనవరి 31 (వుదయం ప్రతి నిధి):**

రోడ్డు భద్రత అనేది రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జె.ఎన్. శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు నియమాలు పాటిస్తే ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల (జనవరి 1 నుంచి 31 వరకు) ముగింపు సందర్భంగా శనివారం సత్తుపల్లిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రోడ్డు భద్రత అవగాహన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారితో రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, వారి డ్రైవర్లు, గంగారం బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన రవాణా శాఖ అధికారులు శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి చర్యలు వారి భవిష్యత్తుతో పాటు ఇతరుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరించారు.
రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణాన్ని సురక్షితంగా, సుఖవంతంగా మార్చుకోవాలని సూచించారు. వేగం కన్నా ప్రాణమే మిన్న అనే విషయాన్ని గుర్తించి వాహనాలు నడపాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాధాన్యతను వివరించారు. అవగాహన ప్రదర్శనలో రోడ్డు భద్రతపై నినాదాలు,
పాటలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారి సత్యనారాయణ,ప్రైవేటు విద్యా సంస్థల సంఘం సత్తుపల్లి డివిజన్ (ట్రస్మా) అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించాలి

## నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి




**సిద్దిపేట జనవరి 31 (వుదయం );**

నంగునూరు మండలంలోని నర్మెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. భారతీయ సంస్కృతిలో ఉపాధ్యాయుడి స్థానం ఎంతో గొప్పదని, విద్యార్థులను దేశభక్తులుగా, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.అనంతరం పాలమాకుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావు చేతుల మీదుగా 2026 నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తపస్ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు కత్తుల రామ్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ వాద ఉపాధ్యాయ సంఘం తపస్‌లో పని చేయడం గర్వకారణమని, ఉపాధ్యాయులంతా సంఘంలో చేరి దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ముందుండాలని పిలుపునిచ్చారు
.తపస్ మండల ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు, డీఏలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తపస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గడీల శ్రీకాంత్, వీరేశం, జైపాల్ యాదవ్, వెంకటేశం, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదవ రెడ్డి, చంద్రం, బలమల్లు, శ్రీహరి, లక్ష్మీ నర్సయ్య, రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ, సుమ, నాగలక్ష్మి , లావణ్య, ధరణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# అజాగ్రత్త-నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

- ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి.
- జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.



**కరీంనగర్ జనవరి 31, (వుదయం)**

కరీంనగర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి గురుతరమైన బాధ్యతని, భారం అనుకోవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. వాహనదారులతో పాటు ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణం సాగించాలని సూచించారు. సురక్షితమైన ప్రయాణం ద్వారా మన కుటుంబంతోపాటు ఇతరుల కుటుంబాలకు నష్టం కలగకుండా చూసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. శనివారం తిమ్మాపూర్ లోని ఆర్టిఏ కార్యాలయంలోని జువ్వాడి చొక్కా రావు (సారధి) చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారుల అజాగ్రత్త నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఎవరికివారు తమ బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎక్కడా వాటిని బ్రేక్ చేయవద్దని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులు చుట్టుపక్కల వారికి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. తిమ్మాపూర్ సారధి చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ లో ఇప్పటివరకు దాదాపు 22,000 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు తిమ్మాపూర్ చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ను సందర్శించి రూల్స్ పై శిక్షణ పొందాలని సూచించారు. అడిషనల్ డిసిపి వెంకట రమణ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. అతి వేగము నిర్లక్ష్యం అజాగ్రత్త తో నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే పూర్తిగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చ న్నారు. ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా నెలరోజులపాటు జిల్లాలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి శాఖ, వైద్యశాఖ, వివిధ శాఖలతో కలిసి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. నెలలో ఒకరోజు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన తరగతులు నిర్వహించాలని ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ సూచించారు. రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ లో భాగంగా నిర్వహించిన క్విజ్ రంగోలి పోటీల్లో ప్రథమ చూపిన పలు పాఠశాలల విద్యార్థులకు మహిళలకు బహుమతులు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకట రమణ, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ ఈ ఈ నరసింహ చారి, ఎంవీఐ రవికుమార్, తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్, ఏఎంవీఐ లు స్రవంతి, హరిత చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఇన్స్ట్రక్టర్ హారిక తో పాటు పలువురు అధికారులు, ఆర్టిఏ పోలీస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ వినియోగంలో అప్రమత్తం

- **ఒకే వేదికపై పబ్లిక్ రిలేషన్స్,**
- **పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు, డా.అజిత్ పాఠక్ నలంద పబ్లిక్ రిలేషన్స్ యూత్ ఫెస్టివల్**



**హైదరాబాద్, జనవరి 31,(వుదయం)**

కృత్రిమ మేధ(ఏఐ)ను అప్రమత్తంగా బాధ్యతతో వినియోగించాలని పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు, డా.అజిత్ పాఠక్ పేర్కొన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ), హైదరాబాద్ చాప్టర్, డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల సహకారంతో బాగ్‌లింగంపల్లిలోని డా. బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో శనివారం నలంద పబ్లిక్ రిలేషన్స్ యూత్ ఫెస్టివల్ – 2026ను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు, డా. అజిత్ పాఠక్ ముఖ్య అతిథిగా హాజరై, "సమాజంపై ప్రజా సంబంధాలు, ఆధునిక జర్నలిజం ప్రభావం – నైతికత" అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ కళాశాలల నుంచి వచ్చిన జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన సుమారు 180 మంది విద్యార్థులు, అధ్యాపకులు, పీఆర్ఎస్ఐ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా డా.అజిత్ పాఠక్ మాట్లాడుతూ... సత్యం, విలువలు, నైతిక కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను ఆయన తన ప్రసంగంలో విద్యార్థును ఉద్దేశించి మాట్లాడారు. పబ్లిక్ రిలేషన్స్, జర్నలిజం రెండూ ఒకే వేదికపై అంటే సమాచార ప్రసారంపై ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. పీఆర్ఎస్ఐ మాజీ దక్షిణ ప్రాంత ఉపాధ్యక్షుడు, నలంద ఫోరం కన్వీనర్ కృష్ణ బాజీ తన ప్రసంగంలో హైదరాబాద్ చాప్టర్ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచి, 11 విద్యాసంస్థల్లో నలంద విద్యార్థుల ఫోరంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. యాదగిరి కంభంపాటి స్వాగత ప్రసంగంలో, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడానికి వచ్చిన డా. అజిత్ పాఠక్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థుల మేలు కోసం పీఆర్ఎస్ఐ చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో హైదరాబాద్ చాప్టర్ సాధించిన విజయాలను వివరించారు.నలంద కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తూ పీఆర్ఎస్ఐ మాజీ సెక్రటరీ జనరల్, 'పబ్లిక్ రిలేషన్స్ వాయిస్' సంపాదకులు శ్రీ వై. బాబ్జీ, విద్యాసంస్థల్లో విద్యార్థి ఫోరంల ఏర్పాటు ద్వారా మార్గనిర్దేశక వ్యవస్థను నిర్మించి, భవిష్యత్తు నాయకులను తయారు చేయాలనే ఉద్దేశాన్ని ప్రశంసించారు.హైదరాబాద్ చాప్టర్ మాజీ చైర్మన్, 'కార్పొరేట్స్ నుంచి స్కూల్స్‌కు పీఆర్' కార్యక్రమ కన్వీనర్ లయన్ కె.గోవిందరాజ్, పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలు, ఆదర్శాలను పిల్లలలో నాటాలనే డా.అజిత్ పాఠక్ దృక్పథాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన కళాశాల డైరెక్టర్ డా.యాదగిరి, డా.శేఖర్ మట్టా, ప్రిన్సిపాల్ గత సంవత్సరం విద్యార్థుల బూట్ క్యాంప్ నిర్వహణకు పీఆర్ఎస్ఐ నుంచి లభించిన జాతీయ గుర్తింపుపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో హైదరాబాద్ చాప్టర్ ఏప్రిల్ 19న నిర్వహించనున్న 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ప్రజా సంబంధాల కాన్ఫరెన్స్ బ్రోచర్‌ను విడుదల చేశారు. పీఆర్ వాయిస్ అసోసియేట్ ఎడిటర్ పి.మోహన్ రావు, నలంద పీఆర్ఎస్ఐ విద్యార్థి ఫోరం సహ-కన్వీనర్ డా. ఫాతిమా సమర్థవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సభ్యుడు వి. వి. భుజంగరావు, మధు వాకిటి, అలాగే వివిధ కళాశాలాల అధ్యాపకులు డా కృష్ణ కుమార్, డా పర్వీన్ సుల్తానా, డా పావని, శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీలపై
# గులాబీ జెండా ఎగరాలి

## మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



**లక్షెట్టిపేట, జనవరి 31 (వుదయం ):**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పై గులాబీ జెండా ఎగరాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య నివాసంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, అధికార మత్తులో ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని తెలిపారు.మహిళకు రూ. 2500,తులం బంగారం, రూ. 2 లక్షల రుణమాఫీ, ఉచిత స్కూటీ లు, పెంచిన పెన్షన్ లు ఏమయ్యాయని ప్రశ్నించారు? గులాబీ జెండాతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపు ఖాయామని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం పలు వార్డ్ ల అభ్యర్థులను మాజీ ఎమ్మెల్యే ప్రకటించారు. త్వరలో పూర్తి స్థాయిలో అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొడెటి శ్రీనివాస్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### 2న వేలాల గ్రామంలో
# బహిరంగ వేలం

**జైపూర్,జనవరి 31 (వుదయం విలేకరి):**

జైపూర్ మండలం వేలాల గ్రామ గట్టు మల్లన్న ఆలయంలో లడ్డు,పులిహోర ప్రసాదాల అమ్మకాల హక్కు కొరకు,స్వామి వారికి మొక్కుబడిగా భక్తులు కొట్టి సమర్పించిన కొబ్బరి కాయ ముక్కలను పోగు చేయు హక్కు కొరకు ఫిబ్రవరి 2 సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు.వేలాల గ్రామం గట్టు మల్లన్న ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి జాతర 2026 ఫిబ్రవరి 14 నుండి 18 వరకు ఈ హక్కు కల్గి ఉంటారన్నారు.లడ్డు,పులిహోర,సిర ప్రసాదాల అమ్మకాల హక్కు కొరకు రూ.50 వేలు,కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు కొరకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.ఆధార్ జిరాక్స్,డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి ఈ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.వేలాల గ్రామ పంచాయతీ కార్యాలయం,దేవాదాయ ధర్మాదాయ శాఖా అధికారుల సమక్షంలో ఈ వేలం బహిరంగం షరతులకు లోబడి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమేష్ తెలిపారు.

# స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌పై దుష్ప్రచారాలు నమ్మవద్దు

## ఎలైట్ అడ్వైజర్ శ్రీగాది బాలరాజు

**సిద్దిపేట, జనవరి 31(వుదయం :**

స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీపై సోషల్ మీడియా, వాట్సాప్, ఆన్‌లైన్ మాధ్యమాలు, కొన్ని పత్రికల్లో వస్తున్న దుష్ప్రచారాలను పాలసీదారులు, ప్రజలు నమ్మవద్దని సిద్దిపేటకు చెందిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ (ఎలైట్) అడ్వైజర్ శ్రీగాది బాలరాజు స్పష్టం చేశారు.ఈ మధ్య కాలంలో క్లెయిమ్ తిరస్కరణలు, సేవల్లో లోపాలు అంటూ వాస్తవానికి భిన్నమైన అసత్య ఆరోపణలు వైరల్ అవుతున్నాయని, వాటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.
దేశవ్యాప్తంగా కోట్లాది మందికి ఆరోగ్య భద్రత కల్పిస్తున్న ప్రముఖ సంస్థ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ అని గుర్తు చేశారు.ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ( ఐ ఆర్ డి ఏ ఐ ) నియమావళి ప్రకారం పూర్తి పారదర్శకతతో ఈ సంస్థ పని చేస్తోందని, క్లెయిమ్ సెటిల్మెంట్‌లో కస్టమర్‌కు నిరంతర సేవలు అందిస్తున్న భారతదేశంలోనే అతిపెద్ద హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ స్టార్ హెల్త్ అని తెలిపారు.ఇన్సూరెన్స్ రంగంలో 20 సంవత్సరాలకు పైగా అనుభవంతో కోట్లాది భారతీయుల నమ్మకాన్ని పొందిన ఈ సంస్థ దేశవ్యాప్తంగా 14,000కు పైగా నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా సేవలు అందిస్తోందని చెప్పారు. అలాగే 15,500 మందికి పైగా ఉద్యోగులు, 950 బ్రాంచ్ కార్యాలయాలు, 8 లక్షలకుపైగా ఏజెంట్లతో పని చేస్తున్న ఏకైక సంస్థగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ గుర్తింపు పొందిందన్నారు.ఇప్పటివరకు రూ.62,500 కోట్లకు పైగా క్లెయిమ్స్‌ను సెటిల్ చేసి, కోటి 50 లక్షలకు పైగా క్లెయిమ్ సెటిల్మెంట్లతో పాలసీదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న సంస్థ ఇదేనని తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాలసీదారులకు మెరుగైన సేవలు అందించడంలో స్టార్ హెల్త్ మొదటి స్థానంలో ఉందన్నారు.సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారం నమ్మి ప్రజలు మోసపోవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే కంపెనీ అధికారిక వెబ్‌సైట్, కస్టమర్ కేర్ లేదా అధికారిక ఏజెంట్ల ద్వారా మాత్రమే స్పష్టత పొందాలని సూచించారు. వ్యూస్, లైక్స్ కోసమే కొంతమంది సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లలో నిజానిజాలు తెలుసుకోకుండా పెద్ద సంస్థలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.ఇలాంటి అసత్య ప్రచారాల వల్ల పాలసీదారుల్లో అనవసర భయం ఏర్పడి, ఇన్సూరెన్స్ వంటి కీలక రంగంపై తప్పుదారి పట్టించే అభిప్రాయాలు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా పనిచేస్తున్న సంస్థపై తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని, సోషల్ మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని శ్రీగాది బాలరాజు కోరారు.

# బెజుగామలో విద్యుత్ శాఖ ప్రజా బాట



**గజ్వేల్, జనవరి 31(వుదయం )**

గజ్వేల్ నియోజకవర్గంలోని బెజుగామ గ్రామంలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఈ జగదీష్, ఏఈ మారుతి హాజరయ్యారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ఈ గ్రామ సభ ముఖ్య ఉద్దేశ్యం అని ఏడీఈ జగదీష్ తెలిపారు. రైతులు విద్యుత్ వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్త కనెక్షన్లు, బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించారు. గ్రామస్థుల దృష్టికి వచ్చిన విద్యుత్ సరఫరా అంతరాయాలు, వంగిన స్తంభాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఏఈ మారుతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కీర్త గోపాల్, ఉప సర్పంచ్, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## సడెన్‌గా కాఫీ తాగడం మానేస్తే.. శరీరంలో జరిగే మార్పులు

ప్రస్తుత రోజుల్లో పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది కాఫీ, టీ వంటి పానియాలను తాగుతూ ఉంటారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితం లో ఇవి ఒక భాగమైపోయాయి. అయితే కాఫీలో కెఫిన్ ఉంటుంది. దీన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే



ప్రమాదం ఉంది. చాలా మంది మధ్య తరగతి వారికి టీ, కాఫీ అనేది కేవలం ఒక పానియం మాత్రమే కాదు.. ఇదొక ఎమోషన్. అలానే వారి డే మొత్తాన్ని సరిగ్గా నడిపించే ఇందనం. వీటిని మితంగా తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం మన ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో చాలా మంది టీ, కాఫీ లాంటి అలవాట్లను తగ్గించుకోవాలని చూస్తున్నారు. కానీ సడెన్‌గా ఈ అలవాటును మానుకోవడం వల్ల వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది వెనక్కి తగ్గుతారు. ఫేమస్ డైటీషియన్, దయాబెటిస్ నిపుణుడు డాక్టర్ అర్చన బాత్రా ప్రకారం.. ఒకేసారి కాఫీ మానేయడం వల్ల మంచి జరగడం కంటే చెడే ఎక్కువ జరుగుతుందని అంటున్నారు. కెఫిన్ మన నాడీ వ్యవస్థకు ప్రోత్సహించడంతో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి అకస్మాత్తుగా దానిని ఆపడం వల్ల మెదడుకు రక్త ప్రవాహంలో మార్పులు వస్తాయి. దీని వల్ల మనం అనేక రకాల సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని చెబుతున్నారు. తీవ్రమైన తలనొప్పి: శరీరానికి తగినంత కెఫిన్ లభించనప్పుడు రక్త నాళాలు వ్యాకోచించడం జరుగుతుంది.. తర్వాత తలనొప్పి రావడం జరుగుతుంది. అలసట, నిద్రలేమి: సడెన్‌గా కాఫీ మానేడం వల్ల శరీరంలో కేఫిన్ పరిమాణం తగ్గి శరీరం దాని సహజ శక్తిని కనుగొనడంలో ఇబ్బంది పడుతుంటుంది. దీని వల్ల నిద్రలేమి సమస్యలు, ఎప్పుడూ అలసటగా అనిపించడం జరుగుతుంది. మానసిక స్థితి మార్పులు: సడెన్‌గా కాఫీ మానేయడం వల్ల రు మానసికంగా సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అంటే అనవసరైమన ఆందోళన, ఏకాగ్రత కోల్పోవడం.. దేనిపై సరిగ్గా దృష్టిపెట్టలేకపోవచ్చు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు రు రోజుకు నాలుగు కప్పుల కాఫీ తాగితే, దాన్ని సడెన్‌గా తగ్గించకుండా.. మెల్లమెల్లగా తగ్గిస్తూ రండి. అంటే మొదటి వారంలో మూడు, రెండో వారంలో రెండు, చివరకు ఒకటి ఇలా నెమ్మదిగా కాఫీని తగ్గించండి. ఇలా చేసే సందర్భంగా శరీరంలో కెఫిన్ శాతం తగ్గుతుంది. కాబట్టి రు శరీరాన్ని హైడ్రెడ్‌గా ఉంచడం చాలా ముఖ్యం. ఇందుకోసం రు పుష్కలంగా నీరు తాగడం అలవాటు చేసుకోండి. కాఫీకి బదులుగా, రు తక్కువ కెఫిన్ కంటెంట్ ఉన్న గ్రీన్ టీ లేదా హెర్బల్ టీని అలావాటు చేసుకోండి. ఇలా రు క్రమం తప్పకుండా వీటిని పాటిస్తే.. ఎలాంటి సమస్యలు లేకుండా కాఫీని మానేవచ్చు.

## రంగు పోగొట్టండిలా!



ముప్పై దాటకుండానే తెల్లజుట్టు వచ్చేస్తోంది. దాన్ని దాచేద్దామని రంగేస్తాం. కానీ ఈ క్రమంలో చర్మానికి అంటిందనుకోండి... రంగు వేశామన్న సంగతిని గుర్తుచేస్తూ ఉంటుంది. ఓ పట్టాన వదలదు కూడా. ఈ చిట్కాలు పాటించేయండి... త్వరగా వదులుతుంది. వైట్ వెనెగర్‌లో దూదిని ముంచి రంగు అంటినచోట రుద్దండి. కాసేపలా రుద్దుతూ వెళితే నెమ్మదిగా మాయం అవుతుంది. అయితే తరవాత వెంటనే చల్లని లేదా గోరువెచ్చని నీటితో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలి. అప్పుడే అంటితే మాత్రం ఈ చిట్కా బాగా పనిచేస్తుంది. ముందు గోరువెచ్చని నీటితో ఆ ప్రాంతాన్ని కడగాలి. తరవాత లిక్విడ్ సోప్‌తో మరక అంటిన చోట రుద్దండి. తిరిగి గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. గోరువెచ్చని నీటిలో బేకింగ్‌సోడా కలిపి పేస్టులా చేయండి. ఆ మిశ్రమాన్ని మరక మీద ఉంచి రెండు నిమిషాలు మృదువుగా రుద్దాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. మొండి మరకలకు ఇది బాగా పనిచేస్తుంది. రబ్బింగ్ ఆల్కహాల్ లేదా శానిటైజర్‌ని దూదికి అంటించి, రంగు అంటినచోట మృదువుగా రుద్దండి. త్వరగా వదులుతుంది. అయితే కళ్ల దగ్గర మాత్రం దీన్ని వాడకపోవడమే మేలు. టూత్‌పేస్టుల్లో కొద్దిమొత్తంలో ఎక్స్‌ఫోలియెంట్లు ఉంటాయి. ఇవీ రంగును పోగొట్టడంలో సాయపడతాయి. కాసేపు దాన్ని రుద్ది, 3–5 నిమిషాలు వదిలేయండి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేయడమే. అయితే జెల్‌పేస్ట్ రకాలు ఇందుకు సాయపడవు. నాన్ జెల్ రకాలను ఎంచుకోవడం మేలు.

## గుండె సమస్యల్ని దూరం చేసే స్ట్రాబెర్రీస్

మనం రోజూ తీసుకునే పసుపు, మిరియాలు, ఆకుకూరలు, క్యారెట్స్, నెయ్యి, అరటిపండ్లు, పల్లీలు ఇవన్నీ కూడా మన అనారోగ్య సమస్యల్ని దూరం చేసి ఆరోగ్యాన్ని కాపాడేవే. అందుకోసమే, కచ్చితంగా వీటిని తీసుకోవాలి. అయితే, తీసుకున్నంత మాత్రాన అవి సరైన విధమైన రిజల్ట్ చూపిస్తుందని లేదు. ఎందుకంటే, అవి హెల్దీ ఫుడ్స్ అయినప్పటికీ వాటిని సరైన విధంగా తీసుకుంటేనే మనం అనుకున్న ఫలితాలని అందిస్తుంది. అందుకోసం ఏయే ఫుడ్స్‌ని ఎలా తీసుకోవాలో హెల్త్ కోచ్ మిరుణ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తున్నారు. పసుపు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో పాటు మరెన్నో పోషకాలు ఉంటాయి. అందుకే, దీనిని మన వంటల్లోనూ భాగం చేయడమే కాకుండా ఆయుర్వేదంలోనూ వాడుతుంటారు. అయితే, ఈ పసుపులోని గుణాలన్నింటిని అందుకోవాలంటే మాత్రం పసుపుని నల్ల మిరియాల పొడితో కలిపి తీసుకోవాలి. దీంతో పసుపులోని కర్కుమిన్ అనేది మన శరీరానికి చక్కగా అందుతుంది. ఇది పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేసి జాయింట్ పెయిన్స్, కీళ్ళ నొప్పుల వంటివన్నీ దూరమవుతాయి. కాబట్టి, పసుపుని మనం తీసుకున్నప్పుడు అందులో కొద్దిగా మిరియాల పొడిని కలిపి తీసుకోండి. ఇలా తీసుకుంటే దాని పనితీరు 2వేల శాతం పెరుగుతుందట. దీని వల్ల బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి నొప్పులు చాలా వరకూ దూరమవుతాయి. క్యారెట్స్ తింటే కళ్ళకి మంచిది. ఇంకా ఎన్నో లాభాలు. అయితే, వీటిని మనం హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండి తీసుకున్నప్పుడే ఆ బెనిఫిట్స్ మనకి లభిస్తాయి. అందుకోసం క్యారెట్స్‌ని మనం ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనె, నెయ్యి వంటి హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండడం మంచిది. దీంతో క్యారెట్స్‌లోని బీటా కెరోటిన్ బాడీకి అందుతుంది. దీంతో కంటి చూపుకి హెల్ప్ అవ్వడమే కాకుండా చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుంది. అరటి పండ్లు, పల్లీలు రెండూ మంచివే. అయితే, వీటిని విడివిడిగా తీసుకునే బదులు కలిపి తీసుకుంటే మంచిది. వీటి కాంబినేషన్ మంచి ప్రోటీన్ రిచ్‌గా మారుతుంది. ఎవరైతే బరువు పెరగాలనుకుంటారో అలాంటి వారు ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది. అంతేకాకుండా, మజిల్స్ కూడా బాగా పెరుగుతాయి. అదే విధంగా, విటమిన్ సి కోసం ఉసిరిని మన డైట్‌లో యాడ్ చేస్తుంటారు. వీటిని నేరుగా అలానే తీసుకోవడం కంటే తేనెతో కలిపి తీసుకోవాలి. దీంతోపాటు, కొద్దిగా మిరియాల పొడి కలిపి చూడండి. అప్పుడు ఇది సూపర్‌ఫుడ్‌గా మారి బ్రెయిన్ ఫోకస్ పెరిగేలా చేస్తుంది. జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది. స్ట్రాబెర్రీస్ తీసుకోవడం వల్ల మన బాడీకి యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా అందుతాయి. అయితే, వాటిని నేరుగా తీసుకోవడం కంటే డార్క్ చాక్లెట్‌తో కలిపి తీసుకోవడం మంచిది. దీంతో మనకి యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ అంది బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. దీంతో గుండె పనితీరు మెరుగ్గా మారుతుంది. కాబట్టి, ఎప్పుడైనా సరే డార్క్ చాక్లెట్‌ని స్ట్రాబెర్రీస్‌తో కలిపి తీసుకోండి. ఆపిల్స్ తీసుకుంటే డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదంటారు. అయితే, అలా ఆపిల్స్‌ని ఊరికే తీసుకోకుండా వాటిపై కొద్దిగా దాల్చినచెక్కపొడి కలిపి తీసుకోండి. దీంతో ఇన్సులిన్ లెవల్స్ మెరుగ్గా మారతాయి. ఎవరైతే షుగర్‌తో బాధపడుతున్నారో వారికి ఈ టిప్ చాలా బాగా హెల్ప్ అవుతుంది. బెస్ట్ కాంబినేషన్‌లా పనిచేసి షుగర్‌ని కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తుంది.



## అరటిపండ్లు, ఖర్జూరం తక్షణ శక్తి కోసం ఏది తినాలి?

అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా రు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరిలో అలసట, బలహీనత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రారంభమైతే.. మళ్లీ రాత్రి నిద్రపోయే వరకు ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నప్పటికీ అటువంటి సమస్యల నుంచి బయటపడటానికి సులభమైన మార్గాన్ని నిపుణులు చెబుతున్నారు. అదేంటంటే.. ఈ అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది





ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా రు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఒక అరటిపండులో దాదాపు 105 కేలరీలు ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అరటిపండ్లతో పోలిస్తే, ఖర్జూరం కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కేవలం మూడు లేదా నాలుగు ఖర్జూరాలు తినడం వల్ల కు 90 నుంచి 120 కేలరీల శక్తి లభిస్తుంది. అంతే కాదు వాటిలో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఎక్కువసేపు వ్యాయామం చేయాలనుకునేవారికి లేదా రోజంతా ఉత్సాహంగా పనిచేయాలనుకునే వారికి, అరటిపండ్లు మంచివి. వాటిలోని ఫైబర్ చక్కెరను నెమ్మదిగా రక్తంలోకి విడుదల చేస్తుంది. తద్వారా ఎక్కువ సమయం శక్తిని అందించడానికి సహాయపడుతుంది. వ్యాయామం తర్వాత అలసిపోయినా లేదా నీరసంగా అనిపించినా తక్షణ శక్తి కోసం ఖర్జూరం తినడం మంచిది. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. శరీరానికి వెంటనే గ్లూకోజ్‌ను అందిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు ఖర్జూరాన్ని తినేందుకు ఇష్టపడతారు. కానీ దయాబెటిస్ ఉన్నవారు వీలైనంత వరకు ఖర్జూర వినియోగాన్ని నియంత్రించుకోవాలి. కండరాల తిమ్మిరితో బాధపడేవారు ఖర్జూరం తినవచ్చు. ఇందులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాలు త్వర గా కోలుకోవడానికి సహాయపడుతుంది.

## విటమిన్ 'డి' అందేలా..!

సంపూర్ణ ఆరోగ్యానికి, ఇమ్యూనిటీని మెరుగుపరచుకోవడానికి మనం తీసుకునే ఆహారం కీలకం అన్న విషయం తెలిసిందే. ప్రత్యేకించి – రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ 'డి' పాత్ర ఎంత కీలకమైనదో తెలిసిందే. ఈ క్రమంలో–విటమిన్ 'డి' లోపం లేకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఏయే ఆహార పదార్థాల్ని మెనూలో చేర్చుకోవాలి? రండి.. తెలుసుకుందాం..! విటమిన్ 'డి' ఎముకల్ని దృఢంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. అదే ఈ విటమిన్ గనుక లోపిస్తే కండరాల బలహీనత, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, అలసట, ఆందోళన, ఒత్తిడి, జుట్టు రాలడం, దీర్ఘకాలిక జీర్ణ సంబంధిత సమస్యలు.. వంటివి తలెత్తే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే 'డి' విటమిన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు లేదంటే డాక్టర్ సలహా మేరకు సప్లిమెంట్స్ కూడా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పుట్టగొడుగుల్లో విటమిన్ 'డి' స్థాయిలు ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో పాటు బి1, బి2, బి5, కాపర్.. వంటి పోషకాలు కూడా పుట్టగొడుగుల్లో అధికంగా ఉంటాయి. అయితే పుట్టగొడుగుల్లోనూ బటన్ మష్రూమ్స్, స్ట్రా మష్రూమ్స్.. ఇలా వివిధ రకాలుంటాయి. ఆయా రకాలను బట్టి విటమిన్ 'డి' స్థాయిలు మారుతూ ఉంటాయి. గుడ్డులో విటమిన్ 'డి' తో పాటు ప్రొటీన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. అలాగే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉంటాయి. కావాలంటే ఇందులో రుచి కోసం కొన్ని కాయగూర ముక్కల్ని కలుపుకొని ఆమ్లెట్‌లాగా తీసుకోవచ్చు. చేపల్లోనూ విటమిన్ 'డి' స్థాయిలు ఎక్కువే. అలాగే ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్లు, ఫాస్ఫరస్.. వంటి పోషకాలు సంపూర్ణ ఆరోగ్యానికి సహకరిస్తాయి.సూర్యరశ్మి నుంచి మన శరీరానికి అధిక మొత్తంలో విటమిన్ 'డి' అందుతుంది. ఇది శరీరం క్యాల్షియంను గ్రహించడంలో సహకరిస్తుంది. తద్వారా ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే 'డి' విటమిన్ నాడులు, కండరాల ఆరోగ్యానికి అవసరం. అంతేకాదు.. రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలోనూ దీనికిదే సాటి! కాబట్టి రోజూ ఉదయాన్నే కనీసం పదిహేను నిమిషాలైనా ఎండలో ఉండాలన్నది నిపుణుల సలహా!



నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో మనకు సంపాదనపై ఉన్న శ్రద్ధ ఆరోగ్యంపై ఉండటం లేదు. సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం, మితిరిన పని ఒత్తిడి, మానసిక ఆందోళనల వల్ల చాలామంది తెలియకుండానే శారీరకంగా బలహీనపడిపోతున్నారు.

## ఈ సూపర్ ఫుడ్ తింటే 30 రోజుల్లోనే అద్భుతాలు..

అయితే బరువు పెరగడం కోసం మందులు లేదా పౌడర్ల జోలికి వెళ్లడం వల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపిస్తాయి. నేటి ఆధునిక కాలంలో బరువు తగ్గడానికి ఎన్ని చిట్కాలు ఉన్నాయో, సరైన బరువు లేక ఇబ్బంది పడే వారి సంఖ్య కూడా అంతే ఉంది. బిజీ జీవనశైలి, సరైన పోషకాహారం తీసుకోకపోవడం, మానసిక ఒత్తిడి వల్ల చాలామంది తక్కువ బరువు, నీరసంతో బాధపడుతున్నారు. కోల్పోయిన ఆరోగ్యాన్ని తిరిగి పొందడానికి మార్కెట్లో దొరికే కెమికల్ మందుల కంటే, మన ఆయుర్వేదంలో చెప్పబడిన సహజ పద్ధతులు ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగాలనుకునే వారికి ఎండిన ఖర్జూరం ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా కేలరీల సమతుల్యతను కాపాడతాయి.ఖర్జూరంలో కేవలం శక్తి మాత్రమే కాదు శరీరానికి అవసరమైన ఎన్నో ఖనిజాలు ఉన్నాయి. కాల్షియం ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది. ఐరన్ రక్తహీనతను తగ్గించి, రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది. పొటాషియం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఫైబర్ జీర్ణక్రియను సాఫీగా ఉంచి, మనం తినే ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించేలా చేస్తుంది. కండరాల నిర్మాణానికి, ఆరోగ్యకరమైన కొవ్వును పెంచడానికి ఖర్జూరాన్ని పాలతో కలిపి తీసుకోవడం అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. కొన్ని ఎండిన ఖర్జూరాలను రాత్రంతా పాలలో నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం ఆ ఖర్జూరాలను తిని, ఆ పాలను తాగడం వల్ల శరీరం చల్లబడటమే కాకుండా లోపల నుండి బలం చేకూరుతుంది. రసాయనాలతో కూడిన పౌడర్లు, మందుల జోలికి వెళ్లకుండా ఇలాంటి సహజసిద్ధమైన ఆహారంతో బరువును, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి.



## రాత్రి లైట్ వేసుకుని పడుకుంటున్నారా



రాత్రి పూట లైట్లు వెలిగించి నిద్రపోయే అలవాటు ఉందా? చీకటి అంటే భయంతోనో లేదా అజాగ్రత్తతోనో లైట్లు ఆర్పకుండా పడుకుంటున్నారా? అయితే రు ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నట్లే.. రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల కేవలం నిద్రలేమి మాత్రమే కాదు.. ఊబకాయం, గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు కూడా వచ్చే ముప్పు ఉందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. రోజంతా కష్టపడి పనిచేశాక.. హాయిగా నిద్రపోతేనే కదా రేపటి పనులకు శరీరం సిద్ధమయ్యేది.. కానీ చాలామంది రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోతుంటారు. చీకటి అంటే భయంతోనో లేదా భద్రతా కారణాలతోనో ఈ అలవాటును కొనసాగిస్తుంటారు. అయితే ఈ చిన్న అలవాటు ప్రాణాల దకు తెస్తుందని కు తెలుసా..? రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల ఊబకాయం నుంచి క్యాన్సర్ వరకు అనేక ముప్పులు ఉన్నాయని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మంచి నిద్ర కేవలం విశ్రాంతి మాత్రమే కాదు.. అది ఆరోగ్యానికి పునాది. మనం నిద్రపోతున్నప్పుడే మన శరీరం, మనస్సు దెబ్బతిన్న కణాలను సరిచేసుకుంటాయి. సరిగ్గా నిద్ర లేకపోతే చిరాకు, మానసిక ఒత్తిడి కలగడమే కాకుండా.. దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆందోళన వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మన శరీరంలో సిర్కాడియన్ రిథమ్ అనే ఒక సహజ గడియారం ఉంటుంది. చీకటి పడగానే మన శరీరం మెలటోనిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని గాఢ నిద్రలోకి తీసుకెళ్తుంది. కానీ రాత్రిపూట ప్రకాశవంతమైన వైట్ లైట్లు లేదా మొబైల్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల ఈ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా నిద్ర నాణ్యత తగ్గి, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. వెలుతురులో నిద్రించడం వల్ల శరీర మెటబాలిజం తగ్గి బరువు పెరుగుతారు. మాటిమాటికీ మేల్కొలుపు రావడం వల్ల నిద్రలేమి సమస్య వేధిస్తుంది. మెలటోనిన్ స్థాయిలు తగ్గడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒకవేళ చీకటిలో నిద్రపోలేకపోతే.. మృదువైన పసుపు లేదా ఆరెంజ్ రంగు లైట్లను వాడండి. ఇవి నిద్రపై తక్కువ ప్రభావాన్ని చూపుతాయి. నేటి వేగవంతమైన జీవితంలో నిద్రను నిర్లక్ష్యం చేయకండి. రాత్రిపూట లైట్లు ఆర్పడం అనే ఒక చిన్న మార్పు ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తుంది.

## షుగర్ ఉన్నవాళ్లు పెరుగుతింటే ఏమవుతుంది?

పెరుగు మన జీర్ణవ్యవస్థకు ఒక వరం లాంటిది. రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా ఎముకల బలానికి కూడా ఇది ఎంతో తోడ్పడుతుంది. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగు తినడం సురక్షితమేనా అనే ప్రశ్న చాలామందిని వేధిస్తుంటుంది. పెరుగు ఇన్సులిన్ సెన్సిటివిటీని ఎలా మెరుగుపరుస్తుంది? ప్యాక్ చేసిన పెరుగు ఆరోగ్యకరమేనా? భారతీయుల భోజనంలో పెరుగు లేనిదే ముద్ద దిగదు.



జీర్ణక్రియకు, ఎముకల బలానికి, రోగనిరోధక శక్తికి పెరుగు ఒక దివ్యౌషధం. అయితే, పెరుగు తినడం గురించి మనలో చాలామందికి కొన్ని భయాలు, సందేహాలు ఉన్నాయి. రాత్రి పూట తినకూడదని కొందరు, జలుబు చేస్తుందని మరి కొందరు అంటుంటారు. ఈ అపోహలపై మహారాష్ట్రకు చెందిన హోమియోపతి నిపుణుడు సాయాజీరావు గైక్వాడ్ క్లారిటీ ఇచ్చారు. చాలామంది పెరుగు తింటే జలుబు చేస్తుందని భయపడతారు. అయితే దీనికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని డాక్టర్ గైక్వాడ్ స్పష్టం చేశారు. పెరుగు తిన్న తర్వాత ఎవరికైనా అసౌకర్యంగా అనిపిస్తే, అది వారి శరీర తత్వాన్ని బట్టి ఉంటుందే తప్ప అందరికీ వర్తించదు. మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగుకు దూరంగా ఉండక్కర్లేదు. తియ్యని పెరుగులో గ్లైసెమిక్ లోడ్ తక్కువగా ఉంటుంది. పెరుగు శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. భోజనంతో పాటు తక్కువ మొత్తంలో పెరుగు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. రాత్రి పూట పెరుగు అస్సలు తినకూడదనే కఠినమైన నియమం ఏ లేదు. మంచి జీర్ణశక్తి ఉన్నవారు రాత్రి భోజనంలో పెరుగును నిరభ్యంతరంగా చేర్చుకోవచ్చు. అయితే మరీ భారీగా ఉండే ఆహారాలు లేదా వేయించిన వంటకాలతో కలిపి తీసుకుంటే కొందరికి అసౌకర్యం కలగవచ్చు. మార్కెట్లో దొరికే అన్ని ప్యాక్డ్ పెరుగుల్లో ప్రోబయోటిక్స్ ఉండవు. రు ప్యాక్డ్ పెరుగు కొనేటప్పుడు దాని లేబుల్ ద ప్రోబయోటిక్ అని ఉందో లేదో కచ్చితంగా తనిఖీ చేయాలి. వీలైనంత వరకు ఇంట్లో తోడు పెట్టుకున్న తాజా పెరుగు వాడటమే శ్రేయస్కరం.

## ఈ చిట్కాలతో..!

ఆరోగ్యం, అందం కోసం మన ఇంట్లో బామ్మలు, అమ్మమ్మలు ఎన్నో సహజసిద్ధమైన చిట్కాలు పాటించి ఉంటారు. వివిధ రకాల సమస్యల్ని దూరం చేయడంలో ఆ చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందామా? ఆయిల్ పుల్లింగ్ చేయడం వల్ల వివిధ రకాల ప్రయోజనాలు చేకూరతాయన్న సంగతి తెలిసిందే. పరగడుపున కొబ్బరినూనెతో పుక్కిలించడం వల్ల శరీరంలోని వ్యర్థాలు తొలగిపోతాయని.. తద్వారా రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. చాలామంది మహిళలు కళ్ల కింద నల్లటి వలయాలతో ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారు కాసేపు ఫ్రిజ్‌లో పెట్టి తీసిన టీ బ్యాగుల్ని కళ్లపై పెట్టుకోవడం వల్ల అందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ట్యానిన్లు.. నల్లటి వలయాల్ని దూరం చేసేందుకు సహకరిస్తాయని చెబుతున్నారు నిపుణులు. కొంతమందికి ఎక్కిళ్లు వచ్చాయంటే ఓ పట్టాన తగ్గవు. ఇలాంటప్పుడు ఉపశమనం కోసం నీళ్లు తాగుతుంటాం. అయినా తగ్గకపోతే ఒక టీ స్పూన్ పంచదారను నోట్లో వేసుకొని చప్పరిస్తే పరిష్కారం ఉంటుందట! జుట్టు రాలే సమస్యను తగ్గించడంలో ఉల్లిగడ్డలు పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఉల్లిగడ్డ రసాన్ని కుదుళ్లకు పట్టించి కాసేపు అలాగే ఉంచుకోవాలి. తద్వారా జుట్టు రాలే సమస్య తగ్గడంతో పాటు చుండ్రు ఉన్నా తొలగిపోతుందని చెబుతున్నారు నిపుణులు. కొంతమందిలో దంతాలు పసుపు పచ్చగా కనిపిస్తుంటాయి. ఇలాంటి వారు రోజుకో యాపిల్ తినడం మంచిదంటున్నారు నిపుణులు. యాపిల్ దంతాలపై ఉండే పసుపుదనాన్ని క్రమంగా తొలగించడంతో పాటు.. ఆరోగ్యాన్నీ అందిస్తుందట. ఈ పండులో ఉండే ప్రత్యేకమైన సమ్మేళనాలే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు.



# ఉచితాలు ఎత్తేస్తారా? ఆర్థిక సర్వేలో కేంద్రం ఏం చెప్పింది?



ఉచిత పథకాలపై ఆర్థిక సర్వేలో అంచనాలు ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్‌ఫర్లు సరికాదు ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదముంటుందన్న సర్వే దేశంలో ఉచిత పథకాలకు సంబం ధించి కేంద్ర ఎకనామిక్ సర్వేలో సంచలన విష యాలు వెలుగుచూశాయి. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన ఎకనామిక్ సర్వేలో ఉచిత పథకా లు, ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్ ఫర్లు చేయడం లాంటి పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఇలాంటి పథకాల కంటే కూడా బ్రెజిల్, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో ఉన్న పథకాలను అమలు చేస్తే బెటర్ అని అభిప్రాయపడింది. దేశంలో ఈ మధ్య కాలంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి పొలిటికల్ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా వరాలు ప్రకటిస్తున్నా యి. ఆడ వారికి 10వేలు ఇస్తాం. రైతులకు ఇవి ఇస్తాం.. చేనేతలకు అది ఇస్తాం.. పిల్లలకు ఇం కోటి ఇస్తాం.. నిరుద్యోగులకు ఫలానాది ఇస్తాం. ఇలా నోటికి వచ్చినట్టు హామీలు గుప్పిస్తు న్నాయి. ఏ రాష్ట్రం కూడా వీటికి అతీతం కాదు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, అసోం, పశ్చిమ బెంగాల్.. ఇలా ఒకటేంటి ప్రతి రాష్ట్రం కూడా ఇలాంటి ఉచిత హామీల విషయంలో తగ్గేదేలే అన్నట్టుగా ఉన్నాయి. దేశంలో ఉచిత హామీలు, మనీ ట్రాన్స్ ఫర్లు ఏ రేంజ్ లో పెరిగిందంటే 2023 నుంచి 2026 నాటికి అది ఐదింతలు పెరిగింది. ప్రస్తుతం దేశ ఆర్థిక బడ్జెట్ ద 1.7 లక్షల కోట్లు ఈ ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్ల రూపంలో ప్రజలకు అందుతున్నాయి. ఏడు రాష్ట్రాల్లో నెలవారీ వచ్చే ఆదాయం లో 87 శాతం కేవలం ఈ ఉచితాలకు ఇవ్వడానికే సరిపోతుందంటే పరిస్థితి ఏం స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక సర్వేతో పాటు ఇతర ప్రభుత్వ సర్వేలు, అంచనాలను గమనిస్తే ఈ ఉచిత పథకాలు, డబ్బులు ట్రాన్స్ ఫర్ల వల్ల పెద్దగా ఒరిగిందే లేదు. ఆ స్థాయిలో పురోగతి కూడా సాధించలేదు. మహిళలకు గానీ, ఇతరులకు గానీ ఇస్తున్న ఉచిత హామీల డబ్బుల వల్ల పెద్దగా వారి జీవితాలో మార్పులు తీసుకురాలేకపోయాయని సర్వేలు చెబుతున్నాయి. వాళ్లకు డబ్బులిస్తే ఏదో మంచి జరిగి వాళ్ల జీవితాలు మారతాయని ఆశించిన ఫలితం దక్కలేదు. మరోవైపు రాష్ట్రాల ఖజానాల ద ఆర్థిక భారం తడిసి మోపెడవుతోంది. దీని వల్ల ఆర్థిక లోటు పెరుగుతోంది. జనాల చేతిలో డబ్బుల పెడుతున్నప్పుడు, ఉచితాల రూపంలో కాకుండా ఏదో ఒక టార్గెట్ ఓరియంటెడ్ గా ఉండాలని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంటే, ఫర్ ఎగ్జాంపుల్ పిల్లలు స్కూలుకి వస్తేనే డబ్బులిస్తామని అంటే వాళ్ల స్కూలుకు వచ్చినప్పుడు వాళ్ల అటెండెన్స్ పూర్తిగా, ప్రాపర్ గా చెక్ చేసి వాళ్ల అకౌంట్లో డబ్బులు వేయడం. ఇది ఓ రకంగా బెటర్. ఎందుకంటే పిల్లలు చదువుకుంటారు.

## రష్యన్ క్రూడ్‌పై రిలయన్స్ భారీ డీల్
## ఫిబ్రవరి నుంచి పోటెత్తనున్న దిగుమతులు

ప్రముఖ భారతీయ పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, రష్యా నుంచి భారీ మొత్తంలో ముడి చమురును దిగుమతి చేసుకునేందుకు సిద్ధమైంది. రానున్న ఫిబ్రవరి నెల నుంచి ప్రతిరోజూ సుమారు 1.5 లక్షల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేయాలని కంపెనీ నిర్ణయించుకున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిణామాలు, దేశీయ ఇంధన అవసరాల దృష్ట్యా రిలయన్స్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ద్వారా భారత ఇంధన రంగంలో రిలయన్స్ తన పట్టును మరింత బలోపేతం చేసుకోనుంది. అమెరికా విధించిన ఆంక్షల పరిధిలోకి రాని రష్యన్ చమురు సంస్థలతోనే ఈ లావాదేవీలు జరగనున్నట్లు సమాచారం. రాబోయే రెండు నెలల పాటు ఈ కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని కంపెనీ ప్రతినిధులు భావిస్తున్నారు. అంతర్జాతీయ నియమ నిబంధనలను పాటిస్తూనే, తక్కువ ధరకే లభించే రష్యా క్రూడ్‌ను అందిపుచ్చుకోవాలని రిలయన్స్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనివల్ల కంపెనీకి ఉత్పత్తి వ్యయం తగ్గడమే కాకుండా, లాభదాయకత కూడా పెరిగే అవకాశం ఉంది. గత డిసెంబర్ నెలలో కూడా రిలయన్స్ సంస్థ అమెరికా ఆంక్షల నుంచి ప్రత్యేక మినహాయింపులు పొంది రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంది. ఆ సమయంలో కుదుర్చుకున్న ఒప్పందాలు విజయవంతం కావడంతో, ఇప్పుడు మరింత పెద్ద



మొత్తంలో ఆర్డర్లు ఇచ్చేందుకు కంపెనీ మొగ్గు చూపుతోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, దౌత్యపరమైన వెసులుబాటును ఉపయోగించుకుంటూ రిలయన్స్ తన దిగుమతులను కొనసాగిస్తోంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఇంధన భద్రతకు కూడా దోహదపడనుంది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో, రష్యా నుంచి నేరుగా కొనుగోలు చేయడం భారత్‌కు ఎంతో ప్రయోజనకరం. రిలయన్స్ వంటి పెద్ద సంస్థలు ఈ స్థాయిలో దిగుమతులు చేపట్టడం వల్ల దేశీయంగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో స్థిరత్వం ఏర్పడుతుంది. అమెరికా మరియు ఇతర పాశ్చాత్య దేశాల ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగకుండా రిలయన్స్ చట్టబద్ధంగానే ఈ డీల్స్‌ను పూర్తి చేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ దిగుమతులు భారత వాణిజ్య రంగంలో కొత్త చర్చకు దారితీయవచ్చు.

## సాఫ్ట్‌వేర్ నుంచి ఏఐ సొల్యూషన్ల వైపు
## మారుతున్న భారతీయ ఐటీ పరిశ్రమ

భారత ఐటీ రంగం సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి నుంచి వేగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సొల్యూషన్ల వైపు పయనిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దశాబ్దాలుగా మన ఐటీ పరిశ్రమకు ఉన్న బలాన్ని, పాత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి మోడల్‌కు బదులుగా, ఏఐ సొల్యూషన్స్ అందించేలా ఉపయోగిస్తున్నామని అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. భారత్ ఇప్పటికే ఏఐ సంబంధిత రంగంలో 70 బిలియన్ డాలర్ల(రూ. 6.44 లక్షల కోట్ల) పెట్టుబడులను సాధించింది. వచ్చే నెలలో జరిగే ఇండియా–



ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఇది రెట్టింపు కావొచ్చని వెల్లడించారు. ఈ సమ్మిట్ ప్రపంచంలోనే నాల్గవ, అతిపెద్ద ఏఐ సదస్సు. భారత్ తన ఏఐ ఎకోసిస్టమ్‌ను సరైన క్రమంలో అభివృద్ధి చేసిందని, దీని ద్వారా ప్రపంచ ఏఐ అభివృద్ధిలో దేశాన్ని కీలకంగా మార్చిందని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులకు కొత్త స్కిల్స్ కోసం శిక్షణ ఇస్తున్నాయని, క్లయింట్లతో తిరిగి సంబంధాలు ఏర్పరచుకుంటున్నాయని, కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషిస్తున్నాయని మంత్రి అన్నారు. ఇప్పటికే 5,00,000 మందికి పైగా విద్యార్థులు ఏఐ స్కిల్స్‌ను అందిపుచ్చుకున్నారు. త్వరలో 500 విశ్వవిద్యాలయాలలో ఏఐ మౌలిక సదుపాయాలు, కోర్సు పాఠ్యాంశాలను అందిస్తామని, తద్వారా విద్యార్థులు ఏఐ అవకాశాలపై మెరుగైన శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.

# బిజినెస్

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ షాక్?




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న కరువు భత్యం (ఆం)పై వారికి షాక్ తప్పేలా లేదు. ఈసారి కరువు భత్యం పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం పిసినారిగా వ్యవహరించబోతున్నట్లు తెలుస్తోంది. 8వ వేతన సంఘం సిఫార్సుల కోసం ఎదురుచూస్తున్న కేంద్ర ఉద్యోగులకు ఈసారి కరువు భత్యం ఊరటనిస్తుందని భావించగా.. అలాంటిదే లేదని తేలిపోతోంది. ఈ మేరకు కేంద్రం డీఏ పెంపును ఖరారు చేసినట్లు సమాచారం. ఈసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ కనిష్టంగా 2 శాతం, గరిష్టంగా 5 శాతం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో 2 శాతం పెరిగితే ప్రస్తుతం ఉన్న మూలవేతనం(బేసిక్ పే) లో 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగే ఛాన్స్ ఉంది. గరిష్టంగా 5 శాతం పెరిగినా అత్యధికంగా 63 శాతానికి మాత్రమే ఇది చేరనుంది. ఎందుకంటే కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 2025కి ప్రకటించిన అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని 148.2 వద్దే ఉంచింది. ద్రవ్యోల్బణం ప్రభావం నుండి జీతాలు, పెన్షన్లను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం ఎప్పటికప్పుడు సవరిస్తారు. అయితే ఈ సవరణకు ప్రాతిపదికగా పారిశ్రామిక కార్మికుల కోసం అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని తీసుకుంటారు. కానీ తాజాగా ప్రకటించిన సూచీని ఎలాంటి మార్పులు లేకుండా అలాగే ఉంచడంతో కరువు భత్యం గరిష్టంగా 5 శాతం పెరిగి 63 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం జూలై 2025లో 54 శాతంగా ఉన్న డీఏను 58 శాతానికి పెంచింది. ఇప్పుడు డీఏను ఖరారు చేసినా మార్చి లేదా ఏప్రిల్ లో కేంద్రం ఆమోదం తర్వాతే ఇది అమల్లోకి వస్తుంది. అయితే బకాయిలు మాత్రం చెల్లిస్తారు.

### భారత్‌కు ఏటా 8-10 బి. డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణాలు




దిల్లీ: వచ్చే అయిదేళ్ల పాటు ఏటా 8–10 బి. డాలర్ల (దాదాపు రూ.72,800–91,000 కోట్ల) మేర రుణాలు ఇవ్వడానికి ప్రపంచబ్యాంకు అంగీకరించింది. ఆ మేరకు కొత్త కంట్రీ పార్టనర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ (సీపీఎఫ్)ను ప్రపంచ బ్యాంక్ గ్రూప్, భారత్ ప్రకటించాయి. ఒక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలన్న మనదేశ లక్ష్యానికి అనుగుణంగా, తదుపరి వృద్ధి దశను వేగవంతం చేసేందుకు ఈ రుణాలు సహాయపడతాయి. 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా సీపీఎఫ్ ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వ నిధులను జత చేసి గ్రామీణ, పట్టణ భారత్‌లో మరిన్ని ఉద్యోగాలను సృష్టించడంపై సీపీఎఫ్ దృష్టి సారిస్తుందని ఆమె అన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగా నేతృత్వంలోని బృందంతో చర్చలు జరిపిన అనంతరం, ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

## ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు

దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4% లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024–25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది.



ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్– డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024–25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్–డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బడ్జెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు.

# క్రీడలు

### రాణించిన జ్ఞానేశ్వర్



నాగాలాండ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ మిడిల్డార్ బ్యాటర్ జ్ఞానేశ్వర్(87) అజేయ అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఓపెనర్ అభిషేక్ రెడ్డి(51), కెప్టెన్ రికీ బుు(46) కూడా రాణించడంతో రెండోరోజు ఆట నిలిచే సమయానికి ఆంధ్రప్రదేశ్ జట్టు 5వికెట్ల నష్టానికి 267పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 322 పరుగులతో శుక్రవారం ఆటను కొనసాగించిన నాగాలాండ్‌ను ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. సాయితేజ, త్రిపురణ విజయ్ మూడేసి వికెట్లకు తోడు సత్యనారాయణ రెండు వికెట్లతో నాగాలాండ్‌ను భారీస్కోర్ చేయడకుండా అడ్డుకున్నారు. దీంతో ఆ జట్టు మరో 45పరుగులు జతచేసి చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. దీంతో నాగాలాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 267పరుగులకే పరిమితమైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్‌కు శుభారంభం దక్కలేదు. అభిషేక్ రెడ్డి రాణించినా.. వికెట్ కీపర్ శ్రీకర్ భరత్(0), షేక్ రషీద్(1) నిరాశపరిచారు.

## బంగ్లాదేశ్ నిర్ణయంపై సురేశ్ రైనా అసహనం..
## భారత్‌లో ఆడితేనే ఆ జట్టుకు మేలు!



భద్రతా కారణాలను సాకుగా చూపుతూ భారత్ లో జరగనున్న టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకోవాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిర్ణ యంపై టీమ్ ఇండియా మాజీ స్టార్ క్రికెటర్ సురేశ్ రైనా తీవ్రంగా స్పందించారు. ఈమెగా టోర్నీలో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ జట్టు భారత్‌కు వచ్చి ఉంటే బాగుండేదని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పొరుగు దేశం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం క్రికెట్ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లా దేశ్ జట్టు చాలా బలంగా ఉందని, ముఖ్యంగా ఉపఖండంలోని పిచ్‌లపై ఆ జట్టు స్పిన్నర్లు అద్భుతంగా రాణించే అవకాశం ఉండేదని రైనా విశ్లేషించారు. భారత్‌లోని వాతావరణం, ఇక్కడి వికెట్ల తీరుపై బంగ్లా ఆటగాళ్లకు మంచి అవగాహన ఉందని, ఈ టోర్నీలో వారు మెరుగైన ప్రదర్శన చేసే వీలుండేదని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వదులుకోవడం వల్ల ఆ జట్టు ఒక మంచి వేదికను కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం క్రీడా పరంగానే కాకుండా, ఆర్థికంగా కూడా ఈ నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్‌కు పెద్ద దెబ్బ అని రైనా హెచ్చరించారు. ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీల నుంచి తప్పుకోవడం వల్ల బోర్డుకు వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన సమయంలో ఇలా వెనక్కి తగ్గడం ఆ దేశ క్రికెట్ అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

## అతడికి ఇదే చివరి అవకాశం కావొచ్చు!

టీ20 ప్రపంచకప్–2026 టోర్నమెంట్‌కు ముందు టీమిండియా న్యూజిలాండ్‌తో ఆఖరి మ్యాచ్‌కు సిద్ధమైంది. తిరువనంతపురం వేదికగా భారత్– కివీస్ మధ్య శనివారం ఐదో టీ20కి షెడ్యూల్ ఖరారైంది. ఈ నేపథ్యంలో అందరి కళ్లు స్థానిక ఆటగాడు సంజూ శాంసన్‌పైనే ఉన్నాయి. గతేడాది కాలంలో టీమిండియా టీ20 ఓపెనర్‌గా రాణించిన సంజూ కివీస్‌తో గత నాలుగు మ్యాచ్‌లలో మాత్రం తేలిపోయాడు. ముఖ్యంగా వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నీకి ముందు అతడు ఇలా విఫలం కావడం ఆందోళనకరంగా మారింది. మరోవైపు.. ఇషాన్ కిషన్ రూపంలో సంజూకు పోటీ తీవ్రతరమైంది. కివీస్ ఆఖరి మ్యాచ్‌లోనూ ఈ కేరళ స్టార్ విఫలమైతే.. ప్రపంచకప్ టోర్నీలో వికెట్ కీపర్‌గా.. ఓపెనర్‌గా అతడి స్థానాన్ని ఇషాన్ భర్తీ చేసే అవకాశాలు పెరుగుతాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఓపెనర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. ''తిరువనంతపురంలో ఆఖరి మ్యాచ్. హోం బాయ్ సంజూ శాంసన్‌కు కూడా బహుశా ఇదే చివరి అవకాశం కావొచ్చు. ఈ మ్యాచ్‌లో అతడిపై ఒత్తిడి మరింత పెరగడం



ఖాయం. గత కొన్నాళ్లుగా అతడు పరుగులు రాబట్టడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఆత్మవిశ్వాసంతో షాట్లు ఆడలేకపోతున్నాడు. మరోవైపు.. ఇషాన్ కిషన్ దుమ్మురేపుతున్నాడు. కాబట్టి కివీస్‌తో ఐదో టీ20లో సంజూ బాగానే ఆడినా.. టీ20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా అతడి స్థానం సుస్థిరం అని చెప్పలేము. ఒకవేళ టాపార్డర్‌లో ముగ్గురు ఎడమచేతి వాటం బ్యాటర్లు వద్దు అని మేనేజ్‌మెంట్ అనుకుంటే మాత్రమే సంజూ.. ఇషాన్‌ను దాటి తుదిజట్టులోకి రాగలడు'' అని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. కాగా గత నాలుగు మ్యాచ్‌లలో సంజూ చేసిన స్కోర్లు 10, 6, 0, 24. ఇదిలా ఉంటే.. మరో ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు వన్‌డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ కూడా లెఫ్టాండర్ బ్యాటర్ అన్న సంగతి తెలిసిందే. ఇషాన్ కూడా ఎడమచేతి వాటం ఆటగాడే. ఈ నేపథ్యంలో ఆకాశ్ చోప్రా పైవిధంగా వ్యాఖ్యలు చేశాడు. కాగా తిలక్ వర్మ గాయం నుంచి కోలుకుని వరల్డ్‌కప్‌తో నేరుగా రీఎంట్రీ ఇవ్వనున్నాడు. ఇదిలా ఉంటే.. ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ మొదలుకానుంది. ఇందుకు భారత్– శ్రీలంక వేదికలు.

## అతడి కెప్టెన్సీలో హిట్‌మ్యాన్ ఛాయలున్నాయి: ఇర్ఫాన్ పఠాన్

కెప్టెన్సీ విషయంలో సూర్యకుమార్ యాదవ్‌కు రావాల్సినంత క్రెడిట్ రావడం లేదని.. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా సూర్య స్టైల్‌లో రోహిత్ శర్మ



ఛాయలు ఉన్నాయని అతడు అన్నాడు. 'సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డ్ ఉంది. టీ20 ఫార్మాట్లో కెప్టెన్‌గా అతడికి విజయాల శాతం 84. ఇది చాలా ఎక్కువ. కానీ మనం సూర్యకుమార్‌కు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వడం లేదు. అలాగే సూర్య కుమార్ యాదవ్ బౌలర్ల కెప్టెన్. అతడిలో రోహిత్ శర్మ ఛాయలున్నాయి. అతడు బౌలర్లపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తాడు. జట్టు కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటాడు' అని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. 'సూర్యకుమార్ యాదవ్ సానుకూల దృక్పథంతో ముందుకుసాగాలి. కెప్టెన్‌గా అతడు కచ్చితంగా వరల్డ్ కప్ ఆడతాడు. కానీ బ్యాటర్‌గా సూర్య పరుగులు రాబట్టాల్సి ఉంది. అది అతడికి ఎంతో కీలకం' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ రికార్డ్ అద్భుతంగా ఉన్నప్పటికీ, అతడు కొంతకాలంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ముఖ్యంగా 2025లో అతడు తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. 21 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 218 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు సూర్య తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో రెండు, మూడు టీ20ల్లో వరుసగా రెండు హాఫ్‌సెంచరీలు సాధించాడు. అంతకు ముందు అతడు చివరిసారిగా అక్టోబర్ 2024లో అర్ధశతకం చేశాడు.

## టీమ్ ఇండియా సత్తాపై రవిశాస్త్రి ధీమా!



టీ20 క్రికెట్ ఫార్మాట్ రోజురోజుకూ బ్యాటర్ల రాజ్యంగా మారుతోంది. ఈ క్రమంలో రాబోయే టీ20 ప్రపంచకప్‌లో భారత్ లేదా ఆస్ట్రేలియా జట్లు ఏకంగా 300 పరుగుల మైలురాయిని అందుకునే అవకాశం ఉందని టీమ్ ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆధునిక క్రికెట్‌లో బ్యాటర్ల దూకుడు, మెరుగైన బ్యాట్లు మరియు చిన్న బౌండరీల దృష్ట్యా ఈ అసాధ్యమైన స్కోరు సుసాధ్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో ధాటిగా ఆడే జట్లకు ఇది పెద్ద కష్టమే కాదని ఆయన విశ్లేషించారు.భారత్ మరియు ఆస్ట్రేలియా జట్లలో విధ్వంసకర ఆటగాళ్లకు కొదవలేదని, అదే ఆ జట్లకు ప్రధాన బలమని శాస్త్రి పేర్కొన్నారు. టాపార్డర్‌లో ఉన్న బ్యాటర్లలో ఎవరో ఒకరు మెరుపు సెంచరీతో చెలరేగితే, మిగిలిన వారు ఇచ్చే సహకారంతో టీమ్ స్కోరు సులువుగా 300 మార్కును చేరుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఊహకు అందని స్కోర్లు ఇప్పుడు నమోదు అవుతున్నాయని, ప్రస్తుత బ్యాటర్ల మైండ్‌సెట్ పూర్తిగా మారిపోయిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.ప్రస్తుతం టీ20 ప్రపంచకప్ చరిత్రను పరిశీలిస్తే, అత్యధిక స్కోరు రికార్డు శ్రీలంక పేరిట ఉంది. 2007లో కెన్యాపై లంక 260/6 పరుగులు చేయగా, ఆ తర్వాత ఇంగ్లాండ్ (230), సౌతాఫ్రికా (229), భారత్ (218) వరుస స్థానాల్లో ఉన్నాయి. అయితే అంతర్జాతీయ టీ20లలో (*20ఐ) ఇప్పటికే జింబాబ్వే 344 పరుగులు, నేపాల్ 314 పరుగులు, ఇంగ్లాండ్ 304 పరుగులు చేసి 300 మార్కును అధిగమించాయి. వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీల్లో కూడా ఇలాంటి భారీ స్కోర్లు నమోదయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి రవిశాస్త్రి చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఒకప్పుడు వన్డేల్లో 300 పరుగులు చేయడమే గగనంగా ఉండేదని, కానీ ఇప్పుడు టీ20ల్లోనే ఆ స్కోరు సాధ్యమని మాట్లాడుకోవడం ఈ క్రీడ ఎంతలా అభివృద్ధి చెందిందో తెలియజేస్తోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమ్ ఇండియా లేదా ట్రావిస్ హెడ్ వంటి హిట్టర్లు ఉన్న ఆస్ట్రేలియా.. ఈ రికార్డును ఎవరు ముందుగా అందుకుంటారో వేచి చూడాలి.

### ఫైనల్‌కు అల్కరాజ్, జకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించారు. తొలి సెస్‌లో అల్కరాజ్ పెను సంచలనం నమోదు చేశాడు. దాదాపు ఐదున్నర గంటల పాటు సాగిన ఈ పోటీలో అల్కరాజ్ 3వ సీడ్, జర్మనీకి చెందిన జ్వెరేవ్‌ను ఓడించాడు. ముఖ్యంగా ఐదో, చివరి సెట్‌లో 3–5పాయింట్లతో వెనుకబడి ఉన్న దశలో వరుసగా పాయింట్లను చేజిక్కించుకుంటూ.. ఆ సెట్‌ను 7–5తో చేజిక్కించు



కున్న తీరు వర్ణనాతీతం. చివరి పాయింట్ వరకు హోరాహోరీగా సాగిన ఉత్కంఠ మ్యాచ్‌లో అల్కరాజ్ 6–4, 7–6(7–5), 6–7(3–7), 6–7(4–7), 7–5తో ఆండీ జ్వెరేవ్‌ను ఓడించాడు. ఇందులో అల్కరాజ్ 12, జ్వెరేవ్ 17 ఏస్‌లను సంధించారు. ఇక రెండో సెస్ కూడా ఉత్కంఠభరితంగానే సాగింది. గతంలో జకోవిచ్‌పై విజయాలను నమోదు చేసుకున్న సిన్నర్ ఈసారి ఆ ప్రతిభను కనబర్చలేకపోయాడు. నువ్వా– నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 3–6, 6–3, 4–6, 6–4, 6–4తో మ్యాచ్‌ను ముగించాడు. ఈ మ్యాచ్ కూడా సుమారు నాలుగున్నర గంటలసేపు సాగింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో జకోవిచ్ రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కై కార్లోస్ అల్కరాస్‌తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్ టైటిల్ పోరు శనివారం జరగనుంది. టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకా, 5వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన రైబకినా టైటిల్‌కై తలపడనున్నారు. సెస్‌లో వీరు వరుససెట్లలో పెగులా, స్వీటోలీనాను ఓడించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ అండర్–14 బాలికల టైటిల్‌ను భారత్‌కు చెందిన జెన్సీ కనబార్ చేజిక్కించుకుంది.

# వుదయం సినిమా




## ఆ జ్ఞాపకాలు గుర్తొస్తాయి

'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో దర్శకుడిగా అందర్నీ మెప్పించారు అభిషన్ జీవింత్. ఇప్పుడాయన్ని హీరోగా పరిచయం చేస్తూ మదన్ తెరకెక్కించిన చిత్రం 'విత్ లవ్'. అన స్వర రాజన్ కథానాయిక. సౌందర్య రజనీకాంత్, మగేశ్ రాజ్ సమర్పిస్తు న్నారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా ఫిబ్ర వరి 6న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ.. "తొలిసారి ఈ టీజర్ చూసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఓ జంట మనసులోనే దాగి ఉండిపోయిన ప్రేమకథతో తెర కెక్కింది. తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది'' అన్నారు. "నా 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాన్ని గొప్పగా ఆదరిం చిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నేను హీరోగా నటించిన ఈ సినిమాని అలాగే ఆదరిస్తారని నమ్ము తున్నా. ఇది మంచి ప్రేమకథతో రూపొందిన చిత్రం. మనందరి జీవి తాల్లోని అందమైన జ్ఞాపకాల్ని తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది'' అన్నారు.

## సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

### ఫ్యామిలీ అంతా కలసి ఎంజాయ్ చేసే పండగ లాంటి సినిమా: హీరో శివాజీ



వింటేజ్ బ్లాక్ బస్టర్ కపుల్ హీరో శివాజీ, హీరోయిన్ లయ జంటగా నటిస్తున్న చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వం వహించారు. 90's వెబ్ సిరీస్ లో శివాజీతో కలిసి నటించిన బాల నటుడు రోహన్ తో పాటు అలీ, ధనరాజ్, రఘుబాబు, 30 ఇయర్స్ పృథ్వీ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి 12న డైరెక్ట్ ఈటీవి విన్ ఓటీటీ వేదికగా ఈ క్రైమ్ కామెడీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ డేట్ & సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు.

ప్రెస్ మీట్ లో హీరో శివాజీ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమా కథ విన్న వెంటనే నచ్చింది. ఈటీవీ విన్ వాళ్ళకి పంపించాను. ఈ ప్రాజెక్టు నాకు అప్పచెప్పారు. ఈటీవీతో నాకు ఎంతో మంచి అనుబంధంగా ఉంది. నేను మళ్ళీ ఈ రోజు మీ ముందు కనిపించడానికి కారణం బాపినీడి గారు. ఆయన ప్రోత్సాహంతోనే 90's వెబ్ సిరీస్ చేశాను. నేను చాలా కష్టాల్లో ఉన్నప్పుడు ఈటీవీ నాకు మళ్ళీ అవకాశం ఇచ్చింది. అది నేను ఎప్పటికీ మర్చిపోలేను. సుధీర్ కొత్త దర్శకుడు అయినప్పటికీ కథను చాలా అద్భుతంగా చెప్పా.డు తను చె ప్పి న కథను అద్భుతంగా తీస్తాడని నమ్మకం కూడా ఉంది. సుధీర్ కి నచ్చిన టీం తోనే ఈ సినిమా చేసాం. ఈ సినిమాలో చాలా పాపులర్ ఆర్టిస్టులు ఉన్నారు. సినిమా చాలా బాగుంటుంది. ఫ్యామిలీ అంతా కూర్చుని ఒక సంక్రాంతి పండక్కి ఫ్యామిలీ సినిమా చూస్తే ఎలా ఉంటుందో అలాంటి సినిమా ఇది. ఈ సాంగ్ 20 సంవత్సరాలు క్రితం విన్నది. వాళ్ళ దగ్గర రైట్స్ తీసుకుని కంపోజిషన్ చేయడం జరిగింది. ఈ సినిమాకి ప్రతి టెక్నీషియన్ చాలా పాషన్ తో పనిచేశారు. ప్రిన్స్ బెస్ట్ యాక్టర్. ఈ సినిమా ద్వారా తను ఇంకో రకమైన షేడ్ లో చూస్తారా. అలాగే రఘుబాబు గారు ఆలీ గారు పృథ్వి గారు చమ్మక్ చంద్ర చాలామంది మంచి ఆర్టిస్టులు ఉన్నారు. లయ గురించి ఎంత చెప్పినా తక్కువే. చాలా అద్భుతంగా సపోర్ట్ చేసింది. మంచి హిట్ సినిమా అవ్వాలని చాలా కష్టపడింది. బండ్ల గణేష్ నా బ్రదర్ లాంటివారు. ఆయన పాదయాత్ర అద్భుతంగా జరుగుతోంది. ఈ సినిమాలో మంచి సాంగ్ చేశారు. అది చాలా హెల్ప్ అయ్యింది. రంజిన్ రాజ్ అద్భుతమైన బ్యాగ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. రోహన్ గాడ్ గిఫ్ట్ యాక్టర్. తను ఎన్నో ఏళ్ళు సినిమాలు చేయాలని నా కోరిక. అరకు, కొండవీడు ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చేశాం అక్కడ పోలీసులు ఎంతో సహకరించారు. చాలా మంచి ప్రోడక్ట్ వచ్చింది. 90స్ లో ఒక స్టార్ట్ అయింది. ఈ సినిమాతో అది నెక్స్ట్ లెవెల్ కి వెళ్తుంది. ఈటీవీ ప్యూర్ తెలుగు ప్లాట్ ఫామ్. ఎంతోమంది టెక్నీషియన్స్ కి ఆర్టిస్టులకి పెద్ద బూస్ట్. అందరూ కూడా ఈటీవీ విని సబ్స్క్రైబ్ చేసుకోవాల్సిందిగా కోరుకుంటున్నాను. ఒక మంచి కంటెంట్ 12 తారీకున మీ ముందుకు రాబోతోంది. సపోర్ట్ చేసిన అందరికీ థాంక్యు. అలాగే దండోరాని హిట్ చేసిన అందరికీ థాంక్స్. ఈ సినిమాను కూడా సూపర్ హిట్ చేస్తారని ఆశిస్తున్నాను.

హీరోయిన్ లయ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మిస్సమ్మ అదిరిందయ్యా చంద్రం టాటా బిర్లా మధ్యలో లైలా ఇలా ఎన్నో డిఫరెంట్ సినిమాలు చేశాం. మిస్సమ్మ అందరూ చా లా బాగా కనెక్ట్ అ య్యా రు రత్నమాల ని గుర్తు పెట్టుకున్నారు. ఇక నుంచి ఉత్తరని గుర్తు పెట్టుకుంటారు. ఈ కథ విన్నపట్టుకునే చాలా నచ్చింది. ఉత్తర నా కెరియర్ లో చాలా స్పెషల్ క్యారెక్టర్ అవుతుంది. నటీనటులకు టెక్నీషియన్స్ కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది చాలా మంచి క్రైమ్ కామెడీ. చాలా రోజుల తర్వాత ఈ జానర్ లో సినిమా వస్తోంది. అలాగే మోస్ట్ అవైటెడ్ పెయిర్ శివాజీ గారు లయ గారు కలిసి నటించిన సినిమా. శివాజీ గారు చాలా రోజుల తర్వాత 90 చేశారు. అది చాలా పెద్ద హిట్ అయింది.

డైరెక్టర్ సుధీర్ శ్రీరామ్ మాట్లాడుతూ.. శివాజీ గారికి ధన్యవాదాలు. ఆయన ఫస్ట్ హీరో, ప్రొడ్యూసర్. ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. ఈ సాంగ్ విషయంలో కూడా శివాజీ గారికి థాంక్స్ చెప్పాలి. ఆ సాంగ్ యాడ్ చేసిన తర్వాత సినిమా మరింత అద్భుతంగా కనిపించింది. ఆ సాంగ్ సినిమాకి చాలా హెల్ప్ అయ్యింది.

యాక్టర్ ప్రిన్స్ మాట్లాడుతూ.. శివాజీ గారు ఈ మధ్య కాలంలో చేస్తున్న కోర్ట్ దండోరా సినిమాలు వరుస విజయాలు సాధించాయి. ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. ఆయనతో కలిసి పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. ఆయనతో మరిన్ని ప్రాజెక్ట్ చేయాలని కోరుకుంటున్నాను. శివాజీ గారు లయ గారిది హిట్ కాంబినేషన్. ఆ కాంబినేషన్లో మళ్ళీ వస్తున్న ఈ సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది

సింగర్ భోలే షావలి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. శివాజీ గారు ఒకరిని గెలిపించాలనుకునే వ్యక్తి. నాకు సాంగ్ ఇస్తానని మాట ఇచ్చారు. నిజంగానే ఆయన మాట నిలబెట్టుకున్నారు. నాకు ఈ సాంగ్ అవకాశం ఇచ్చిన శివాజీ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఈ పాటలో చేసిన అలీ గారు బండ్ల గణేష్ గారు అందరూ అద్భుతంగా చేశారు. తప్పకుండా మీ అందరికీ అలరిస్తుంది

చైల్డ్ ఆర్టిస్ట్ రోహన్ మాట్లాడుతూ.. శివాజీ గారితో మరొకసారి పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇది మంచి క్రైమ్ కామెడీ సినిమా. మీ అందరికీ నచ్చుతుంది. ఫిబ్రవరి 12న రిలీజ్ అవుతున్న ఈ సినిమాని తప్పకుండా అందరూ చూడాలని కోరుకుంటున్నాను



## అవి అంటే చాలా ఇష్టం

టాలీవుడ్ యాంకర్ కమ్ నటి అనసూయ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఈ భామ జబర్దస్త్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ షో ద్వారా ఎంతో పేరు సంపాదించుకుంది. దీంతో ఈ చిన్నదానికి సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. అలా రామ్ చరణ్ నటించిన 'రంగస్థలం' మూవీలో రంగమ్మత్తగా నటించి మెప్పించింది. దీంతో అక్కడి నుంచి ఆమె కెరీర్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఆ తర్వాత కూడా 'పుష్ప', 'పుష్ప-2' వంటి భారీ సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఇదిలా ఉంటే.. అనసూయ సోషల్ మీడియా లో చేసే రచ్చ అంతా ఇంతా కాదు. నిత్యం ఫొటోలు, వీడియోలు పంచుకుంటూ.. తన అభిమానులతో తరచూ కమ్యూనికేట్ అవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా అనసూయ తన సోషల్ మీడియాలో ఓ వీడియో షేర్ చేసింది. అందులో తుప్పల్లో పాము ఉన్న దాన్ని క్యాప్చర్ చేసింది. ఇక దానికి.. 'నాకు పాములను ఇష్టమని చెప్పనా.. అవి నాకు చాలా ఆకర్షణీయంగా అనిపిస్తున్నాయి' అని క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు ఛీ ఎవరైనా పాములను ఇష్టపడతారా ఏం టేస్ట్ అమ్మ నీది.. నీ టేస్ట్ దరిద్రంగా ఉంది అంటూ పొట్టు పొట్టుగా తిడుతున్నారు.



**హాస్య నటుడుగా తెలుగు సినీ స్వర్ణయుగంలో రాణించిన రమణారెడ్డికి మేజిక్ అంటే చాలా ఇష్టం. సినిమాల్లోకి వచ్చిన తరువాత అన్నా చెల్లెళ్లు చిత్రంలో మెజీషియన్ పాత్ర పోషించే సందర్భం రాగా ఎం. శేషాద్రి అనే ప్రముఖ మెజీషియన్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందారు. రమణారెడ్డి విడిగా కూడా అనేక ప్రదర్శనలు యిచ్చి జనాన్ని బాగా ఆకట్టుకున్నాడు.**

## హాస్యంతో మ్యాజిక్ !

సినీ నటుడుగా ఎలా అయ్యారంటే నెల్లూరు జిల్లాలోని జగదేవపేటలో 1.10.1921న వ్యవసాయం చేసుకునే తిక్కవరపు కోటమ్మ, సుబ్బారెడ్డి దంపతులకు వెంకట రమణారెడ్డి జన్మించారు. విఆర్ కాలేజీలో ఇంటర్ చదువు పూర్తవ్వగానే నెల్లురులోనే శానిటరి ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించేవారు.

సర్వోదయ పతాకాన తెలుగు,తమిళ భాషల్లో వై.వి రావు దర్శకత్వంలో' మానవతి' చిత్రాన్ని నిర్మాత ఎ. శంకర రెడ్డి సి.హెచ్. నారాయణరావు, జి.వరలక్ష్మిలతో 1951లో ప్రారంభిస్తూ తమ నెల్లూరు ప్రాంతానికి చెందిన రమణారెడ్డిని నటుడుగా పరిచయం చేయాలని నిర్ణయించి, అవకాశం ఇచ్చారు. కె.ఎస్ ప్రకాశరావు స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'దీక్ష 'చిత్రంలోను నటించే అవకాశం వెంటనే లభించింది.దీక్ష చిత్రం ముందుగా అంటే 1951లోను, మానవతి ఆ తరువాత 1952 లో విడుదలయ్యాయి.

బంగారు పాపలో ముక్కుతో స్వరం వచ్చినట్లు గా మాట్లాడిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. మిస్సమ్మ చిత్రంలో అప్పు ఇచ్చే డేవిడ్ గా సావిత్రిని ప్రేమించి ఆమె ప్రేమ కోసం ఆరాట పడే వాడిగా విలనిజం చూపడం, ఆమెను, ఆమె తల్లి దండ్రులను వేదనకు గురి చేసిన తీరులో హాస్యం కూడా కలగలపడంతో అలరించాడు.మాయబజార్ లో ఘటోత్కచుని పరివారానికి గురువైన చిన్నమయ్యగా, గుండమ్మ కథలో ఘంటయ్యగా నటించిన విధానాల వల్ల తిక్కవరపు వెంకట రమణారెడ్డికి ఇటు ప్రేక్షకలోకం, అటు చిత్రసీమ నీరాజనాలు అర్పిస్తూండటంతో మంచి గుర్తింపు వచ్చింది. ప్రతి సినిమాలో తన పాత్ర ఏదైనానెల్లూరుమాండలికంతోనే మాట్లాడటం ఈయనప్రత్యేకత. పెళ్లినాటి ప్రమాణాలులో సలహాదారుగా ఛాయాదేవి భర్తగా నటించి మెప్పించారు. సువర్ణ సుందరి, గుండమ్మ కథ, పూజాఫలం, గుడిగంటలు తదితర చిత్రాలతో ప్రత్యేక తరహాలో విలనిజం కూడా హాస్యానికి కలగలిపి ఆకట్టుకున్నారు. రోజులు మారాయి , దీపావళి చిత్రాలలో తండ్రి పాత్రని కరుణరస ప్రధానంగా పోషించారు.కంచుకోటలో దళపతిగా, వీర కంకణంలో మహారాజుగా , అగ్గిబరాటాలో మంత్రాల బసవయ్యగా గుర్తింపు తెచ్చుకున్నారు. రేలంగి రమణారెడ్డి కాంబినేషన్ కి

### పేరు తెచ్చిన పాటలు

సువర్ణసుందరి చిత్రంలో రేలంగితో కలిసి 'ఏరా మన తోటి గెలిచే వీరులెవ్వరురా రణ శూరులెవ్వరు రా... 'పాటలో చూపిన అభినయం, కులగోత్రాలు చిత్రంలో పేకాట పిచ్చోడుగా నటించిన రమణారెడ్డిపై చిత్రీకరించిన 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే ..జేబులు ఖాళీ ఆయెనే ఉన్నది కాస్త వూడింది సర్వ మంగళం పాడింది. ... 'పాటలో కండువా తలమీద వేసుకుని నటించిన తీరు ఆకట్టుకుంది. అక్కా చెల్లెళ్లు చిత్రంలో మెజీషియన్ పాత్ర మరోసారి పోషించి ఒక అమ్మాయి మీద ప్రేమలో పడతాడు. ఈ సందర్భంలో రమణారెడ్డిపై 'ఇండియాకు రాజధాని ఢిల్లీ నా గుండెల్లో ప్రేమరాణి లిల్లీ ...' అంటూ చిత్రీకరించిన గీతంలో చక్కని నటన చూపారు. అంతస్థులు చిత్రంలో వీధి గీతంగా భానుమతి 'దులపర బుల్లోడా దుమ్ము దులపర బుల్లోడా...' గీతంలో రమణారెడ్డి నటన బాగుంటుంది.

రమణారెడ్డి సూర్యకాంతం కాంబినేషన్‌కి మంచి పేరుండేది. వీరు కనిపిస్తే ప్రేక్షకులు గుక్క తిప్పుకోకుండా నవ్వుకునేవారు. అందుకే పంపిణీదార్లు కూడా నిర్మాత దర్శకులను ఈ కాంబినేషన్ గురించే ఒత్తిడి చేసేవారు.

ఇల్లరికం చిత్రంలో రమణారెడ్డి ,రేలంగి మామా అల్లుళ్లుగా చేసిన సందడి అంతా ఇంతా కాదు. డబ్బులేని అల్లుడు తన ఇంట్లో అన్నం తింటుంటే కారం కలుపుతాడు. అది చూసిన రేలంగి "బల్లి--- మావయ్యా బల్లి ---"అని కంగారు పెడతాడు. రమణారెడ్డి దృష్టి మళ్లగానే భోజనం ప్లేటు మార్చేస్తాడు రేలంగి. తను కలిపిన కారంతో తనే అన్నం తిని గోలగోల చేయడం, నీళ్లు తెస్తానంటూ రేలంగి వెళ్లి కుండలో నీళ్లు తెస్తూ బద్దలు కొట్టడంతో రమణారెడ్డి చూపిన హావ భావాలు మరపురావు.

**మేజిక్ ప్రదర్శనలపైఎక్కువఆసక్తి వున్న** రమణారెడ్డి విడిగా అనేక ప్రదర్శనలు యిచ్చి ఆకట్టుకున్నాడు.గాలి లోంచి వస్తువులను రాబట్టడం, బ్లేడులు జనానికి చూపించి వాటిని మింగేసి మళ్లీ వాటిని బైటికి తీయడం తన దగ్గరున్న అసిస్టెంట్ ని గాలిలో తిప్పడం వంటి గమ్మత్తులతో తన మేజిక్ ప్రదర్శనలకు విశేష ఆదరణ లభించేలా చేసేవారు. తన సరదా తీర్చుకోవడానికి, ప్రజలకు సాయంచేసే సామాజిక సంస్థలకు ధన సహాయం చేయడానికి ఆ సంస్థల వద్ద దారి ఖర్చులు మాత్రమే తీసుకుని పలు ప్రదర్శనలు యిచ్చేవారు.

మద్రాసులో సినిమా ఆర్టిస్టుగా ప్రయత్నాలు చేస్తున్నప్పుడు, ఆ తరువాత షూటింగ్ లు లేని విరామ సమయాల్లో పాండీ బజార్లో ఒక చెట్టు కింద కాలక్షేపం చేసేవారు. సి.ఎస్. ఆర్ కూడా ఒక చెట్టు దగ్గర కబుర్లు చెప్పేవారు. అందుకే వాటిని రమణారెడ్డి చెట్టు, సి.ఎస్. ఆర్ చెట్టు అని పిలిచేవారు. కాఫీలు తాగుతూ, సిగరెట్టు కాలుస్తూ సినిమా కబుర్లు ఇతర విషయాలు ముచ్చటించేవారు సహనటులతో. నిల్చున్నచోటనే గుబుక్కున కింద పడిపోవడం, ఉన్నట్టూండి ఎగరడం, గాలిలో తేలిపోతు న్నట్టుగా నడిచే విధానం వంటి మేనరిజాలతో వెండి తెరపై ఉత్సాహపరిచేవారు.పాండవ వనవాసం, ఆత్మబలం, దాగుడుమూతలు, అంతస్తులు,మనుషులు మమతలు, సత్య హరిశ్చంద్ర, రహస్యం, నిన్నేపెళ్లాడుతా, ముద్దుబిడ్డ, అత్తా ఒకింటి కోడలే, ఉయ్యాలా జంపాల, ఈడు జోడు ఇలా రెండు వందలకు పైగా చిత్రాలలో తన నటనతో అలరించారు. డబ్బింగ్ ఆర్టిస్టుగాను రమణారెడ్డి వ్యవహరించారు. .నిజ జీవితంలో సౌమ్యంగా వుండటం, గట్టిగా మాట్లాడక పోవడం, ఎవరినీ పల్లెత్తు మాట అనకపోవడం ఆయన లక్షణాలు.కామెడీ విలన్ గాను, హాస్య నటుడుగాను క్యారెక్టర్ రోల్స్‌లోను ఇమిడిపోతూనే తన మేనరిజాలతో మెప్పించి తనివితీరా నవ్వించడంలోను అతడికి అతడే సాటి. చివరి వరకు సన్నగా పొడవుగా రివటలా కనిపిస్తూ అన్నింటా అసాధ్యు దనిపించే రమణా రెడ్డి 11.11.1974 న

వ





-ఎ.ఎస్.ఆర్. కేశవ రావు
సెల్:9989235320





## ఒంపులతో గత్తరలేపుతుంది

'నన్ను దోచుకుందువటే' మూవీతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన నభా నటేష్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత 'అదుగో' అనే సినిమాలో నటించింది. కానీ ఈ చిత్రం అంతగా విజయం సాధించలేకపోయింది. ఆ తర్వాత ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోసాని నటించిన 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో ఫుల్ ఫామ్‌లోకి వచ్చింది. దీంతో ఈ చిన్నదానికి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', డార్లింగ్ వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం నిఖిల్ సరసన 'స్వయంభు'మూవీతో పాటు నాగబంధం సినిమాలో నటిస్తోంది. అలాగే సోషల్ మీడియా లో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ తన అందచందాలతో కుర్రకారుకు అందాల విందును వడ్డిస్తుంది. ప్రస్తుతం ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. తాజాగా నభా తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో నడుము పార్ట్స్ తో పాటు బ్రెస్ట్ పార్ట్స్ కనిపించేలా బోల్డ్ షో చేసింది. ఇక వాటికి.. 'జంట' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక వీటిని చూసిన నెటిజన్లు ఉఫ్.. పిరాగిపోతోంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.